RNI NO.TELTEL / 2013 /50370

ప్రకటనల కోసం
సంప్రదించండి
98483 28698

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

Estd : 2002

# జనంసాక్షి

www.janamsakshi.org

గురువారం 13.08.2026 | సంపుటి :13 సంచిక : 24 | పేజీలు :12 వెల : రూ. 4/-




హైదరాబాద్ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్

## ఆ 3 అంశాలను ఎజెండా నుంచి తొలగించండి




బీఆర్ఎంబీ సమీక్షలో అంశాలపై తెలంగాణ తీవ్ర అభ్యంతరం

హైదరాబాద్,ఆగస్ట్12(జనంసాక్షి): గోదావరి రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు అజెండాపై తెలంగాణ ప్రభుత్వం అభ్యంతరాలు వ్యక్తం చేసింది. ఈ నెల 18వ తేదీన జీఆర్ఎంబీ 18వ సమావేశం జరగనుంది. తెలంగాణ ప్రాజెక్టులపై మూడు అంశాలు అజెండాలో పెట్టడంపై అభ్యంతరం తెలిపింది. సమ్మక్క బ్యారేజీకి అనుమతులు నిలిపివేయాలనే అంశాన్ని తొలగించాలని మిగతా 2లో..

## 'సర్' ధృవీకరణ పత్రంగా ఫ్యామిలీ రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్లు ఒప్పుకోం




- స్పష్టం చేసిన కేంద్ర ఎన్నికల సంఘం
- తెలంగాణలో పెరిగిన పోలింగ్ కేంద్రాలు

హైదరాబాద్(జనంసాక్షి): ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) ధ్రువీకరణ పత్రంగా ఫ్యామిలీ రిజిస్టర్ సర్టిఫికెట్ చెల్లదని కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీఐ) స్పష్టం చేసింది. ఫ్యామిలీ రిజిస్టర్ సర్టిఫికెట్ జారీపై జులై 25న తెలంగాణ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. రేషన్ మిగతా 2లో..



## కల్యాణలక్ష్మి, షాదీముబారక్‌పై తెలంగాణ హైకోర్టు స్టే

హైదరాబాద్(జనంసాక్షి): కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలపై తెలంగాణ హైకోర్టు స్టే విధించింది. చట్టబద్ధత లేకుండా కేవలం జీవోల ద్వారా ఈ పథకాలను అమలు చేస్తున్నారంటూ న్యాయవాది విజయ్ గోపాల్ ఉన్నత న్యాయస్థానంలో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై గతంలో హైకోర్టు విచారణ చేపట్టింది. చట్టసభల్లో తీర్మానం చేయకుండా తీసుకొచ్చిన పథకాలు చెల్లవని విజయ్ గోపాల్ వాదించారు. గత విచారణ సందర్భంగా కౌంటర్ దాఖలు చేయాలని ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశాలు జారీచేసింది. 4 వారాలైనా ప్రభుత్వం కౌంటర్ దాఖలు చేయలేదని విజయ్ గోపాల్ మిగతా 2లో..

# గోదావరి జలాల గరిష్ట వినియోగం

- ఎల్లంపల్లి, దేవాదుల, సీతారామ నుంచి సాధ్యమైనంత మేర ఎత్తిపోతలు
- సుందిళ్ల, అన్నారం, మేడిగడ్డలో ఎన్డీఎస్ఏ సూచనలు పాటించాలి
- పరిహారం, పునరావాసం చెల్లింపులు వేగవంతం చేయాలి
- గూడెందొడ్డి పంప్డ్‌స్టోరేజీకి కన్సల్టెంట్‌ను నియమించాలి
- నీటిపారుదల శాఖ సమీక్షలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాలు

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డితో కలిసి ఉన్నతస్థాయి సమీక్ష




హైదరాబాద్(జనంసాక్షి):గోదావరి జలాలను గరిష్ట స్థాయిలో వినియోగించుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. ఎల్లంపల్లితో పాటు దేవాదుల, సీతారామ ప్రాజెక్టుల నుంచి సాధ్యమైనంత మేరకు ఎత్తిపోతలు చేపట్టాలన్నారు. రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డితో కలిసి నీటి పారుదల శాఖపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎంసీఆర్‌హెచ్ఆర్డీలో మిగతా 2లో..

## మిల్లర్ల నుంచి బకాయిలు వసూలు చేయండి

- ఇందుకోసం విధివిధానాల రూపకల్పన
- వారి బ్లాక్‌మెయిల్‌ను ఎట్టి పరిస్థితిలో సహించం
- ధాన్యం నిల్వకు ఐదు నియోజకవర్గాల్లో సైలో బ్యాగ్ నిర్మాణాలు
- డిఫాల్టర్ల మిల్లులను మహిళలకు అప్పగించాలి
- పౌరసరఫరాల సమీక్షలో సీఎం రేవంత్ రెడ్డి

2లో..

## ఆర్మీ రిక్రూట్‌మెంట్‌లో యువతకు ప్రోత్సాహం ఇవ్వాలి

- అవసరమైన శిక్షణ ఇవ్వడానికి తెలంగాణ ప్రభుత్వం సిద్ధంగా ఉంది
- సీఎం రేవంత్‌తో లెఫ్టినెంట్ జనరల్ సి.రాజేష్ పుష్కర్ భేటీ

## క్యూర్‌లో ఇందిరమ్మ ఇళ్లకు శ్రీకారం

18 టవర్ల నిర్మాణాలకు నేడు భూమిపూజ

హైదరాబాద్(జనంసాక్షి): హైదరాబాద్ నగరంలో పేదల సొంతింటి కల నెరవేరే దిశగా మరో కీలక అడుగు త్వరలోనే పడనుంది. అత్యంత ఖరీదైన ప్రాంతంలోని భూమిలో ఇందిరమ్మ టవర్స్ నిర్మించేందుకు అధికార యంత్రాంగం ఏర్పాట్లు చేస్తోంది. ఇటీవల దరఖాస్తుల గడువు 15 వరకు పెంచారు. నేడు కుదరకపోతే ఈ వారంలో భూమి పూజ చేసే అవకాశం ఉన్నట్లు సమాచారం. ఇందుకు కేపీహెచ్‌బీలోని మలేషియన్ టౌన్‌షిప్ ఎదురుగా ఉన్న హౌసింగ్ బోర్డుకు చెందిన స్థలంలో బహిరంగ సభకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ సందర్భంగానే సీఎం రేవంత్‌రెడ్డి.. టవర్లకు సంబంధించిన మిగతా 2లో..

## సీఎం సోదరుల భూకుంభకోణం ముమ్మాటికీ నిజం

- మేం టి హబ్‌ను తెస్తే..వారు అనుముల హబ్స్‌తో దోపిడీ చేస్తున్నారు
- మరోసారి కేటీఆర్ విమర్శలు



హైదరాబాద్(జనంసాక్షి): ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోదరులు భూకుంభకోణాలకు పాల్పడుతున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపణలు గుప్పించారు. సోషల్ మీడియా ఎక్స్ వేదికగా స్పందిస్తూ.. 'ఇన్నోవేటర్ ఆఫ్ ది సెంచరీ'గా అనుముల కొండల్ రెడ్డిని ప్రకటించాలని ఎద్దేవా చేశారు. నిజమైన స్టార్టప్‌లు ఎదగాలని, నిరుద్యోగ యువతకు ఉపాధి దక్కాలని తాము కష్టపడి టి హబ్‌ను 'ను నిర్మిస్తే... సీఎం రేవంత్ రెడ్డి మాత్రం తన కుటుంబ ప్రయోజనాల కోసం 'అనుముల హబ్స్' ఏర్పాటు చేయడంలో బిజీగా ఉన్నారని విమర్శించారు. ఇది ఫ్యామిలీ-రన్.. ఫ్యామిలీ-డ్రైవ్.. జీరో ఇన్నోవేషన్.. జీరో ఎంప్లాయిస్ స్కామ్ అంటూ ఆరోపించారు. అనుముల సోదరుల్లో మిగతా 2లో..

## అసత్య ప్రచారంతో ప్రజలను పక్కదోవ పట్టించొద్దు

- ప్రభుత్వం నిబంధనల ప్రకారమే భూకేటాయింపులు
- కేటీఆర్ చెబుతున్న రూ.200 కోట్లు ఎక్కడివో చెప్పాలి
- నీటి వాటాల్లో బీఆర్ఎస్ వైఖరి వల్లే తెలంగాణకు నష్టం
- అసత్యాలను ప్రచారం చేయడం కేటీఆర్‌కు అలవాటే..
- మీడియా సమావేశంలో మండిపడ్డ మంత్రి శ్రీధర్ బాబు



హైదరాబాద్(జనంసాక్షి):నగరంలో భూ కేటాయింపుల వ్యవహారంపై అధికార, ప్రతిపక్షాల మధ్య మాటల యుద్ధం కొనసాగుతోంది. భూ కేటాయింపులపై భారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేసిన ఆరోపణలపై మంత్రి శ్రీధర్‌బాబు స్పందించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఎకరా భూమిని రూ.90 లక్షలకే కేటాయించారని, తమ ప్రభుత్వం నిబంధనల ప్రకారం ఎకరా కోటిన్నర లెక్కన కేటాయించినట్లు స్పష్టం చేశారు. ఐదు ఎకరాల భూమిని రూ.7.5 కోట్లకు ఇచ్చామని చెప్పిన శ్రీధర్‌బాబు.. కేటీఆర్ చెబుతున్న రూ.200 కోట్ల లెక్కలు ఎక్కడి నుంచి వచ్చాయో చెప్పాలని డిమాండ్ చేశారు. అసత్య ప్రచారంతో ప్రజలను పక్కదోవ పట్టించొద్దని కేటీఆర్‌కు మంత్రి సూచించారు. హిల్ట్ పాలసీతో హైదరాబాద్ ప్రజలకు ప్రయోజనం చేకూరుతుందని.. పారిశ్రామికవేత్తలను మిగతా 2లో..

NTA NET

## నీట్ పేపర్ లీక్‌పై 20వేల పేజీల ఛార్జిషీట్..


విచారణకు ఫాస్ట్‌ట్రాక్ కోర్టు సిద్ధం

న్యూఢిల్లీ(జనంసాక్షి):నీట్ యూజీ ప్రశ్నపత్రం లీక్ వ్యవహారం ఇటీవల దేశాన్ని కుదిపేసింది. ఈ కేసులో సీబీఐ దాఖలు చేసిన ఛార్జిషీట్‌ను ఢిల్లీలోని ప్రత్యేక ఫాస్ట్‌ట్రాక్ కోర్టు పరిగణనలోకి తీసుకుంది. 13 మంది నిందితులపై దాదాపు 20 వేల పేజీల ఛార్జిషీట్‌ను సమర్పించినట్లు సమాచారం. "360 మంది సాక్షులు, 422 డాక్యుమెంట్లు, 43 భౌతిక సాక్ష్యాలను అభియోగపత్రంలో పొందుపర్చాం" మిగతా 2లో..

## ఇళ్ల కేటాయింపులో తెలంగాణ రాష్ట్రానికి ప్రాధాన్యం ఇవ్వండి

పేదలకు ఇళ్ల సౌకర్యం పెంచండి • కేంద్రమంత్రి శివరాజ్‌సింగ్‌కు మంత్రి పొంగులేటి వినతి

న్యూఢిల్లీ,ఆగస్ట్12(జనంసాక్షి):ప్రధానమంత్రి ఆవాస్ యోజన గ్రామీణ్ కింద తెలంగాణ రాష్ట్రానికి సమగ్ర ప్రాతిపదికన ఒకేసారి 11,56,915 ఇళ్లను కేటాయించాలని తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం న్యూఢిల్లీలో కేంద్ర వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌ను పొంగులేటి కలిసి ఈ మేరకు వినతిపత్రాన్ని అందజేశారు. గతంలో ముఖ్యమంత్రి . రేవంత్‌రెడ్డి రాసిన లేఖను ఈ సందర్భంగా పొంగులేటి గుర్తుచేశారు. రాష్ట్రంలో ఇళ్ల కేటాయింపు ప్రక్రియను వేగవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.రాష్ట్రవ్యాప్తంగా 'ఆవాస్ ప్లస్ 2024' యాప్ ద్వారా అత్యంత పారదర్శకంగా ఇంటింటి సర్వే నిర్వహించామని మంత్రి పొంగులేటి వివరించారు. ఈ సర్వేలో 11.56 లక్షలకు పైగా గ్రామీణ పేద కుటుంబాలు ఇళ్లకు అర్హులుగా తేలాయని తెలిపారు. వీటికి సంబంధించి సూపర్ చెక్, అనర్హుల తొలగింపు ప్రక్రియలన్నీ ఏడాది క్రితమే పూర్తయినప్పటికీ, కేంద్రం నుంచి లక్ష్యాల ప్రకటనలో జాప్యం జరుగుతోందని పేర్కొన్నారు. మిగతా 2లో..



## షార్ట్‌కట్ కోసం వెంపర్లాడితే నష్టమే

- అర్థవంతమైన మార్గంలో సాగితేనే మంచిది
- జెన్‌జీలకు ప్రధాని మోడీ సూచన
- కోవింద్ సూచనలు దేశాన్ని కొత్త దిశలో నడిపించనున్నాయి
- మాజీరాష్ట్రపతి బయోగ్రఫీ' ట్రయంఫ్ ఆఫ్ ది ఇండియన్ రిపబ్లిక్' ఆవిష్కరించిన ప్రధాని


న్యూఢిల్లీ,ఆగస్ట్12(జనంసాక్షి): ప్రధాని నరేంద్ర మోదీ జెన్‌జీ యువతకు కీలక సూచన చేశారు. షార్ట్‌కట్ కోసం వెంపర్లాడితే నష్టపోయే ప్రమాదమే ఎక్కువని ప్రధాని హెచ్చరించారు. జీవితంలో ముందుకుసాగే క్రమంలో అర్థవంతమైన మార్గాలను ఎంచుకోవాలని హితవు పలికారు. మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ ఆత్మకథ పుస్తకం విడుదల సందర్భంగా ఆయన మాట్లాడారు. కొందరు వ్యక్తులు వేగంగా గమ్యాన్ని చేరుకునేందుకు ఫుట్‌బ్రిడ్జిలను వాడకుండా రైల్వే ట్రాక్‌లను దాటుతుంటారని మోదీ గుర్తుచేశారు. అలాంటి వారికోసమే రైల్వే స్టేషన్లలో బోర్డులపై ప్రదర్శించే హెచ్చరికలు జీవిత పాఠాలను నేర్పుతాయన్నారు. మన ఆలోచనలపై ప్రభావం చూపించే ఇన్‌ఫ్లుయెన్సర్లు, రీల్స్ పట్ల జాగ్రత్తగా ఉండాలి. మీరు ముందుకు వెళ్లే మార్గం కావాలనుకుంటే.. మీరు ఆరాధించే వ్యక్తుల ఆత్మకథ చదవండని సూచించారు. ఇటీవల కాలంలో మోదీ జెన్‌జీ యువతతో కనెక్ట్ అయ్యేలా తన సోషల్ మీడియా యాక్టివిటీలో మార్పులు చేసుకుంటున్నారు. ఇన్‌స్టాగ్రామ్‌లో సెల్ఫీ వీడియోలను పోస్టు చేస్తున్నారు. మిగతా 2లో..



## 100% టారిఫ్‌ల అంశాన్ని ట్రంప్-మోదీ చూసుకుంటారు

ఆ సమస్యను వారివురూ చర్చించి పరిష్కరించుకుంటారు : పీటర్ నవారో

వాషింగ్టన్(జనంసాక్షి):రష్యా నుంచి భారత్ చమురు కొనుగోలు అంశంపై ట్రంప్ మోదీ చర్చించి సమస్యను పరిష్కరించుకుంటారని ట్రంప్ సలహాదారు పీటర్ నవారో తెలిపారు. ఇరువురు నేతలకు మంచి సంబంధాలు ఉన్నాయని చెప్పారు. ఈ విషయంలో ఎవరు జోక్యం చేసుకోవాల్సిన అవసరం లేదన్నారు. ఉక్రెయిన్‌పై రష్యా దాడి తర్వాత భారత్ ఆ దేశం నుంచి చమురు కొనుగోళ్లను భారీగా పెంచిందని నవారో చెప్పారు. యుద్ధానికి ముందు రష్యా చమురు వ్యాపారంలో భారత్ పెద్దగా భాగస్వామి కాదని, తర్వాత కొనుగోళ్లు గణనీయంగా పెరిగాయని తెలిపారు. రష్యా చమురు ఉత్పత్తులను భారత్ కొనడం ద్వారా మిగతా 2లో..



## యశ్వంత్ వర్మ దోషే..



- మాజీ జడ్జి ఇంట్లో భారీగా నోట్ల కట్టలు లభించిన కేసులో తేల్చిన కమిటీ
- పార్లమెంటులో నివేదిక సమర్పణ

న్యూఢిల్లీ,ఆగస్ట్12(జనంసాక్షి):ఇంట్లో భారీగా నోట్ల కట్టలు లభించిన కేసులో ఢిల్లీ హైకోర్టు మాజీ జడ్జి యశ్వంత్ వర్మ దోషిగా తేలారు. అతడిపై మోపిన అభియోగాలు అన్నీ నిజమేనని లోక్‌సభ ప్యానెల్ నిర్ధరించింది. అయితే, ఈ విషయంలో అతడిపై ఏ చర్యలు తీసుకుంటారనే విషయంలో ఇంకా స్పష్టత లేదు. ఢిల్లీ హైకోర్టు మాజీ జడ్జి, రిటైర్డ్ జస్టిస్ యశ్వంత్ వర్మ ఢిల్లీలోని 30 తుగ్లక్ రోడ్డులోని మిగతా 2లో..

### పార్లమెంట్‌లో చర్చకు సిద్ధం

ప్రతి ప్రశ్నకూ సమాధానం చెబుతా :అమిత్ షా

2లో..

### ఎల్బీనగర్ పీఎస్‌లో కానిస్టేబుల్ ఆత్మహత్య

పోలీస్ స్టేషన్ ఎదుట కుటుంబ సభ్యుల ఆందోళన

2లో..

### కేరళ పేరు మార్పు బిల్లుకు రాజ్యసభ ఆమోదం

2లో..

### మహిళా బిల్లుకు ఓకే.. డీలిమిటేషన్‌కు విజయ్ నో

అసెంబ్లీ సమావేశాల్లో తమిళనాడు ప్రభుత్వం వరుస తీర్మానాలు

2లో..

### విపక్షాల అభ్యంతరం.. విదేశీ విరాళాల బిల్లు జేపీసీకి..

# రేవంత్ సోదరుల భూకుంభకోణం ముమ్మాటికీ నిజం

ఒకరైతే చాలు.. ఎటువంటి ప్రశ్నలు లేకుండా వందల కోట్లు విలువైన భూములు దక్కించుకోవచ్చంటూ సెటైర్ విసిరారు. 'సున్నా పెట్టుబడితో టెస్సరాక్ట్ అడ్వాన్స్‌డ్ సిస్టమ్ అనే డిఫెన్స్ కంపెనీ పెట్టి, రాత్రికి రాత్రే కనీసం రూ.200 కోట్ల లాభం ఆర్జించినందుకు 'ఇన్నోవేటర్ ఆఫ్ ది సెంచరీ'గా అనుముల కొండల్ రెడ్డిని ప్రకటించాల్సిందే. శ్రీధర్ బాబు, రేవంత్ రెడ్డి.. తెలంగాణలోని లక్షలాది మంది నిరుద్యోగ యువతకు కూడా ఈ అద్భుతమైన 'బిజినెస్ మోడల్' ఏంటో నేర్పించండి. వందల కోట్ల విలువైన ప్రభుత్వ భూమిని ఇంత చౌకగా ఎలా పొందాలో శిక్షణ ఇవ్వండి. ఈ మ్యాజిక్ ట్రిక్ కేవలం అనుముల కుటుంబానికే ఎందుకు పరిమితం కావాలి? తెలంగాణ యువత మొత్తానికి ఈ 'అనుముల హబ్' అవకాశాన్ని కల్పించండి' అంటూ ఎక్స్‌లో కేటీఆర్ సెటైరికల్ కామెంట్స్ చేశారు.

## అసత్య ప్రచారంతో ప్రజలను పక్కదోవ పట్టించొద్దు

భయపెట్టడం, తెలంగాణ అభివృద్ధిని అడ్డుకోవడం సరికాదని హితవు పలికారు. నీటి వాటాల విషయంలో తెలంగాణ ప్రయోజనాలపై ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీపడబోమని మంత్రి స్పష్టం చేశారు. జీఆర్ఎంబీ సమావేశానికి హాజరై తెలంగాణకు రావాల్సిన నీటి వాటాల కోసం బలంగా వాదిస్తామని శ్రీధర్‌బాబు వెల్లడించారు.అసత్యాలతో ప్రజలను పక్కదోవ పట్టిస్తున్నారంటూ బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు మండిపడ్డారు. పారిశ్రామిక వేత్తలను భయపెట్టడం కేటీఆర్‌కు మంచిది కాదని అన్నారు. తెలంగాణ అభివృద్ధిని అడ్డుకోవడం సరైనది కాదని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడికి హితవు పలికారు. హిల్ట్ పాలసీతో హైదరాబాద్ ప్రజలకు ప్రయోజనం చేకూరుతుందని.. పారిశ్రామికవేత్త లను భయపెట్టడం, తెలంగాణ అభివృద్ధిని అడ్డుకోవడం సరికాదని హితవు పలికారు. నీటి వాటాల విషయంలో తెలంగాణ ప్రయోజనాలపై ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీపడబోమని మంత్రి స్పష్టం చేశారు. జీఆర్ఎంబీ సమావేశానికి హాజరై తెలంగాణకు రావాల్సిన నీటి వాటాల కోసం బలంగా వాదిస్తామని శ్రీధర్‌బాబు వెల్లడించారు. తమపై ఉన్న కోపాన్ని తెలంగాణ ప్రజలపై చూపవద్దని ఆయనకు సూచించారు. బీఆర్ఎస్ గోబెల్స్ ప్రచారాన్ని ప్రజలు నమ్మలేద పేర్కొన్నారు. అందుకే ఎంపీ, స్థానిక సంస్థల ఎన్నికల్లో ఆ పార్టీని ఓడించారని పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు చెప్పారు.

### విపక్షాల అభ్యంతరం

# విదేశీ విరాళాల బిల్లు జేపీసీకి..



న్యూఢిల్లీ(జనంసాక్షి): లోక్‌సభలో ఇటీవల ప్రవేశపెట్టిన విదేశీ విరాళాల నియంత్రణ చట్టం సవరణ బిల్లుపై ప్రతిపక్షాలు తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్న నేపథ్యంలో కేంద్రం కీలక నిర్ణయం తీసుకుంది. ప్రతిపాదిత బిల్లును సంయుక్త పార్లమెంటరీ కమిటీకి పంపించాలని నిర్ణయించింది. ఇందుకు సంబంధించిన తీర్మానాన్ని లోక్‌సభ ఆమోదించింది. మొత్తం 31 మంది ఎంపీలతో జేపీసీ కమిటీ ఏర్పాటు చేయగా.. ఇందులో 21 మంది లోక్‌సభ, పది మంది రాజ్యసభ సభ్యులు ఉండనున్నారు.విదేశీ విరాళాల నియంత్రణ చట్టం (సవరణ) బిల్లును తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని కాంగ్రెస్ సీనియర్ నేత కేసీ వేణుగోపాల్ పేర్కొన్నారు. మైనారిటీలు, ఎన్జీవోలను లక్ష్యంగా చేసుకొని ప్రభుత్వం దీనిని తీసుకొచ్చిందని, తక్షణమే ఉపసంహరిం చుకోవాలని డిమాండ్ చేశారు. ఈ బిల్లును విపక్షాలన్నీ వ్యతిరేకిస్తున్నాయని సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేష్ యాదవ్ స్పష్టం చేశారు. దీంతో కేంద్రమంత్రి కిరణ్ రిజిజు స్పందిస్తూ.. చట్టపరమైన కార్యాచరణ లేకుండా విదేశీ నిధులను దేశంలోకి అనుమతించలేమన్నారు. మైనారిటీలను లక్ష్యంగా చేసుకునేలా ఎలాంటి నిబంధనలు ఇందులో లేవని, ఈ విషయంలో విపక్షాలు ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నాయన్నారు.

# పార్లమెంట్‌లో చర్చకు సిద్ధం

### ప్రతి ప్రశ్నకూ సమాధానం చెబుతా :అమిత్ షా



న్యూఢిల్లీ(జనంసాక్షి):పార్లమెంటు కార్యకలాపాలకు పదేపదే అడ్డంకులు ఏర్పడుతున్న నేపథ్యంలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా స్పందించారు. ప్రతిష్టంభనకు తెరదించేందుకు కేంద్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. అన్ని అంశాలపై చర్చించేందుకు తాను సిద్ధమని స్పష్టం చేశారు. అయితే సభలో చర్చ జరగాలా? ఆందోళన కొనసాగాలా? అనేది ప్రతిపక్షమే నిర్ణయించుకోవాలన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. చర్చకు సిద్ధంగా ఉన్న ప్రతిపక్ష ఎంపీలు లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాకు లేఖ రాయాలని సూచించారు. అలా చేస్తే మధ్యాహ్నం 3 గంటలకు చర్చ ప్రారంభించవచ్చని.. రాత్రి వరకు చర్చ కొనసాగించేందుకు తాను సిద్ధమన్నారు. అవసరమైతే గురువారం మధ్యాహ్నం 3 గంటల వరకు కూడా చర్చను కొనసాగిద్దామని తెలిపారు. ప్రతిపక్షం అడిగే ప్రతి ప్రశ్నకూ సమాధానం ఇస్తానని షా చెప్పారు. పార్లమెంటులో "కనిపించడం లేదు", "పారిపోయారు" వంటి పదాలు ఉపయోగించడంపై ఆయన అభ్యంతరం వ్యక్తం చేశారు. దిల్లీలో విద్యార్థులపై లాఠీఛార్జి ఘటనపై చర్చకు రావాలని ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీని ఉద్దేశించి సవాల్ చేశారు.

# కేరళ పేరు మార్పు బిల్లుకు రాజ్యసభ ఆమోదం

న్యూఢిల్లీ,ఆగస్ట్12(జనంసాక్షి):కేరళ రాష్ట్రం పేరును అధికారికంగా కేరళంగా మార్చే ప్రక్రియలో మరో కీలక అడుగు పడింది. కేరళ పేరు మార్పు బిల్లుకు రాజ్యసభ బుధవారం ఆమోదం తెలిపింది. దీంతో లోక్‌సభ, రాజ్యసభ రెండింటిలోనూ బిల్లు ఆమోదం పొందింది. 'కేరళ బిల్లు-2026'ను లోక్‌సభ మంగళవారం ఎలాంటి చర్చా లేకుండానే ఆమోదించింది. రాష్ట్రం పేరును 'కేరళం'గా మార్చాలని కోరుతూ కేరళ శాసనసభ 2024లో తీర్మానం చేసింది. మలయాళంలో రాష్ట్రాన్ని సాధారణంగా 'కేరళం'గా పిలుస్తుండగా, రాజ్యాంగంలోని అధికారిక పేరు మాత్రం 'కేరళ' అనే కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో మలయాళ స్థానిక ఉచ్చారణకు అనుగుణంగా అధికారిక పేరును మార్చాలని కేంద్రాన్ని రాష్ట్ర ప్రభుత్వం కోరింది. ఈ ప్రతిపాదనకు కేంద్ర మంత్రివర్గం 2026 ఫిబ్రవరిలో ఆమోదం తెలిపింది. అనంతరం రాజ్యాంగంలోని ఆర్టికల్-3 ప్రకారం అవసరమైన ప్రక్రియను పూర్తి చేస్తూ పేరు మార్పు బిల్లును పార్లమెంట్ ముందుకు తీసుకువచ్చారు. రెండు సభల్లోనూ బిల్లు ఆమోదం పొందడంతో, తదుపరి రాజ్యాంగపరమైన ప్రక్రియ పూర్తయిన తర్వాత రాష్ట్రం అధికారిక పేరు 'కేరళం'గా మారనుంది. .

# మళ్లీ పెరిగిన బంగారం ధరలు

న్యూఢిల్లీ:గత రెండు రోజుల నుంచి బంగారం ధరలు పెరుగుతూ పోతున్నాయి. వరుసగా పెరగడం ఆందోళన కలిగిస్తోంది. శ్రావణమాసం కావడంతో ధరలు పెరగడంపై మహిళలు పెదవి విరుస్తున్నారు. బుధవారం 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారంపై 1,040 రూపాయలు.. 22 క్యారెట్ల బంగారంపై 950 రూపాయలు..18 క్యారెట్ల బంగారంపై 770 రూపాయలు పెరిగింది. గుడ్ రిటర్న్స్ వెబ్‌సైట్ ప్రకారం.. ఉదయం 11 గంటల ప్రాంతంలో హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర 1,54,860 రూపాయల వద్ద.. 22 క్యారెట్ల బంగారం ధర 1,41,950 రూపాయల వద్ద.. 18 క్యారెట్ల బంగారం ధర 1,16,140 రూపాయల వద్ద ట్రేడ్ అవుతోంది.

# గోదావరి జలాల గరిష్ట వినియోగం

బుధవారం సమీక్ష నిర్వహించారు. జాతీయ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్డీఎస్ఏ) సూచనల మేరకే సుందిళ్ల, అన్నారం, మేడిగడ్డ బ్యారేజీల్లో నీరు నిల్వ చేయడం లేదని, ఈ విషయంలో ఎన్డీఎస్ఏ సూచనలు పాటించాలన్నారు. మేడిగడ్డతో పాటు సుందిళ్ల బ్యారేజీలోనూ అనేక లోపాలు ఉన్నట్లు తేలిందని మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి తెలిపారు. ఈ విషయంలో ఎన్డీఎస్ఏతో సంప్రదించాలని సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. దేవాదుల నుంచి గతంలో ఎన్నడూ లేని విధంగా 9 పంపులతో ఎత్తిపోతలు చేపట్టామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. దేవాదుల, సీతారామ ప్రాజెక్టుల నుంచి ఎత్తిపోతలకు సంబంధించి ఏవైనా చిన్న చిన్న సమస్యలుంటే అధికారులు వాటి పరిష్కారంపై ప్రత్యేకంగా దృష్టిసారించాలని సీఎం సూచించారు. పలు ప్రాజెక్టుల కింద ఒకట్రెండు గ్రామాలు, కొద్ది పాటి వ్యవసాయ భూములకు పరిహారం చెల్లింపు అంశాలు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని వెంటనే చెల్లించేందుకు కార్యాచరణ రూపొందించాలని సీఎం ఆదేశించారు. నీటి పారుదల, రెవెన్యూ అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటించి ముంపు గ్రామాలు, పరిహారం, పునరావాసానికి సంబంధించి వాస్తవ నివేదిక రూపొందించాలని సీఎం ఆదేశించారు. తక్షణ ప్రభావం పడే గ్రామాలకు వెంటనే పరిహారం చెల్లించాలని సీఎం సూచించారు. అధికారులు ఆ పనులను పూర్తి చేస్తే బస్వాపూర్, గౌరవెల్లి ప్రాజెక్టుల్లో నీరు నింపే అవకాశం ఉంటుందని సీఎం తెలిపారు. గట్టు, గూడెందొడ్డి ఎత్తిపోతల సామర్థ్యం పెంపునకు సంబంధించి సమగ్ర అధ్యయనం చేయాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. గూడెందొడ్డి పంప్డ్‌స్టోరేజీ ప్రాజెక్టుకు సంబంధించి కన్సల్టెంట్ నియమించాలని సీఎం ఆదేశించారు. సమీక్షలో సీఎం ప్రిన్సిపల్ సెక్రటరీ వి.శేషాద్రి, సీఎం సెక్రటరీ మాణిక్ రాజ్, రాష్ట్ర నీటి పారుదల శాఖ కార్యదర్శి ఈ.శ్రీధర్, ఆర్ అండ్ ఆర్ కమిషనర్ శివ కుమార్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

# మిల్లర్ల నుంచి బకాయిలు వసూలుచేయండి

హైదరాబాద్(జనంసాక్షి): మిల్లర్లు బకాయిపడిన ధాన్యం విలువకు సంబంధించిన మొత్తాన్ని వసూలు చేయాల్సిందేనని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. వ్యాపార దృక్పథంతో మిల్లులు నడిపే వారితో సానుకూలంగా ఉంటామని, ఉద్దేశపూర్వకంగా ఎగవేతలకు ప్రయత్నించే వారితో కఠినంగా వ్యవహరిస్తామని సీఎం హెచ్చరించారు. పౌరసరఫరాల శాఖపై ఆ శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డితో కలిసి సీఎం రేవంత్ రెడ్డి ఎంసీఆర్‌హెచ్ఆర్‌డీలో బుధవారం సమీక్ష నిర్వహించారు. గత ప్రభుత్వం రూ.వేల కోట్ల బకాయిలకు అవకాశం ఇచ్చి.. తిరిగి ఆ తప్పిదాన్ని తమ ప్రభుత్వానికి అంటగట్టే ప్రయత్నం చేస్తోందని సీఎం రేవంత్ రెడ్డి మండిపడ్డారు. ఇప్పటికే బకాయిల వసూలులో కొంత పురోగతి ఉందని, అయితే ప్రతి ధాన్యం గింజకు చెందిన బకాయిని వసూలు చేయాల్సిందేనన్నారు. బకాయిల వసూలుకు సంబంధించి విధివిధానాల రూపొందించాలని అధికారులను సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. విధివిధానాల రూపకల్పన పూర్తయిన తర్వాత ఆ నివేదికను మంత్రివర్గ ఉప సంఘానికి సమర్పించాలని సీఎం సూచించారు. మంత్రివర్గ ఉప సంఘం పరిశీలన అనంతరం ప్రభుత్వం తగు నిర్ణయం తీసుకుంటుందని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. మొండి బకాయిదారులుగా మారిన మిల్లర్లకు కేటాయించే ధాన్యాన్ని మహిళా సంఘాలకు కేటాయించి మిల్లింగ్ బాధ్యతలను మహిళా సంఘాలకు అప్పగిస్తామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. ప్రతి సీజన్‌లో ధాన్యం నిల్వకు ఇబ్బందులు ఎదురవుతున్న నేపథ్యంలో ఇప్పటి నుంచే తగు కార్యాచరణ రూపొందించాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులకు సూచించారు. ధాన్యం భారీగా వచ్చే నల్గొండ, సూర్యాపేట, నిజామాబాద్, పెద్దపల్లి, కామారెడ్డి జిల్లాల్లో సైలో బ్యాగ్ నిర్మాణాలను పైలెట్ ప్రాజెక్టు కింద చేపట్టాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. స్వయం సహాయక సంఘాల ఆధ్వర్యంలో సైలో బ్యాగ్ నిర్మాణాలకు నియోజకవర్గానికి 50 నుంచి 100 ఎకరాల భూమిని కేటాయిస్తామని సీఎం తెలియజేశారు. వీటి నిర్మాణానికి సంబంధించి రెవెన్యూ, పౌరసరఫరాలు, మహిళా సంక్షేమ శాఖల మంత్రులతో సమావేశం ఏర్పాటు చేస్తామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. వీబీ జీ రామ్ జీ లో ఫ్లాట్‌పాంల నిర్మాణానికి అవకాశం ఉన్నందున, విశాలమైన ఫ్లాట్‌పాంలు నిర్మించి జర్మన్ టెంట్లతో ధాన్యం నిల్వకు ఉన్న అవకాశాలను పరిశీలించాలని సీఎం సూచించారు. మండల, గ్రామ స్థాయిలో ఉన్న ప్రైవేటు గోదాములు, ధాన్యం నిల్వకు ఉపయోపపడే కల్యాణ మండపాలు, పాత థియేటర్లు, ఇతర షెడ్లను ముందుగానే గుర్తించి ధాన్యం నిల్వకు లీజుకు తీసుకోవాలని సీఎం సూచించారు. సీఎం ప్రిన్సిపల్ సెక్రటరీ వి.శేషాద్రి, పౌరసరఫరాల సంస్థ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర, సౌత్ ఇండియా రైస్‌మిల్లర్స్ తూడి దేవేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఆర్మీరిక్రూట్‌మెంట్‌లో యువతకు ప్రోత్సాహం ఇవ్వాలి

హైదరాబాద్(జనంసాక్షి): ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని భారత ఆర్మీ సదరన్ కమాండ్ జనరల్ ఆఫీసర్ కమాండింగ్-ఇన్-చీఫ్ లెఫ్టినెంట్ జనరల్ సి.రాజేష్ పుష్కర్ మర్యాదపూర్వకంగా కలిశారు. భారత ఆర్మీ చేపట్టే వివిధ నియామకాల్లో తెలంగాణ యువతను ప్రోత్సహించే విధంగా కలిసి పనిచేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఈ సందర్భంగా సీఎం తెలియజేశారు. ఆర్మీ నియామకాల్లో స్థానిక యువతకు భారీ అవకాశాలు కల్పించే లక్ష్యంతో ఆసక్తి చూపుతున్న, అనువైన జిల్లా కేంద్రాల్లో శిక్షణా కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు. దీనిపై లెఫ్టినెంట్ జనరల్ రాజేష్ పుష్కర్ సానుకూలంగా స్పందించారు. దేశ వ్యాప్తంగా నిర్వహించే వివిధ ఆర్మీ రిక్రూట్మెంట్‌లకు ముందు ఆయా తెలంగాణ జిల్లా కేంద్రాల్లో యువతకు శిక్షణ కేంద్రాల ఏర్పాటుకు సుముఖత వ్యక్తం చేశారు. అలాగే, విపత్తు నిర్వహణలో ఆర్మీ పాత్రపైనా సీఎం చర్చించారు. రాష్ట్రంలో వరద ప్రభావిత ప్రాంతాల్లో రెస్క్యూ ఆపరేషన్లు, ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించడం, పునరావాస చర్యల్లో ఆర్మీ యంత్రాంగం మరింత క్రియాశీలకంగా వ్యవహరించాలని కోరారు. తెలంగాణలో విపత్తు పరిస్థితుల్లో ప్రత్యేకంగా చొరవ తీసుకోవాలని స్థానిక ఆర్మీ అధికారులను ఆదేశిస్తామని లెఫ్టినెంట్ జనరల్ రాజేష్ పుష్కర్ తెలిపారు. సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న మూసీ నది ప్రక్షాళన ప్రాజెక్టును లెఫ్టినెంట్ జనరల్ రాజేష్ పుష్కర్ కొనియాడారు. హైదరాబాద్ నగరాన్ని రక్షించడానికి, కాలుష్యాన్ని తగ్గించడానికి, చారిత్రక వైభవాన్ని తిరిగి తెచ్చేందుకు మూసీ నది పునరుజ్జీవనం అవసరమని పేర్కొన్నారు. ఈ భేటీలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, మేజర్ జనరల్ శ్రీనివాస్ రావు, ఇతర ఆర్మీ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# 'సర్' ధృవీకరణ పత్రంగా ఫ్యామిలీ రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్లు ఒప్పుకోం

కార్డు డేటా ఆధారంగా సర్టిఫికెట్ జారీ చేసేలా ఆదేశాలు ఇచ్చింది. ఈ నేపథ్యంలో ఈసీఐ క్లారిటీ ఇచ్చింది. 'సర్'లో ధ్రువీకరణకు ఫ్యామిలీ రిజిస్టర్ సర్టిఫికెట్ ఆమోదించడానికి కుదరదని స్పష్టం చేసింది. ఆ సర్టిఫికెట్ రేషన్‌కార్డుతో సమానమని కేంద్ర ఎన్నికల ప్రధానాధికారి (సీఈసీ) పేర్కొన్నారు.

**తెలంగాణలో పెరిగిన పోలింగ్ కేంద్రాలు**

హైదరాబాద్: తెలంగాణలో పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణకు ఎన్నికల కమిషన్ ఆమోదం తెలిపింది. రాష్ట్రవ్యాప్తంగా 368 పోలింగ్ కేంద్రాలను పెంచి.. వాటి సంఖ్యను 36,353గా ఖరారు చేసింది. అత్యధికంగా హైదరాబాద్ జిల్లాలో 4,094 పోలింగ్ కేంద్రాలు ఉండగా.. అతి తక్కువగా 308 పోలింగ్ కేంద్రాలు ములుగు జిల్లాలో ఉన్నాయి. కుటుంబసభ్యులందరూ ఒకే పోలింగ్ కేంద్రంలో ఓటు వేసేలా మార్పులు, చేర్పులు జరిగాయి.

# నీట్ పేపర్ లీక్‌పై సీబీఐ 20వేల పేజీల ఛార్జిషీట్..

అని సీబీఐ అధికారి ఇటీవల ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కేసులోని అభియోగాలపై న్యాయస్థానం గురువారం నుంచి వాదనలు వినే అవకాశం ఉంది.ఈ కేసులోని సాక్షుల పేర్లు మీడియాలో వెలుగుచూస్తున్నాయని, వారిలో కొందరు మైనర్లు కూడా ఉండొచ్చని కోర్టు దృష్టికి సీబీఐ తీసుకెళ్లింది. సాక్షుల పేర్లు వెల్లడి కావడంపై కోర్టు అసహనం వ్యక్తం చేసింది. ప్రస్తుతం ఛార్జిషీట్‌లో మాత్రమే ఉన్న అంశాలను బహిర్గతం చేయడంగ్భ్రాంతికరమని పేర్కొంది. ఇలాంటి చర్యలకు దూరంగా ఉండాలని సూచించింది. నీట్ లీకేజీ ఆందోళనల నేపథ్యంలో.. పరీక్ష పత్రాల లీకేజీ బాధ్యులకు త్వరితగతిన కఠిన శిక్ష పడేలా చూసేందుకు కేంద్ర ప్రభుత్వం ఫాస్ట్‌ట్రాక్ కోర్టును ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే.

## షార్ట్‌కట్ కోసం వెంపర్లాడితే నష్టమే..

యువత వాడే భాషను ఉపయోగిస్తున్నారు. అదే సమయంలో రీల్స్‌కే పరిమితం కాకుండా కెరీర్‌పైనా దృష్టిపెట్టాలని సూచించారు. ఇదిలా ఉంటే.. కోవింద్ రాసిన పుస్తకావిష్కరణ కార్యక్రమం దిల్లీలో జరిగింది.

కోవింద్ సూచనలు దేశాన్ని కొత్త దిశలో నడిపించనున్నాయి

భారత మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ బయోగ్రఫీని ప్రధాని నరేంద్ర మోదీ ఆవిష్కరించారు. ట్రయంఫ్ ఆఫ్ ది ఇండియన్ రిపబ్లిక్: మై లైఫ్, మై స్ట్రగుల్స్' పుస్తకాన్ని బుధవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా కోవింద్‌తో తనకున్న సుదీర్ఘ అనుబంధాన్ని మోదీ గుర్తుచేసుకున్నారు. రాష్ట్రపతిగా కోవింద్ అందించిన మార్గదర్శకత్వం, తనపై చూపిన ఆప్యాయత, ఆత్మీయత తనకు ఎంతో విలువైనవని పేర్కొన్నారు. ఒకే దేశం-ఒకే ఎన్నిక దిశలో రామ్‌నాథ్ గొప్ప కృషి చేశారని, ఆయన చేసిన సూచనలు దేశాన్ని కొత్త దిశలో నడిపించనున్నాయని తెలిపారు. 'నాకు కోవింద్ చాలా కాలంగా తెలుసు. ఆయన సామర్థ్యాలను నేను సుదీర్ఘకాలంగా తెలుసుకునే అవకాశం లభించింది. ఈ ఆత్మకథ భారత ప్రజాస్వామ్యం, సమాజానికి చిరస్మరణీయ వారసత్వంగా నిలుస్తుందన్నారు.

# వేటగాళ్ల ఉచ్చుకు ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ బలి

### అడవి జంతువుల వేట కోసం అమర్చిన కరెంట్ తీగ తగిలి నవీన్ మృతి.. ముగ్గురిపై కేసు నమోదు..



బూర్గంపహాడ్ ఆగస్టు 12 (జనంసాక్షి): అడవి జంతువులను వేటాడేందుకు అక్రమంగా అమర్చిన విద్యుత్ తీగే ఓ అటవీశాఖ ఉద్యోగి ప్రాణాలను బలిగొంది. అడవి జంతువుల వేటకు అమర్చిన విద్యుత్ ఉచ్చును గుర్తించి, దానిని ఏర్పాటు చేసిన వారిని పట్టుకునేందుకు వెళ్లిన ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ (ఎఫ్‌బీఓ) బానోతు నవీన్ అదే విద్యుత్ తీగకు తగిలి మృతి చెందిన విషాద ఘటన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపహాడ్ మండలం నకిరేపేట గ్రామ పరిధిలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. మంగళవారం రాత్రి నకిరేపేట గ్రామ పరిధిలో కొంతమంది వ్యక్తులు అడవి జంతువులను వేటాడేందుకు విద్యుత్ తీగలు అమర్చినట్లు అటవీశాఖ అధికారులకు సమాచారం అందింది. దీంతో డీఆర్ఓ కురుసం అనార్కలి, ఎఫ్‌బీఓ బానోతు నవీన్, సిబ్బందితో కలిసి సంఘటనా ప్రాంతానికి వెళ్లి వేటగాళ్ల కోసం గాలింపు చేపట్టారు. ఈ క్రమంలో అడవి జంతువుల కోసం అమర్చిన విద్యుత్ తీగ నవీన్‌కు తగలడంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిపారు. నవీన్ మృతికి కారణమైన విద్యుత్ ఉచ్చును ఏర్పాటు చేసినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న లక్ష్మీపురం గ్రామానికి చెందిన ఆవుల నాగిరెడ్డి, దాసరి నరేష్, తాటి వీరబాబుపై చర్యలు తీసుకోవాలని డీఆర్ఓ అనార్కలి బుధవారం ఉదయం బూర్గంపహాడ్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు ఆధారంగా బూర్గంపహాడ్ పోలీసులు కేసు నమోదు చేశారు. పాల్వంచ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సతీష్ దర్యాప్తు చేస్తున్నారు. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు దర్యాప్తులో వెల్లడికానున్నాయి. అడవి జంతువుల వేటకు అమర్చిన అక్రమ విద్యుత్ ఉచ్చులు మనుషుల ప్రాణాలకూ ఎంతటి ప్రమాదకరమో ఈ ఘటన మరోసారి స్పష్టం చేసింది.

# ఆ మూడు అంశాలను అజెండా నుంచి తొలగించండి

కోరింది. తెలంగాణ ప్రాజెక్టుల టిఎసి అనుమతుల వివరాల అంశం కూడా వద్దని తెలిపింది. సిడబ్ల్యూసి తదితర సంస్థలు ఇచ్చిన అనుమతుల సమీక్ష అంశంపైనా ప్రభుత్వం అభ్యంతరం వ్యక్తం చేసింది. ఈ అంశాలపై ఇప్పటికే జీఆర్ఎంబీలో విస్తృతంగా చర్చించామని వెల్లడించింది. గతంలో ఏపీ అభ్యంతరాలను సిడబ్ల్యూసి పరిశీలించి తిరస్కరించిందని తెలంగాణ సర్కార్ వాదించింది. సిడబ్ల్యూసి అవార్డు, మార్గదర్శకాల ప్రకారమే ప్రాజెక్టులకు అనుమతులు ఇచ్చినట్లు స్పష్టం చేసింది. మూడు అంశాలను అజెండా నుంచి డ్రాప్ చేయాలని జీఆర్ఎంబీకి తెలంగాణ సర్కార్ లేఖ రాసింది. సవరించిన అజెండా విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వం విజ్ఞప్తి చేసింది. ఇదిలావుంటే ఈ ఎజెండాపై వారం క్రితమే మాజీమంత్రి హరీష్ రావు అభ్యంతరాలు వ్యక్తం చేశారు. అజెండా అంశాలను ఎలా అంగీకరిస్తారని ప్రశ్నించారు.

# ఇళ్ల కేటాయింపులో తెలంగాణ రాష్ట్రానికి ప్రాధాన్యం ఇవ్వండి

తెలంగాణలో గత 12 ఏళ్లుగా పేదలకు ఇళ్ల నిర్మాణం నిలిచిపోయి తీవ్రమైన డిమాండ్ ఉందని తెలిపారు. ఒకేసారి ఈ ఇళ్లన్నింటినీ మంజూరు చేయాలని కోరారు. కేంద్ర వాటా, సాధారణ రాష్ట్ర వాటాతో సంబంధం లేకుండా ప్రతి పేద కుటుంబం ఇల్లు నిర్మించుకునేందుకు రూ.5 లక్షల ఆర్థిక సహాయం అందించాలని రాష్ట్ర ప్రభుత్వం ఈ చరిత్రాత్మక నిర్ణయం తీసుకుందని మంత్రి పొంగులేటి వెల్లడించారు. ఇందుకు అవసరమైన నిధులను ఇప్పటికే రాష్ట్ర బ్జడెట్‌లో కేటాయించినట్లు స్పష్టం చేశారు. కేంద్రమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌ను తెలంగాణలో పర్యటించాలని పొంగులేటి సాదరంగా ఆహ్వానించారు. స్వయంగా రాష్ట్రానికి వచ్చి ఖఓంజ-ఉ 2.0 కింద ఇళ్ల కేటాయింపును ప్రకటిస్తే, తెలంగాణలోని గ్రామీణ పేదలకు కొండంత అండగా నిలుస్తుందని చెప్పుకొచ్చారు. అది చరిత్రాత్మక ఘట్టంగా మారుతుందని పేర్కొన్నారు. మంత్రి పొంగులేటి విజ్ఞప్తిపై కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందిస్తూ తెలంగాణలో పర్యటించేందుకు అంగీకరించారు. కేంద్ర మంత్రిని కలిసిన వారిలో ఎంపీలు మల్లు రవి, వేం నరేందర్ రెడ్డి, చామల కిరణ్‌కుమార్ రెడ్డి, సురేశ్ షెట్కార్, రామ సహాయం రఘురాం రెడ్డి, అనిల్‌కుమార్ యాదవ్‌తో పాటు తెలంగాణ హౌసింగ్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ వీ.పీ. గౌతమ్ తదితరులు ఉన్నారు రాష్ట్రవ్యాప్తంగా 'ఆవాస్ ప్లస్?2024' యాప్ ద్వారా అత్యంత పారదర్శకంగా ఇంటింటి సర్వే నిర్వహిం చామని మంత్రి పొంగులేటి వివరించారు. ఈ సర్వేలో 11.56 లక్షలకు పైగా గ్రామీణ పేద కుటుంబాలు ఇళ్లకు అర్హులుగా తేలాయని తెలిపారు. వీటికి సంబంధించి సూపర్ చెక్, అనర్హుల తొలగింపు ప్రక్రియలన్నీ ఏడాది క్రితమే పూర్తయినప్పటికీ, కేంద్రం నుంచి లక్ష్యాల ప్రకటనలో జాప్యం జరుగుతోందన్నారు. తెలంగాణలో గత 12 ఏళ్లుగా పేదలకు ఇళ్ల నిర్మాణం నిలిచిపోయి తీవ్రమైన డిమాండ్ పేరుకుపోయినందున, ఒకేసారి ఈ ఇళ్లన్నింటినీ మంజూరు చేయాలని కోరారు. ఇకపోతే కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌ను ఇకపోతే కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌ను తెలంగాణలో పర్యటించాల్సిందిగా పొంగులేటి సాదరంగా ఆహ్వానించారు. స్వయంగా ఇళ్ల కేటాయింపును ప్రకటిస్తే, తెలంగాణలోని గ్రామీణ పేదలకు కొండంత అండగా నిలుస్తుందని, అది చారిత్రాత్మక ఘట్టంగా మారుతుందని పేర్కొన్నారు. మంత్రి పొంగులేటి విజ్ఞప్తిపై కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందిస్తూ, తెలంగాణలో పర్యటించేందుకు అంగీకరించారు. కేంద్ర మంత్రిని కలిసిన వారిలో ఎంపీలు మల్లు రవి, వేం నరేందర్ రెడ్డి, చామల కిరణ్‌కుమార్ రెడ్డి, సురేశ్ షెట్కార్, రామ సహాయం రఘురాం రెడ్డి, అనిల్‌కుమార్ యాదవ్‌తో పాటు తెలంగాణ హౌసింగ్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ వీ.పీ. గౌతమ్ తదితరులు ఉన్నారు.

# యశ్వంత్ వర్మ దోషే..

ప్రభుత్వ భవనాల్లో నివాసం ఉంటున్నాడు. గత ఏడాది మార్చి 14-15 తేదీల మధ్య అతడి ఇంట్లో అగ్నిప్రమాదం జరిగింది. దీంతో అగ్నిమాపక సిబ్బంది అక్కడికి వెళ్లి మంటలను ఆర్పేశారు. ఈ ఘటనకు సంబంధించి అప్పట్లో కొన్ని ఫొటోలు బయ టపడ్డాయి. సంచలన విషయాలు వెలుగు చూశాయి. అగ్నిప్రమాదం జరిగిన యశ్వంత్ వర్మ ఇంట్లో భారీగా నోట్ల కట్టలున్నాయి. ఇంటి స్టోర్ రూమ్‌లో ఈ నోట్ల కట్టలు చాలా వరకు కాలిపోయాయి. కొన్ని ధ్వంసమయ్యాయి. అవన్నీ రూ.500 నోట్ల కట్టలే. ఈ అంశం వివాదాస్పదం కావడంతో పోలీసులు, ఇతర అధికారులు ఆ ఇంటికి వెళ్లి ఆ ప్రదేశాన్ని సీజ్ చేశారు. అప్పటికే ఇంట్లోని సాక్షాలు తారుమారు అయ్యాయి. ఫొటోల్లో కనిపించిన కరెన్సీ నోట్లు ఆ సమయానికి అక్కడ లేవు. మొదట ఈ నోట్ల కట్టలకు, తనకు సంబంధం లేదని యశ్వంత్ వర్మ చెప్పాడు. అసలు, ఈ నోట్లు తన ఇంటికి సంబంధం లేదని చెప్పాడు. అయితే, ఒక రిటైర్డ్ జడ్జి ఇంట్లో భారీగా నోట్ల కట్టలు కనిపించడం సంచలనంగా మారింది. జడ్జిల అవినీతి అంశం తెరమీదకు వచ్చింది. దీంతో ఈ అంశంపై పెద్ద దుమారం రేగింది. చివరకు దీనిపై పార్లమెంట్ స్పందించింది. ఈ అంశంపై విచారణ జరిపేందుకు లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా ఒక ప్యానెల్ ఏర్పాటు చేశారు. ఈ ప్యానెల్.. ఈ అంశంపై విచారణ జరిపింది. ఈ విచారణ తర్వాత అతడిని ప్యానెల్ దోషిగా గుర్తించింది.

# 100 శాతం టారిఫ్‌ల అంశాన్ని ట్రంప్-మోదీ చూసుకుంటారు

ఆ దేశానికి పరోక్షంగా లాభం చేకూరిందని గతంలో తాను పేర్కొన్నట్లు చెప్పారు. అయితే తన వ్యాఖ్యలపై భారత్‌లో సామాజిక మాధ్యమాల ద్వారా తీవ్ర విమర్శలు వచ్చాయని నవారో తెలిపారు. సమస్యలను పరిష్కరించుకోవడానికి ఇలాంటి స్పందనలు ఉపయోగపడవని సూచించారు. రష్యా నుంచి చమురు, సహజ వాయువు కొనుగోలు చేసే దేశాలపై భారీ సుంకాలు విధించేలా అమెరికాలో లిండ్సే గ్రాహమ్ బిల్లు ప్రతిపాదించారు. దీనికి ఆమోదం లభిస్తే.. రష్యా నుంచి ఇంధనం కొనుగోలు చేసే దేశాల ఉత్పత్తులపై 100 శాతం వరకు సుంకం విధించే అధికారం ట్రంప్‌నకు దక్కే అవకాశం ఉంది. రష్యా నుంచి పెద్దఎత్తున భారత్ ముడిచమురు కొనుగోలు చేస్తుండటంతో ఈ ప్రతిపాదనపై ఆందోళన నెలకొంది. అయితే మోదీ, ట్రంప్ మధ్య చర్చలతో ఈ వివాదానికి పరిష్కారం లభిస్తుందని నవారో విశ్వాసం వ్యక్తం చేశారు.

## కల్యాణలక్ష్మి, షాదీముబారక్‌పై తెలంగాణ హైకోర్టు స్టే


హైకోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ఈ నేపథ్యంలో స్టే విధించిన ఉన్నత న్యాయస్థానం.. తదుపరి విచారణను నాలుగు వారాలకు వాయిదా వేసింది.

# మహిళా బిల్లుకు ఓకే.. డీలిమిటేషన్‌కు విజయ్ నో

చెన్నై(జనంసాక్షి):అసెంబ్లీ సమావేశాల్లో భాగంగా తమిళనాడు ప్రభుత్వం వరుస తీర్మానాలను ప్రవేశపెడుతోంది. మొన్న రాష్ట్రగీతం, నిన్న నీట్.. నేడు డీలిమిటేషన్‌పై తీర్మానాలను తీసుకువచ్చింది. నియోజకవర్గాల పునర్ వ్యవస్థీకరణ కోసం కేంద్రం తీసుకువచ్చిన బిల్లును వ్యతిరేకించింది. అదే సమయంలో మహిళా రిజర్వేషన్‌కు మద్దతు ఇచ్చింది. ప్రస్తుతమున్న 543 సీట్లతోనే దానిని అమలు చేయాలని విజయ్ ప్రభుత్వం విజ్ఞప్తి చేసింది.తమిళనాడు వంటి దక్షిణాది రాష్ట్రాలు జనాభా నియంత్రణను విజయవంతంగా అమలు చేశాయని ఈ సందర్భంగా సీఎం విజయ్ అన్నారు. జనాభా ప్రాతిపదికన నియోజకవర్గాల పునర్విభజన జరిగితే నష్టం వాటిల్లొచ్చని హెచ్చరించారు. "ప్రస్తుతం ఉన్న 543 లోక్‌సభ స్థానాలను అలాగే కొనసాగించాలి. ప్రతి రాష్ట్రానికి ప్రస్తుతం కేటాయించిన స్థానాలను శాశ్వతం చేయాలి. రాష్ట్ర శాసనసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించాలి" అని కేంద్రం ముందు మూడు డిమాండ్లు ఉంచారు.మహిళలకు చట్టసభల్లో 33% రిజర్వేషన్లను 2029 సార్వత్రిక ఎన్నికలకు ముందే కల్పించడానికి పార్లమెంటు ఆమోదం కోసం కేంద్ర ప్రభుత్వం మరోసారి ప్రయత్నిస్తోంది. 543 లోక్‌సభ నియోజకవర్గాలను పునర్విభజించి 816కి పెంచే ప్రతి పాదనపైనా అడుగు ముందుకు వేయాలని చూస్తోంది. ఈ సమయంలో తీర్మానాన్ని ప్రవేశపెట్టడం గమనార్హం.

# ఎల్బీనగర్ పీఎస్‌లో కానిస్టేబుల్ ఆత్మహత్య

### పోలీస్ స్టేషన్ ఎదటు కుటుంబ సభ్యుల ఆందోళన



హైదరాబాద్,ఆగస్ట్12(జనంసాక్షి): ఎల్బీనగర్ పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్ ఆత్మహత్యకు పాల్పడిన ఘటన కలకలం రేపింది. రాత్రి విధుల్లో ఉన్న కానిస్టేబుల్ జె.సాయి కుమార్ బుధవారం తెల్లవారు జామున ఏసీపీ కార్యాలయంలోని రెస్ట్ రూమ్‌లో ఉరి వేసుకున్నట్టు సిబ్బంది గుర్తించారు. వెంటనే సమీపంలోని కామినేని ఆసుపత్రికి తరలించగా.. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్టు దృవీకరించారు. పోస్టుమార్టం కోసం మృతదేహాన్ని ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. 2024 బ్యాచ్‌కు చెందిన సాయికుమార్‌ను.. ప్రస్తుతం ఈ-కాప్స్ డ్యూటీ కోసం ఎల్బీనగర్ ఏసీపీ కార్యాలయానికి అటాచ్ చేశారు. కర్మన్‌ఘాట్‌లో స్నేహితులతో కలిసి ఓ గదిలో ఉంటున్న సాయికుమార్ ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది. మరో స్టేషన్ ఎదుట మృతుని కుటుంబ సభ్యులు ఆందోళనకు దిగారు. సాయికుమార్ ఆత్మహత్య చేసుకోలేదని, రక్తపు మరకలు ఎలా వచ్చాయని పోలీసులతో వాగ్వాదానికి దిగారు. వందలాది మంది పీఎస్ వద్దకు చేరుకుని ధర్నా నిర్వహించారు. ఒక దశలో పీఎస్‌లోకి దూసుకెళ్లి కంప్యూటర్, ప్రింటర్ ధ్వంసం చేశారు. ఉద్రిక్తత నెలకొనడంతో భారీగా పోలీసుల మోహరించారు.

# షుగర్ ఫ్యాక్టరీలను పునరుద్ధరించండి

- 14న జరిగే రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో ప్రక్రియ అంశంపై చర్చించాలి
- తెలంగాణ రైతు ఐక్యవేదిక విజ్ఞప్తి



**హైదరాబాద్ (జనంసాక్షి) :** ఈనెల 14న హైదరాబాద్ లోని తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన జరిగే తెలంగాణ కేబినెట్ సమావేశంలో రాష్ట్రంలో మూసివేసిన నిజాం షుగర్ ఫ్యాక్టరీల పునరుద్ధరణ ప్రక్రియను వేగవంతం చేసే అంశంపై రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో చర్చించాలని తెలంగాణ రైతు ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు శేర్ నర్సారెడ్డి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పాలకుల తప్పుడు విధానాల కారణంగా ముత్యంపేట (జగిత్యాల జిల్లా), బోధన్ (నిజామాబాద్ జిల్లా), ముంభోజిపల్లి (మెదక్ జిల్లా) లలోని నిజాం షుగర్ ఫ్యాక్టరీలను మూసివేసిన కారణంగా చెరుకు రైతులతో పాటు షుగర్ ఫ్యాక్టరీలపై ఆధారపడ్డ కార్మికుల కుటుంబాలు రోడ్డున పడ్డాయని తెలంగాణ రైతు ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు శేర్ నర్సారెడ్డి పేర్కొన్నారు. గత శాసనసభ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో రాష్ట్రంలో మూసివేసిన నిజాం షుగర్ ఫ్యాక్టరీలను పునరుద్ధరిస్తామని ఇచ్చిన హామీ మేరకు సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకొని రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు నేతృత్వంలో నిజాం షుగర్ ఫ్యాక్టరీల పునరుద్ధరణ సిఫార్సుల కమిటీని ఏర్పాటు చేయగా ఈమేరకు చెరుకు రైతులు, కార్మికుల నుంచి అభిప్రాయాలు, సలహాలను స్వీకరించి సమగ్ర నివేదికను రాష్ట్ర ప్రభుత్వానికి సమర్పించగా 173 కోట్ల రూపాయలను కేటాయించడంతో చెరుకు రైతుల్లో ఆనందోత్సాహాలను కలిగించినప్పటికీ పునరుద్ధరణ ప్రక్రియలో తీవ్ర జాప్యం జరుగుతుందన్నారు. ఈనెల 14న హైదరాబాద్ లోని సచివాలయంలో జరగనున్న రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో నిజాం షుగర్ ఫ్యాక్టరీల పునరుద్ధరణ ప్రక్రియలో జరుగుతున్న జాప్యాన్ని నివారించి వేగవంతం చేసే అంశంపై రాష్ట్ర కేబినెట్ సమావేశంలో చర్చించాలని తెలంగాణ రైతు ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు శేర్ నర్సారెడ్డి రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

## ప్రతిభావంతులైన మైనారిటీ విద్యార్థులకు సన్మానం

- సిఎం చేతుల మీదుగా పురస్కారాలు అందచేత
- మంత్రి అజహరుద్దీన్



**హైదరాబాద్, ఆగస్ట్12 (జనంసాక్షి) :** ప్రతిభావంతులైన మైనారిటీ విద్యార్థులను 13వ తేదీ గురువారం నాడు సన్మానిస్తామని తెలంగాణ మంత్రి అజహరుద్దీన్ పేర్కొన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా విద్యార్థుల సన్మాన కార్యక్రమం ఉంటుందని తెలిపారు. పోటీ పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థుల సన్మాన కార్యక్రమం ఏర్పాట్లపై మంత్రి అజహరుద్దీన్ బుధవారం సచివాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. గ్రూప్-1, గ్రూప్-2లో ప్రతిభ చూపిన మైనారిటీ విద్యార్థులను సన్మానిస్తామని చెప్పుకొచ్చారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను సన్మానిస్తామని మంత్రి వెల్లడించారు. అత్యుత్తమ ప్రతిభ చూపిన విద్యార్థులను సత్కరిస్తామని వివరించారు. ఈ కార్యక్రమానికి విద్యార్థులు, కుటుంబ సభ్యులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా ఏర్పాట్లు చేస్తున్నామని పేర్కొన్నారు. భద్రత, ట్రాఫిక్, పారిశుద్ధ్యం, వైద్య సదుపాయాలపై ప్రత్యేక దృష్టి సారించామని వెల్లడించారు. అగ్నిమాపక భద్రత, పౌర సదుపాయాలు, లాజిస్టిక్స్ ఏర్పాట్లపై అధికారులతో సమీక్షించామని తెలిపారు. వివిధ శాఖల మధ్య సమన్వయంతో ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మంత్రి ఆదేశించారు. మైనారిటీ విద్యార్థుల విద్యా ప్రతిభను గుర్తించి ప్రోత్సహించడమే తమ లక్ష్యమని ఉద్ఘాటించారు. విద్యార్థుల విజయాలు మరింత మంది యువతకు స్ఫూర్తిగా నిలవాలని మంత్రి అజహరుద్దీన్ పేర్కొన్నారు.

### సచివాలయ ఉద్యోగుల సొసైటీ సభ్యులకు

## రూ.15 లక్షల జీవిత బీమా

- ఆగస్టు 15 నుంచి నూతన పథకం ప్రారంభం
- సొసైటీ అధ్యక్షుడు రేండ్ల రాజేష్ ప్రకటన



**హైదరాబాద్ (జనంసాక్షి) :** తెలంగాణ సచివాలయ ఉద్యోగుల సహకార పరపతి సొసైటీ తమ సభ్యుల కుటుంబాలకు ఆర్థిక భద్రత కల్పించే దిశగా కొత్త చొరవ తీసుకుంది. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఆగస్టు 15 నుంచి సభ్యులకు రూ. 15 లక్షల జీవిత బీమా (లోన్ ఇన్సూరెన్స్) పథకాన్ని అందుబాటులోకి తీసుకువస్తున్నట్లు సొసైటీ అధ్యక్షుడు రేండ్ల రాజేష్ ప్రకటించారు. సచివాలయం, శాసనసభ, లోక్ భవన్ కార్యాలయాల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు సేవలందిస్తున్న ఈ సొసైటీ, మే 2025లో నూతన కార్యవర్గం బాధ్యతలు స్వీకరించిన తర్వాత అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తోంది.

గతంలో నెలకు రూ. 800 ప్రీమియంతో కేవలం రూ. 2 లక్షల బీమా మాత్రమే అందించేవారు. కొత్త పాలకవర్గం వివిధ సంస్థలతో చర్చలు జరిపి, పాత ప్రీమియంపై రూ. 200 మాత్రమే పెంచి నెలకు రూ. 1,000తో రూ. 15 లక్షల బీమా అందించేలా రూపొందించింది. ఇందులో భాగంగా రుణగ్రహీతలకు తప్పనిసరిగా నెలసరి రూ. 1,000 ప్రీమియంతో రూ. 15 లక్షల బీమా, మరియు రుణం లేని సభ్యులకు నెలసరి రూ. 200 ప్రీమియంతో రూ. 2 లక్షల జీవిత బీమా అందిస్తారు.

కొత్తగా బాధ్యతలు స్వీకరించిన కార్యవర్గం ఇప్పటికే సొసైటీ ఉద్యోగుల రుణ పరిమితిని పెంచడంతో పాటు రుణాలపై వడ్డీ రేట్లను తగ్గించింది. పొదుపును ప్రోత్సహించేందుకు ఫిక్స్‌డ్ డిపాజిట్లపై వడ్డీ రేట్లు పెంచింది. ఎస్ఆర్‌డిఎస్ రికరింగ్ డిపాజిట్ పథకం ద్వారా నెలకు రూ. 500 నుంచి రూ. 20,000 వరకు 8% వార్షిక వడ్డీతో పొదుపు చేసుకునే అవకాశం కల్పించగా, ఇప్పటికే 200 మందికి పైగా సభ్యులు దీనిలో చేరారు. సచివాలయం, అసెంబ్లీ, లోక్ భవన్‌లలో ఇంకా సభ్యత్వం తీసుకోని ఉద్యోగులు త్వరగా సొసైటీలో చేరి ఈ ప్రయోజనాలు పొందాలని అధ్యక్షుడు రేండ్ల రాజేష్, పాలకవర్గ సభ్యులు విజ్ఞప్తి చేశారు.

## లండన్ ఎంపి ఉదయ్ నాగరాజుకు సన్మానం

**కరీంనగర్, ఆగస్ట్12 (జనంసాక్షి) :** హుస్నాబాద్ నియోజకవర్గం శనిగరం గ్రామానికి చెందిన చెందిన ఉదయ్ నాగరాజు యునైటెడ్ కింగ్డమ్ హౌస్ ఆఫ్ లార్డ్స్ సభ్యునిగా ఎన్నికయ్యారు. ఇటీవల సొంతూరుకు వచ్చిన ఆయనను సిద్దిపేటలో మాజీ జడ్పీటీసీ తన్నీరు శరత్ రావు ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నాయకులు సన్మానించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ మంత్రి తన్నీరు హరీశ్ రావు, మాజీ ఎమ్మెల్యే వొడితల సతీష్ కుమార్ హాజరయ్యారు. ప్రపంచవ్యాప్తంగా తెలంగాణ ప్రతిష్టను ఇనుమడింపజేసిన ఉదయ్ నాగరాజు నియోజకవర్గంతో పాటు రాష్ట్రానికి గర్వకారణం అని బీఆర్ఎస్ నాయకులు కొనియాడారు.

# తెలంగాణ గర్వించదగ్గ రైతు, కవి గంగుల శాయిరెడ్డి

- తెలంగాణ రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ జె.చిన్నారెడ్డి





**హైదరాబాద్ (జనంసాక్షి) :** తెలంగాణ ప్రాంతం నుంచి రైతు నేపథ్యంగా గొప్ప కవిత్వం రాసిన ఘనత కాపుబిడ్డ కవి గంగుల శాయిరెడ్డి కి దక్కుతుందని తెలంగాణ రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ జె.చిన్నారెడ్డి అన్నారు. తెలంగాణ భాషా సాంస్కృతిక మండలి ఆధ్వర్యంలో భువనగిరి పరిసర గ్రామం రామకృష్ణా పురం లోని అమేయ కృషి వికాస కేంద్రం లో జరిగిన కాపుబిడ్డ సాహిత్య సమాలోచన వ్యాస సంపుటి ఆవిష్కరణ కార్యక్రమం లో ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు.తెలంగాణ ప్రాంతాన్ని సాహిత్యకంగా సురవరం ప్రతాప రెడ్డి లాంటి వాళ్ళు ఎంతో కృషి చేసి గొప్ప గుర్తింపును తెచ్చారు అని అన్నారు.గంగుల శాయిరెడ్డి కవి ఆంధ్ర మహాసభలు నడుస్తున్న కాలంలో రాసుకున్న కవిత్వం కాపుబిడ్డ గా తీసుకు వచ్చారన్నారు.మరుగున పడుతున్న ఇలాంటి సాహిత్యాన్ని సాహిత్య సదస్సులు నిర్వహించి ఇలా ఓ పుస్తకంగా తీసుకురావడం అభినందనీయమన్నారు. ఇందుకు ఆచార్య గంటా జలంధర్ రెడ్డి ని ప్రత్యేకంగా అభినందించారు.ప్రముఖ సాహితీ వేత్త డాక్టర్ అమ్మంగి వేణుగోపాల్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో అమేయ కృషి వికాస కేంద్రం నిర్వాహకులు జిట్టా బాలరెడ్డి,జ్యోతి దంపతులు,భువనగిరి మున్సిపాలిటీ చైర్మన్ తంగెళ్లపల్లి శ్రీవాణి రవికుమార్,వైస్ చైర్మన్ పోతంశెట్టి మంజులవెంకటేశ్వర్లు,నాయకులు ప్రమోద్ కుమార్, రమేష్, నాగభూషణం వివేరా వెంకటరెడ్డి రామకృష్ణాపురం సర్పంచ్ మల్లికార్జున రెడ్డి, సిద్దగౌని సుదర్శన్ ,భరత్ కుమార్ ,సంజీవ్ కుమార్ రెడ్డి,అజయ్ యాదవ్,శివాజీ,అమృత రెడ్డి,మంత్రి మల్లేష్, గంగుల శ్రీనివాస్ రెడ్డి, శాయిరెడ్డి అల్లుడు కొండల్ రెడ్డి...కుటుంబ సభ్యులు సాహిత్య అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.తేజ సాహిత్య సేవా సంస్థ అధ్యక్షుడు డాక్టర్ పోరెడ్డి రంగయ్య కార్యక్రమానికి వ్యాఖ్యాతగా వ్యవహరించారు.

## రాజ్యసభలో గళమెత్తిన ఎంపీ వద్దిరాజు



**న్యూఢిల్లీ (జనంసాక్షి):** బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ లీడర్, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర బుధవారం రాజ్యసభలో సహకార రంగం, రాష్ట్రాల సాంస్కృతిక గుర్తింపు, భద్రాచలం--విశాఖపట్నం రోడ్డు కారిడార్ తదితర అంశాలపై మాట్లాడారు. అలాగే రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్‌ను కలిసి నిజామాబాద్ ప్రతిపాదిత రైల్వే బైపాస్ అలైన్‌మెంట్‌ను పునఃపరిశీలించాలని కోరారు. సహకార రంగానికి బలోపేతం అవసరం: నేషనల్ కోఆపరేటివ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎన్‌సీడీసీ) సవరణ బిల్లు--2026పై చర్చ సందర్భంగా రవిచంద్ర మాట్లాడుతూ సహకార ఉద్యమం కేవలం సంస్థాగత వ్యవస్థ కాదని, ఆర్థిక సమ్మిళితం, సమాన సంపద సృష్టి, గ్రామీణ వ్యాపారాభివృద్ధి, ఉపాధి కల్పనకు కీలక సాధనమన్నారు. బీఆర్ఎస్ అధినేత, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశాల మేరకు బిల్లుకు సంపూర్ణ మద్దతు ఇస్తున్నట్లు తెలిపారు. రైతులు, పాడి రైతులు, చేనేత కార్మికులు, మత్స్యకారులు, మహిళా స్వయం సహాయక సంఘాలు, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలకు మరింత ప్రోత్సాహం అవసరమన్నారు. తెలంగాణలో 33 జిల్లాల్లో సుమారు 900 సహకార సంఘాల ద్వారా రైతులు, గ్రామీణ ప్రజలకు రుణాలు, ఇతర సహాయాన్ని అందిస్తున్నట్లు సభ దృష్టికి తీసుకువచ్చారు. చేనేత కార్మికులకు భూమి, పరికరాలు, ఉత్పత్తి కేంద్రాలు, మార్కెట్ ఆర్డర్లు కల్పించాలని, మత్స్యకారులకు అవసరమైన వనరులు, పాడి రైతులకు ప్రోత్సాహం అందించాలని కోరారు. గ్రామీణ యువతకు నైపుణ్యాభివృద్ధితో పాటు స్వయం ఉపాధికి ఆర్థిక సహాయం, రుణాలు అందించాలన్నారు. రైతులకు వివిధ రాష్ట్రాల్లో వ్యవసాయ, పాడి ఉత్పత్తులకు ఉన్న డిమాండ్, ధరలు, మార్కెట్ అవకాశాలపై పూర్తి సమాచారాన్ని అందించాలని సూచించారు. కేరళ రాష్ట్రం పేరును 'కేరళం'గా మార్చే బిల్లుకు బీఆర్ఎస్ తరఫున సంపూర్ణ మద్దతు ప్రకటించారు. భాష, సంస్కృతి, చారిత్రక గుర్తింపును ప్రతిబింబించేలా రాష్ట్రం పేరు మార్చడం అభినందనీయమన్నారు. భద్రాచలం--విశాఖపట్నం రోడ్డు కారిడార్ అభివృద్ధిపై రవిచంద్ర అడిగిన ప్రశ్నకు కేంద్ర ఉపరితల రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ సమాధానమిచ్చారు. జాతీయ రహదారుల ప్రకటనలో అనుసంధానత అవసరం, ట్రాఫిక్ సాంద్రత, గిరిజన, వామపక్ష తీవ్రవాద ప్రభావిత ప్రాంతాలు, పీఎం గతిశక్తి జాతీయ మాస్టర్‌ప్లాన్ వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుంటామని తెలిపారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, ఒడిశాలో వామపక్ష తీవ్రవాద ప్రభావిత ప్రాంతాల్లో రోడ్డు అనుసంధాన పథకం కింద రూ.2,170 కోట్లు, గిరిజన ఉప ప్రణాళిక కింద రూ.1,711 కోట్ల విలువైన పలు ప్రాజెక్టులు మంజూరు చేసినట్లు వెల్లడించారు. భద్రాచలం నుంచి చింతూరు వరకు ఎన్‌హెచ్-30 ద్వారా అనుసంధానం జరిగిందని, ఈ మార్గాన్ని ఇప్పటికే రెండు లేన్లుగా అభివృద్ధి చేశామని గడ్కరీ తెలిపారు. చింతూరు నుంచి సీలేరు-చింతపల్లి-నర్సీపట్నం-తాళ్లపాలెం మీదుగా ఎన్‌హెచ్-16కు అనుసంధానం అవుతుందని, ఎన్‌హెచ్-16ను ఇప్పటికే ఆరు లేన్లుగా అభివృద్ధి చేశామని వివరించారు. నిజామాబాద్ పట్టణం వెలుపల ప్రతిపాదిత రైల్వే బైపాస్ లైన్ అలైన్‌మెంట్‌ను పునఃపరిశీలించాలని కోరారు. నిజామాబాద్ రూరల్ మండలంలోని గుప్తాన్‌పల్లి, పాంగ్రా గ్రామాల పరిసరాల్లో భూములను ప్రభావితం చేసే ప్రస్తుత ప్రతిపాదనపై స్థానికుల ఆందోళనలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. బీఆర్ఎస్ నాయకులు మహేష్ బిగాల, అశోక్‌నగర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు అంజలి శంకర్ తదితరులతో కలిసి ప్రభావిత భూయజమానులు, నివాసితుల తరఫున వినతిపత్రాలు సమర్పించారు. ఆర్మూర్--మామిడిపల్లి స్టేషన్ నుంచి డిచ్‌పల్లి వరకు ప్రత్యామ్నాయ రైల్వే అనుసంధానం, సుభాష్ ట్రాక్ గార్డెన్స్ ప్రాంతం నుంచి డిచ్‌పల్లి వరకు కనెక్టివిటీ వంటి ప్రత్యామ్నాయ మార్గాలను పరిశీలించాలని కోరారు. ప్రత్యామ్నాయ మార్గం ద్వారా 20కిపైగా గ్రామాలకు మెరుగైన రైలు సౌకర్యం అందడంతో పాటు ప్రతిపాదిత జక్రాన్‌పల్లి విమానాశ్రయానికి రాకపోకలు సులభతరం అవుతాయని వివరించారు. 2024 నవంబర్ 14న నమోదైన ప్రజాభిప్రాయాలను కూడా మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ప్రస్తుతం ప్రతిపాదిత అలైన్‌మెంట్ వల్ల ఆశించిన స్థాయిలో ప్రజా ప్రయోజనం ఉండకపోవచ్చని, అందువల్ల దాన్ని ఉపసంహరించి లేదా పునఃపరిశీలించి ప్రజలకు గరిష్ఠ ప్రయోజనం చేకూరే ప్రత్యామ్నాయ మార్గాన్ని ఎంపిక చేయాలని రవిచంద్ర విజ్ఞప్తి చేశారు.



## రేకుర్తి పట్టా భూములను నిషేధిత జాబితా నుండి తొలగించాలి

- జిల్లా జాయింట్ కలెక్టర్‌కు కార్పొరేటర్ల వినతి

**కరీంనగర్ (జనంసాక్షి) :** రేకుర్తి విద్యానగర్ పట్టా భూములపై విధించిన 22/ఏ పై సత్వరమే విచారణ జరిపి రేకుర్తి విద్యానగర్ ప్రజలకు న్యాయం చేయాలని కోరారు ,జిల్లా జాయింట్ కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి కి కలిసి ప్రజల బాధలను విన్నవించి రిజిస్ట్రేషన్ సమస్యను పరిష్కరించాలని వినతి పత్రం అందించారు 19వ డివిజన్ కార్పొరేటర్ సుధగోని మాధవి-కృష్ణగౌడ్, 20వ డివిజన్ కార్పొరేటర్ పర్వతం మల్లేషం, 21వ డివిజన్ కార్పొరేటర్ వరాల నర్సింగం మాజీ కార్పొరేటర్ ఎదుల్ల రాజశేఖం, రేకుర్తి విద్యానగర్ కాలనీల ప్రజలు నాయకులు పాల్గొన్నారు.

## అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం పట్టివేత

**ఆదిలాబాద్, ఆగస్ట్12 (జనంసాక్షి) :** ప్రభుత్వం రేషన్ కార్డు దారులకు మూడు నెలలకు చెందిన బియ్యం ఒక్కసారే పంపిణీ చేస్తున్నారు. దీంతో బియ్యం దళారులు కొనుగోలు చేయడానికి గ్రామాల్లో చక్కర్లు కొడుతున్నారు. మంగళవారం రాత్రి అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్ బియ్యాన్ని పోలీసులు పట్టుకున్నారు. ఎల్‌నినో ప్రభావాన్ని దృష్టిలో పెట్టుకొని కేంద్రం మూడు నెలలకు ఒకసారి అందిస్తుంది. గతవారం నుంచి మూడు నెలల బియ్యం పంపిణి చేస్తున్నారు. ఒక్కొక్కరికి ఆరు కిలోలు అందిస్తున్నారు. దీనిని దృష్టిలో పెట్టుకున్న బియ్యం దళారులు రేషన్ దుకాణాల వెంట క్యూ కడుతున్నారు. పంపిణీ కేంద్రానికి వచ్చిన వినియోగదారునితో ధర మాట్లాడుకొని కొనుగోలు చేస్తున్నారు. సన్నబియ్యం కావడంతో ధర పెరిగింది. కిలో రూ. 15 నుంచి రూ. 18 వరకు చెల్లిస్తున్నారు. ఇలా కొనుగోలు చేసిన బియ్యాన్ని దళారులు మహారాష్ట్ర, ఆసిఫాబాద్ ప్రాంతాలకు ఆటోలు, బొలేరోల్లో తరిలించి అక్కడ కిలో రూ. 25కు విక్రయిస్తున్నట్లు సమాచారం. ప్రతి రేషన్ ముందు ఒక దళారీ ఉండి మరి వినియోగదారుల నుంచి బియ్యం సేకరిస్తున్నాడు. ఈ క్రంలోనే మంగళవారం రాత్రి బెల్లంపల్లి వైపు నుంచి నెన్నెల మీదుగా మహారాష్ట్ర కు బొలేరో వాహనంలో దాదాపు 4 టన్నులు బియ్యం తరలిస్తుండగా నెన్నెల టీ రోడ్ వద్ద పోలీసులు పట్టుకున్నారు.

## బడుగు బలహీన వర్గాల హక్కుల కోసం పోరాడిన ఎర్ర సత్యం

- అణచివేతకు ఎదురొడ్డి నిలిచిన ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్తాం
- టిఆర్పీ రాష్ట్ర కార్యదర్శి అఖిల్ పాషా



**కరీంనగర్ (జనంసాక్షి) :** దివంగత జడ్చర్ల మాజీ ఎమ్మెల్యే ఎర్ర సత్యం వర్ధంతి సందర్భంగా తెలంగాణ రాజ్యాధికార పార్టీ కరీంనగర్ జిల్లా కార్యాలయంలో పార్టీ నాయకులతో కలిసి ఆయన చిత్రపటానికి తెలంగాణ రాజ్యాధికార పార్టీ రాష్ట్ర కార్యదర్శి మొహమ్మద్ అఖిల్ పాషా పూలు వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం ఆయన అఖిల్ పాషా మాట్లాడుతూ ఎర్ర సత్యం గారు వారి జీవితాన్ని, ప్రజల కోసం చేసిన పోరాటాన్ని స్మరించుకున్నారని అన్నారు. ఎర్ర సత్యం ఒక వ్యక్తి కాదు బడుగు బలహీన వర్గాల ఆత్మగౌరవానికి ప్రతీక, పేదలు, అణగారిన వర్గాల హక్కుల కోసం తన జీవితాన్ని అంకితం చేసిన ప్రజానాయకుడని, అధికారాన్ని తన స్వార్థానికి కాకుండా ప్రజల సంక్షేమానికి ఉపయోగించిన నాయకుడు" అని కొనియాడారు. ఆయన జడ్చర్ల ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో ఎర్ర సత్యం బడుగు, బలహీన వర్గాల ప్రజల సమస్యలను అసెంబ్లీతో పాటు ప్రజా వేదికలపై బలంగా వినిపించారని, పేదల అభ్యున్నతి, విద్య, సామాజిక న్యాయం కోసం నిరంతరం కృషి చేశారని తెలిపారు. ఆయన సేవలు, ప్రజల కోసం చేసిన కృషి కారణంగానే నేటికీ ఆయనను ప్రజలు స్మరించుకుంటున్నారని పేర్కొన్నారు. వివిధ వార్తా కథనాల్లోనూ ఎర్ర సత్యాన్ని పేదలు, బడుగు బలహీన వర్గాల కోసం పనిచేసిన నాయకుడని ఆయన గుర్తుచేసారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మహిళ ఉపాధ్యక్షురాలు జింక లావణ్య, రాష్ట్ర యూత్ సహాయ కార్యదర్శి మహబూబ్ అలీ, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ చాంద్ పాషా, జిల్లా మహిళా అధ్యక్షురాలు రాచురి అరుణ, జిల్లా మైనారిటీ నాయకులు ఆర్షత్ బిన్ అలీ, నాయకులు ఇశ్రత్ శావాలి, సాధనందం, జడగల శ్రీనివాస్, విద్యార్థి విభాగ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# నారాయణపూర్ రిజర్వాయర్‌పై అసత్యాలు తగవు

- ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంపై మాజీ ఎమ్మెల్యే రవిశంకర్ విమర్శలు



**కరీంనగర్, ఆగస్ట్12 (జనంసాక్షి) :** ఎల్లంపల్లి ప్రాజెక్టు, నారాయణపూర్ రిజర్వాయర్‌పై ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అసత్యాలు మాట్లాడుతున్నారని, ఆయన ఈ మాటలు మానుకొని నిజాలు చెప్పాలని మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ డిమాండ్ చేశారు. గంగాధర మండలం మధురానగర్ వద్ద అసంపూర్తిగా ఉన్న నారాయణపూర్ కుడి కాలువను బీఆర్ఎస్ మండల నాయకులతో కలిసి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చొప్పదండి నియోజకవర్గంలోని సాగు, తాగునీటి ప్రాజెక్టులపై ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంకు కనీస అవగాహన లేదని దుయ్యబట్టారు. 2004 లో నారాయణపూర్ రిజర్వాయర్‌ను వైఎస్ రాజశేఖర్ రెడ్డి ప్రారంభించినా, తట్టెడు మట్టి కూడా తియ్యలేదని అన్నారు. 2014 లో కేసీఆర్ అధికారంలోకి వచ్చిన తరువాతే 90 శాతం పనులు పూర్తయ్యాయని తెలిపారు. మధురానగర్ వద్ద బ్రిడ్జి నిర్మాణం తో పాటు, రైల్వే లైన్ కింద బ్రిడ్జి నిర్మాణం తాను ఎమ్మెల్యే గా ఉన్న సమయంలోనే పూర్తి చేశానని గుర్తు చేశారు. మంగపేట నిర్వాసితులకు రూ. 14 కోట్ల పరిహారం అందించామని తెలిపారు. నారాయణపూర్ నిర్వాసితులకు పరిహారం ఎన్నికలు రావడంతో నిలిచిపోయిందని పేర్కొన్నారు. పరిహారంపై ప్రశ్నిస్తే ఎమ్మెల్యే అక్రమ కేసులు పెట్టిస్తున్నారని, కాంగ్రెస్ పార్టీ గుండాలతో గ్రామస్తులను బెదిరిస్తున్నారని మండిపడ్డారు. బీఆర్ఎస్ హయాంలో, కాంగ్రెస్ పార్టీ హయంలో జరిగిన అభివృద్ధిపై మధురానగర్ చౌరస్తాలో చర్చకు రావాలని సవాల్ విసిరారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు నారాయణపూర్ గ్రామాన్ని ముంపు గ్రామంలో ప్రకటించి పరిహారం అందించాలని లేదంటే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఆయనతో గంగాధర సింగిల్ విండో చైర్మన్ దూలం బాలా గౌడ్, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు మేచినేని నవీన్ రావు, నాయకులు వేముల దామోదర్, రామిడి సురేందర్, ముక్కెర మల్లేశం, బొల్లాడి శ్రీనివాస్ రెడ్డి, పద్మూరి ఆదిమల్లు, గడ్డం స్వామి, దోమకొండ మల్లయ్య, లింగాల దుర్గయ్య, ఆకుల మధుసూదన్, తూము మల్లారెడ్డి, సముద్రాల అజయ్ ఉన్నారు.

సంపాదకీయం

## నిప్పులేనిదే పొగరాదు..
# న్యాయస్థానంపై నమ్మకం సన్నగిల్లితే?

న్యాయవ్యవస్థ అంటే సామాన్య పౌరుడికి చివరి ఆశ్రయం. చట్టసభలు రాజకీయ ఒత్తిళ్లకు లోనైనా, అధికార యంత్రాంగం అధికార దుర్వినియోగానికి పాల్పడినా చివరకు ప్రజలు ఆశ్రయించేది న్యాయస్థానాన్నే. "కోర్టుకు వెళ్తాం" అనే మాటలోనే ఒక సామాన్యుడికి ఎంతో భరోసా ఉంటుంది. ఆ భరోసా నిలబడాలంటే న్యాయమూర్తుల నిజాయతీపై ఎలాంటి సందేహానికీ తావు ఉండకూడదు. కానీ న్యాయమూర్తులే వివరణ ఇవ్వాల్సిన పరిస్థితులు తలెత్తితే? న్యాయస్థానాలపై ప్రజల నమ్మకమే ప్రశ్నార్థకమైతే? అప్పుడు అది ఒక వ్యక్తికి సంబంధించిన వ్యవహారంగా మాత్రమే మిగలదు. మొత్తం వ్యవస్థ విశ్వసనీయతకే సవాలుగా మారుతుంది.

ఢిల్లీ హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ యశ్వంత్ వర్మ అధికారిక నివాసంలో జరిగిన అగ్నిప్రమాదం అనంతరం నగదు కట్టలు బయటపడటం, ఆ తర్వాత వాటి చుట్టూ ఏర్పడిన వివాదం, దర్యాప్తు ప్రక్రియపై వచ్చిన ప్రశ్నలు దేశవ్యాప్తంగా తీవ్ర చర్చకు దారితీశాయి. లోక్‌సభ స్పీకర్ ఏర్పాటు చేసిన ముగ్గురు సభ్యుల కమిటీ నివేదిక ఈ వ్యవహారాన్ని మరింత తీవ్రమైన స్థాయికి తీసుకెళ్లింది. నగదు అక్కడికి ఎలా వచ్చింది? అది ఎవరిది? దాని మూలం ఏమిటి? వంటి కీలక ప్రశ్నలకు సరైన వివరణ లభించలేదని కమిటీ పేర్కొన్నట్లు వెల్లడైంది. సాక్ష్యాధారాల పరిరక్షణ, సంఘటనా స్థల నిర్వహణ, ఇచ్చిన వివరణలో పారదర్శకత వంటి అంశాలపైనా కమిటీ తీవ్ర వ్యాఖ్యలు చేసింది. ఇక్కడ అసలు ప్రశ్న నగదు కట్టల గురించే కాదు. న్యాయాన్ని కాపాడాల్సిన వ్యవస్థ తనపై వచ్చిన అనుమానాలను ఎంత పారదర్శకంగా ఎదుర్కొంటుంది? అన్నదే. ఒక సాధారణ పౌరుడి ఇంట్లో ఇలాంటి పరిస్థితి ఎదురైతే దర్యాప్తు సంస్థలు, పోలీసులు, కోర్టులు వ్యవహరించే తీరుతో పోలిస్తే న్యాయవ్యవస్థలోని అత్యున్నత స్థానాల్లో ఉన్నవారి విషయంలో అదే ప్రమాణాలు అమలవుతున్నాయా? అనే సందేహం ప్రజల్లో కలగకూడదు.

న్యాయమూర్తికి చట్టంపైన ప్రత్యేక హోదా లేదు. రాజ్యాంగం ఇచ్చిన రక్షణ ఆయన స్వతంత్రంగా న్యాయం చేయడానికి మాత్రమే. స్వతంత్రత పేరుతో జవాబుదారీతనం బలహీన పడితే అది చివరకు న్యాయవ్యవస్థ స్వతంత్రతకే నష్టం. గతంలో కూడా కొందరు న్యాయమూర్తులపై ఆర్థిక అవకతవకలు, అధికార దుర్వినియోగం, ఇతర తీవ్రమైన ఆరోపణలు వచ్చాయి. జస్టిస్ వి. రామస్వామిపై అభిశంసన ప్రక్రియ పార్లమెంటు వరకు వెళ్లింది. జస్టిస్ సౌమిత్ర సేన్ విషయంలో రాజ్యసభ అభిశంసన తీర్మానాన్ని ఆమోదించింది. ఈ ఘటనలన్నీ ఒక చేదు వాస్తవాన్ని గుర్తుచేస్తున్నాయి.న్యాయమూర్తులపై చర్య తీసుకునే రాజ్యాంగ ప్రక్రియ అత్యంత కఠినమైనది. న్యాయమూర్తులను ఎవరు ప్రశ్నించాలి అన్న ప్రశ్నకు రాజ్యాంగం ఒక ప్రత్యేక విధానాన్ని నిర్దేశించింది. అది న్యాయవ్యవస్థపై రాజకీయ జోక్యాన్ని అడ్డుకోవడానికి అవసరమే. కానీ అదే సమయంలో, ఆ ప్రక్రియ అంత క్లిష్టంగా ఉండకూడదు. ఆరోపణలు తీవ్ర మైనవైతే నిజం త్వరగా బయటపడేలా వ్యవస్థ ఉండాలి. విచారణ పూర్తయ్యేలోపు పదవీ విరమణ, రాజీనామా లేదా ఇతర మార్గాల్లో వ్యవహారం ముగిసిపోతే ప్రజలకు మిగిలేది అనుమానమే.

న్యాయవ్యవస్థకు అత్యంత విలువైన ఆస్తి భవనాలు కాదు, అధికారాలు కాదు, న్యాయమూర్తుల పదవులు కూడా కాదు ప్రజల విశ్వాసం. ఒక పేదవాడు తన భూమి పోయిందని కోర్టుకు వస్తాడు. ఒక మహిళ తనపై జరిగిన అన్యాయానికి న్యాయం కోరుతుంది. ఒక కార్మికుడు తన హక్కుల కోసం న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తాడు. ఒక సాధారణ పౌరుడు ప్రభుత్వ అధికారాన్ని ప్రశ్నించడానికి కోర్టు తలుపు తడతాడు. వాళ్లందరికీ ఉన్న చివరి నమ్మకం ఒక్కటే కోర్టులో నిజానికి విలువ ఉంటుంది. ఆ నమ్మకమే సన్నగిల్లితే ప్రజాస్వామ్యానికి అది అత్యంత ప్రమాదకర సంకేతం. అందుకే యశ్వంత్ వర్మ వ్యవహారం ఒక వ్యక్తి చుట్టూ తిరిగే వివాదంగా ముగియకూడదు. ఇది న్యాయవ్యవస్థలో జవాబుదారీతనం ఎలా ఉండాలి అనే పెద్ద ప్రశ్నకు దారితీయాలి. న్యాయమూర్తుల నియామకం నుంచి వారి ప్రవర్తనా నియమావళి వరకు, ఫిర్యాదుల స్వీకరణ నుంచి విచారణ వరకు, ఆరోపణల పరిశీలన నుంచి తుది చర్య వరకు ఒక స్పష్టమైన, స్వతంత్ర, పారదర్శక వ్యవస్థ అవసరం.


**నిప్పులేనిదే పొగ రాదు. కానీ పొగ కనిపించిందని నిప్పు ఉందని తేల్చేయడం కూడా న్యాయం కాదు. అందుకే అవసరం అనుమానాలను దాచడం కాదు నిజాన్ని వెలికితీసే పారదర్శక విచారణ. ఆ విచారణపై ప్రజలకు నమ్మకం కలిగించగలిగితేనే న్యాయవ్యవస్థపై నమ్మకం నిలుస్తుంది. లేకపోతే న్యాయం కోసం తలుపు తట్టే ప్రజలే ఒకరోజు ఆ తలుపు వెనుక ఏముందో ప్రశ్నించే పరిస్థితి వస్తుంది.**

ఇంట్లో అందరూ ఉన్నారు... కానీ

# నాతో మాట్లాడేవాళ్లు ఎవరూ లేరు..!

ఇంట్లో మనుషులు ఉన్నారు. మాటలు ఉన్నాయి. బాధ్యతలు ఉన్నాయి. కలిసి తినే భోజనం ఉంది. కలిసి వెళ్లే ప్రయాణాలు ఉన్నాయి. కానీ...మనసు విప్పి మాట్లాడుకునే ఒక మనిషి మాత్రం లేదు. ఇది నేటి కుటుంబాల్లో కనిపిస్తున్న అత్యంత నిశ్శబ్దమైన విషాదం. ఒకప్పుడు ఉమ్మడి కుటుంబాల్లో వ్యక్తికి తన బాధను చెప్పుకోవడానికి అమ్మమ్మ ఉండేది. తాతయ్య ఉండేవాడు. అన్న, అక్క, చెల్లి, తమ్ముడు ఉండేవారు. పొరుగింటి వాళ్లతోనూ ఒక అనుబంధం ఉండేది. ఇప్పుడు ఇల్లు చిన్నదైంది. కుటుంబం చిన్నదైంది. కానీ మనిషి ఒంటరితనం మాత్రం పెద్దదైంది. పెళ్లి అంటే కలిసి జీవించడం మాత్రమేనా..? ఒక మహిళ పెళ్లి చేసుకున్నప్పుడు ఆమె కేవలం భర్తతో కలిసి జీవించడం ప్రారంభించదు. ఒక కొత్త కుటుంబంలోకి అడుగుపెడుతుంది. కొత్త సంబంధాలు, కొత్త అంచనాలు, కొత్త బాధ్యతలు ఆమె చుట్టూ ఏర్పడతాయి. కానీ ఒక ప్రశ్న మాత్రం తరచూ మిగిలిపోతుంది. "ఈ కొత్త జీవితంలో నేను ఎక్కడ ఉన్నాను..?" భార్యగా ఉండాలి. కోడలిగా ఉండాలి. తల్లిగా ఉండాలి. ఉద్యోగం చేస్తే ఉద్యోగినిగా కూడా తన పాత్రను నిర్వర్తించాలి. అందరి అవసరాలను గుర్తించే ఆమెకు...తన అవసరాలను గుర్తించేది ఎవరు..? చాలా కుటుంబాల్లో భార్యాభర్తలు కలిసి జీవిస్తారు. కానీ ఒకరినొకరు అర్థం చేసుకోవడానికి సమయం కేటాయించరు. భర్తకు ఆమె ఒక బాధ్యతలా కనిపించవచ్చు. ఆమెకు భర్త ఒక అలవాటులా అనిపించవచ్చు. ఇద్దరూ తప్పు చేయకపోయినా...ఇద్దరి మధ్య దూరం పెరగవచ్చు. అది గొడవతో మొదలవ్వాల్సిన అవసరం లేదు. కొన్నిసార్లు అది మాటలు తగ్గిపోవడంతోనే మొదలవుతుంది.

ప్రేమలో ఉన్నప్పుడు మనిషి ఎదుటివారి లోపాలను కూడా అందంగా చూడగలుగుతాడు. ఎందుకంటే ప్రేమలో మనం మనిషిని చూస్తాం. పెళ్లి తర్వాత మాత్రం అదే మనిషిని బాధ్యతల మధ్య చూస్తాం. అక్కడ ప్రేమకు తోడు ఆర్థిక పరిస్థితులు, కుటుంబ బాధ్యతలు, పిల్లలు, ఉద్యోగ ఒత్తిళ్లు, వ్యక్తిగత స్వేచ్ఛ, అత్తమామల సంబంధాలు, సామాజిక అంచనాలు చేరుతాయి. అప్పుడు ఒకప్పుడు ఎంతో ప్రేమించిన వ్యక్తే... "నన్ను ఎందుకు అర్థం చేసుకోవడం లేదు..?" అనే ప్రశ్నకు కారణమవుతాడు. ఇక్కడ సమస్య ప్రేమ తగ్గిపోవడమే కాదు. చాలాసార్లు ప్రేమను వ్యక్తపరిచే భాష మారిపోతుంది. ఒకరికి ప్రేమ అంటే మాట్లాడటం. మరొకరికి ప్రేమ అంటే బాధ్యత తీసుకోవడం. ఒకరికి ప్రేమ అంటే సమయం ఇవ్వడం. మరొకరికి ప్రేమ అంటే డబ్బు సంపాదించి కుటుంబాన్ని చూసుకోవడం. ఇద్దరూ ప్రేమిస్తున్నా... ప్రేమను అనుభవించే విధానం వేర్వేరుగా ఉండవచ్చు. అక్కడే అపార్థాలు మొదలవుతాయి.



పెళ్లి జీవితంలో తనను ఎవరూ వినడం లేదని భావించిన వ్యక్తికి బయట ఎవరో ఒకరు శ్రద్ధగా వింటే అది చాలా పెద్ద అనుభూతిగా అనిపించవచ్చు. "ఎలా ఉన్నావు..?" అని అడిగిన ఒక మాట... "నీకు బాధగా ఉందని నాకు అర్థమవుతోంది" అని చెప్పిన ఒక వాక్యం... "నువ్వు నీలా ఉండవచ్చు" అని ఇచ్చిన ఒక స్వేచ్ఛ...ఇవి భావోద్వేగంగా ఆకలితో ఉన్న మనిషికి చాలా విలువైనవిగా అనిపిస్తాయి.

అక్కడి నుంచే కొన్నిసార్లు ప్రేమబంధం ఏర్పడుతుంది. కానీ ప్రతి భావోద్వేగ అనుబంధం నిజమైన పరిష్కారం కాదు. ఎందుకంటే మనం ఒక వ్యక్తిని ప్రేమిస్తున్నామా..? లేక... ఆ వ్యక్తి మనలో మిగిలిపోయిన ఖాళీని నింపుతున్నాడా..? ఈ రెండింటి మధ్య చాలా పెద్ద తేడా ఉంది. మహిళకు ప్రేమ కావాలి... కానీ తన వ్యక్తిత్వం కూడా కావాలి. ఇప్పటి మహిళ గతంతో పోలిస్తే ఎన్నో రంగాల్లో ముందుకు వచ్చింది. చదువుకుంది. ఉద్యోగం చేస్తోంది. ఆర్థికంగా నిలబడుతోంది. తన అభిప్రాయాన్ని చెప్పగలుగుతోంది. కానీ ఒక సమస్య మాత్రం ఇంకా పూర్తిగా పరిష్కారం కాలేదు. ఆమె స్వేచ్ఛను కుటుంబం ఎంతవరకు అంగీకరిస్తోంది..? "నీకు ఉద్యోగం ఉంది కదా!" అంటారు. కానీ ఇంటి పనులు మాత్రం ఇంకా ప్రధానంగా ఆమె బాధ్యతగానే మిగిలిపోతాయి.

"నీకు స్వేచ్ఛ ఉంది కదా..!" అంటారు. కానీ ఆమె తీసుకునే ప్రతి నిర్ణయానికి కుటుంబ అనుమతి కావాలనుకుంటారు. ఇలాంటి వైరుధ్యాల మధ్య మహిళ బయటకు బలంగా కనిపించినా... లోపల మాత్రం నిరంతరం తనను తాను ప్రశ్నించుకుంటూనే ఉంటుంది. అయితే పరిష్కారం విడిపోవడమేనా..?

కాదు. అలాగే... ఎట్టి పరిస్థితుల్లోనైనా బంధాన్ని కొనసాగించడమే పరిష్కారం కూడా కాదు.

సంబంధాన్ని కాపాడాలంటే ముందు ఆ సంబంధంలో ఉన్న మనుషులను కాపాడాలి.

అవమానం, హింస, నిరంతర నియంత్రణ, మానసిక వేధింపులు ఉన్న చోట "కుటుంబ విలువలు" పేరుతో ఒక వ్యక్తి జీవితాన్ని బలి చేయడం విలువ కాదు. అదే సమయంలో చిన్నచిన్న అపార్థాలు, సంభాషణ లోపాలు, అహంకారాలు, సమయం ఇవ్వకపోవడం వంటి కారణాలతో ఒక మంచి బంధాన్ని కోల్పోవడం కూడా అవసరం లేదు. బంధాన్ని నిలబెట్టేది ప్రేమ మాత్రమే కాదు... సంభాషణ, పరస్పర గౌరవం, నమ్మకం, వ్యక్తిగత స్థలానికి గౌరవం కూడా.

నిజానికి మనకు కావాల్సింది పరిపూర్ణమైన మనిషి కాదు మన బాధను వినే మనిషి కావాలి.

మన విజయాన్ని చూసి అసూయపడని మనిషి కావాలి. మన వైఫల్యాన్ని చూసి తక్కువ చేయని మనిషి కావాలి. మనతో విభేదించినా మనల్ని అవమానించని మనిషి కావాలి. పెళ్లిలో ఉన్నా మనిషిగా ఉండే హక్కును ఇచ్చే భాగస్వామి కావాలి. ప్రేమలో ఉన్నా మన స్వేచ్ఛను గౌరవించే వ్యక్తి కావాలి. కుటుంబంలో ఉన్నా మన వ్యక్తిత్వాన్ని కోల్పోకుండా ఉండే స్థలం కావాలి.

చివరగా ఒక మహిళ మనసులోని మాట ఎలా ఉంటుంది..? తనకు పెద్ద ఇల్లు అవసరం లేదు. తన మాట వినే చిన్న మనసు చాలు. తనను ప్రేమిస్తున్నావని రోజూ చెప్పాల్సిన అవసరం లేదు. తను బాధపడుతున్నప్పుడు అది గుర్తించేంత శ్రద్ధ చాలు. తన కోసం పెద్ద బహుమతులు కొనాల్సిన అవసరం లేదు. తను మాట్లాడుతున్నప్పుడు ఫోన్ పక్కన పెట్టి తన వైపు చూసేంత సమయం చాలు. తనను తన జీవితంలో ఒక పాత్రగా కాదు...ఒక సంపూర్ణమైన మనిషిగా చూడాలి. అప్పుడు పెళ్లి బంధం బంధనంగా అనిపించదు. ప్రేమబంధం పారిపోవడానికి మార్గంగా అనిపించదు. కుటుంబం బాధ్యతగా మాత్రమే కనిపించదు. మనుషుల మధ్య మనిషితనం మిగులుతుంది. ఈరోజు మనం ఒక్కసారి మనల్ని మనమే అడగాల్సిన ప్రశ్న ఇదే... "నా జీవితంలో నాతో కలిసి జీవిస్తున్నవాళ్లు ఎంతమంది ఉన్నారు..?" అది కాదు... "నా మనసుతో కలిసి నడుస్తున్నవాళ్లు ఎంతమంది ఉన్నారు..?" ఆ సమాధానం...మన సంబంధాల అసలు స్థితిని చెబుతుంది.



**కస్తూరిదారా**
jannukastoori@gmail.com

## నిప్పుల వాగులు నిదురపోవనీ..

వొడవని దుఃఖం
తీరని బాధా
ఆగని హింసా..
మళ్ళీ మళ్ళీ
పడగిప్పొచ్చుగాక..

జైళ్ళే ఇళ్లంటూ
రాజ్యం రంకేస్తూ
కుళ్ళబొడిచేస్తూ

నలు దిక్కులా
కారుచీకట్లు
కమ్మేయొచ్చుగాక ..

అయినా..
ఏమైనా
ఏదేమైనా
బతకాలి..
బతికున్నామని
నిరూపించుకోవాలి...

విత్తనగర్భంలోంచి
విల్లంబై

పొడుచుకొచ్చిన
సంధ్యారావపు
పసి ససిలా
రెక్కవిప్పిన
రాడికల్ లా...

బరితెగించిన
హంతక పాలన
చిగురు తొడిగిన
ఆశలు చిదిమేసిన
పాడు కాలపు
కర్కశ కాళ్లకింద
నలిగి చితికిన

బతుకులూ..

ముక్కలు ముక్కలైన
దేహాంగాలూ..

బాగు
చేసుకోవడం కోసమైనా..

బాకులు
చేసుకోవడం కోసమైనా..

బతకాలి..
తొడగొట్టే
రాజ్య హింసకు
దడిగట్టగ

లేచి నిలువాలి..

అవును
జంగల్ మహల్
అమరత్వాలు
వృధాకావని
పెల్లుబికే ఉప్పెనలై
ఎగజిమ్మే సత్తువల
విస్ఫోటనలు
అంతం కావని చాటాలి..

సకల పెత్తనాలు
నేల కూల్చేదాకా




నిప్పుల వాగులు
నిదురపోవనీ
బరిగీసి నిలిచి చూపాలి...

డా. ఇక్బాల్ పాషా
9440775732

# నిరంతర ప్రవాహం సోమన్న

తెలంగాణ సాంస్కృతిక చిత్రపటంలో ఏపూరి సోమన్నను కొత్తగా పరిచయం చేయాల్సిన పనిలేదు. తెలంగాణ ఉద్యమంలో "పోరుసాగుతుంది కొడుకా.." అని పల్లెపల్లెన పాడుకునేందుకు కారణమైనోడు. అప్పటికి సోమన్న యువ వాగ్గేకారుడు. తెలంగాణ ఉద్యమంలో కాలికి బలపం కట్టుక తిరిగిన సోమన్న దళితోద్యమం అందించిన వారసత్వం. అందుకే బహుజన పాటను భుజానేసుకొని నడిచాడు. నిత్యం పాలకుల మీద మర్లబడే నల్లగొండ నేల మీద అడుగుపెడితే ఏపూరి సోమన్న పాటలు మనల్ని కట్టిపడేస్తాయి. సోమన్న పాటలు కేవలం కాసేపు ఉత్సాహపరిచి మాయమై పోవు. మెదడుపొరల్లోకి చేరి ఆలోచనల ప్రవా హంగా మారి రక్తనాళాల గుండా ఒక భావం గుండెకు చేరుతది. ఇక అక్కడ ఒక కెమిస్ట్రీ మొద లైతది. అచ్చం వోల్కానో అగ్నిపర్వతంలా గుండె నెమ్మదిగా రగులుకుంటది. సోమన్న పాట వినడానికి ముందు సజావుగా సాగిన రక్తప్రవాహం ఒక్కసారిగా పోటెత్తు తది. శరీరమంతా ఆ మంట మనల్ని అల్లుకపోతది. చరిత్రపొడుగునా జరిగిన ద్రోహాల్ని సునాయసంగా మోసుకొస్తాయి సోమన్న పాటలు. పూసగుచ్చినట్టు పల్లవి చరణాలుగా మన చెవిని తాకుతుంటే మనకు తెలియకుండానే పిడికిల్లు బిగుసుకుంటయి. మనువాద కులవ్యవస్థను కూల దోసేందుకు కావాల్సిన చైతన్యాన్ని అందిస్తాయి. అందుకే సోమన్న పాటలు ఎంటర్‌టైన్‌మెంట్ కాదు, ఎడ్యుకేషన్ ! సాంస్కృతిక రంగచరిత్రను పూలే, అంబేద్కర్ ఆలోచనవిధానం చూసే సాంస్కృతిక కార్యకర్త సోమన్న. బహుజన సైద్ధాంతిక పునాది లేకుంటే ఏ కళాకారుని శ్రమ అయినా బూడిదలో పోసిన పన్నీరే అవుతుందనే సోయికలిగినోడు. అందుకే "కళాకారులారా మనకు పూలే, అంబేద్కర్ ఆలోచన విధానం కావాలి. సామాజిక తెలంగాణ కావాలని" నిర్భయంగా నినదించాడు. తెలుగుసమాజంలో అనేక ఫ్యూడల్ లక్షణాలున్నాయి. ప్రజాకళాకారుడన్నా, ప్రజాకళలన్నా ఒక మూసధోరణిలో చూసే సంప్రదాయమే ఉంది. నాయకులు వచ్చే వరకు జనాన్ని కూడగట్టేవాడో, సభ అనంతరం సాంస్కృతిక కళారూపాలు కలవు అన్న మాటను నిజం చేసేవాడో అనే నానుడి ఉంది. కానీ, ఆ గోడలను బద్దలు కొడుతూ మెజారిటీగా ఉన్న బహుజనులకు రాజ్యాధికారం కావాలని గజ్జెకట్టిన దళితవాగ్గేయ కారులు మాస్టార్జీ, గోరటివెంకన్న, ఎర్ర ఉపాలి, గ్యారయాదయ్యల బాటను అందిపుచ్చుకొని ముందుకుసాగుతున్నవాడు సోమన్న.

ఒక్కో ఉద్యమం పురుడుపోసుకొని అది ఒక్క ఉదటునా ఎగసి ప్రభావితం చేస్తున్నప్పుడు ప్రతీ మామూలు కళాకారుడు సహజంగానే అందులో కలిసిపోతాడు. కానీ, సోమన్న చైతన్యం అలా మామూలుది కాదు. విప్లవ వేదికల మీదినుండి కూడా దళితుల కోసం పాటపాడిన యుద్ధనౌక గద్దర్, ప్రజావాగ్గేయకారులు గూడ అంజన్న, గోరటి వెంకన్న, జయరాజులు చేసిన కృషి విప్లవపార్టీలకు దళిత బహుజనుల నుంచి మద్దతు కూడగట్టింది. కానీ, బహుజనుల బతుకు ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్నట్టుగా మారింది. మనువాద కులవ్యవస్థ అసలు స్వరూపాన్ని అర్థం చేసుకోకుండా దాని పెత్తనాన్ని కబళించకుండా ఈ దేశం మారదనే విషయాన్ని వీళ్లంతా ఆలస్యంగా గమనించారు.



అందుకు కారణం అప్పటిదాకా ఎర్రజెండా అందించిన చూపుతోనే వీళ్లు సమాజాన్ని చూసి, కేవలం వర్గవైరుధ్యమే ఇందుకు కారణమనే నిర్ధారణకు వచ్చారు. కానీ, దళితోద్యమం నిలదీసిన ప్రశ్నలకు ఈ వాగ్గేయకారులు కూడా దళితులే కావడం మూలంగా అనివార్యంగా కులం గురించి కూడా అప్పుడప్పుడు రాయకతప్పలేదు. ఈ నేపథ్యం నుండి చూసినప్పుడు ఏపూరి సోమన్నలో బహుజన తాత్విక పునాదిస్పష్టంగా కనిపిస్తోంది. తాను నడుస్తూ తన చుట్టూ ఉన్న బహుజనులను కలుపుకొని నడుస్తున్నాడు.

**"చెప్పులు కుట్టిన చేతులతోనే చరిత్రను రాయాలే
ఈ దేశాన్నేలాలే
అగ్రకుల బ్రాహ్మనిజం మంటల మండాలె
మారోజులు రావాలే
మారోజులు రావాలే ఈ దేశాన్నేలాలే"**

సోమన్న పాటలకు బహుజన తాత్వికపునాదే బలం. సోమన్న పాటలు వింటే అనేక విషయాలు అలవోకగా అర్థమవుతాయి. మనువాద నిచ్చెన మెట్ల కులవ్యవస్థ ఈ దేశమూలవాసులను విభజించి పాలిస్తున్నది. అధికారాన్ని చేజిక్కించుకున్న బ్రాహ్మణ, బనియా కులాలు మూలవాసుల గతాన్ని, వర్తమానాన్ని మాత్రమే కాదు భవిష్యత్తును కూడా శాసిస్తున్నారు. ఈ కుట్రల వల్ల మెజారిటీగా ఉన్న బహుజనులు సామాజికంగా, ఆర్థికంగా చితికిపోయి బతుకుతున్నారు. కేంద్రంలో ఉన్న బ్రాహ్మణీయ మనువాద పాలకులు ఈ కుట్రను నేటికి పకడ్బందీగా అమలుచేస్తున్నారు. అందువల్లనే మూలవాసులంతా నిత్యం బతుకుపోరాటంలోనే మగ్గుతున్నారు. ఈ చరిత్ర తెలియనివారు కర్మ,గీత లంటూ అదే బ్రాహ్మణవర్గాలకు ఊడిగం చేస్తూ తమను తాము తిట్టుకుంటూ గడుపుతుంటారు. ఈ అసలు కారణాన్ని కనుగొన్న వాగ్గేయకారుడు కావడం వల్లనేమో, సోమన్న పాటల్లో బహుజన తాత్విక పునాదే బలంగా ప్రతిఫలిస్తున్నది. సామాజిక శాస్త్రవేత్తలో, యూనివర్సిటీ పరిశోధకులో ఎంతో అధ్యయనం చేస్తే తప్ప, అర్థం కానీ అనేక విషయాలను సోమన్న పాటల ద్వారా మన ముందుకు తెచ్చాడు. వందయేండ్లకు కిందటే పూలే అంబేద్కర్‌లు చేసిన మహత్తర పోరాటం ఎందుకోసమో వివరించాడు. సామాజిక వ్యవస్థలో మెజారిటీగా ఉండి, సంపద సృష్టికర్తలై, సమాజ ఇరుసుకు మూలాధారమైన బహుజన కులాలు ఎందుకు పాలితులుగానే ఉంటున్నారనే ఆవేదన చెందుతాడు. విప్లవ వారసత్వంగా చెప్పుకునే వాగ్గేయకారులు మరిచిపోయిన ఈ సామాజిక బాధ్యతను, సోమన్న తన పాటల ద్వారా తలకెత్తుకున్నాడు. అందుకే మూలవాసులను మేల్కొలుపడానికి ఈ పాటలు సాంస్కృతిక ఆయుధాలు.

**"జెండాలు మోసిన జనమును పోగేసిన
దండాలు పెట్టినా దళితుల కూడగట్టినా
కరపత్రం పంచినా పోస్టరు అతికించినా
మా లీడరొచ్చిండని మైకుపట్టి మొత్తుకున్న
బహుజన మన బతుకెన్నడు మారురో
మహజన మన రోజు లెన్నడొచ్చురో"**

అంటూ మేల్కొలిపే ఈ పాటలు బ్రాహ్మణీయ కుట్రలను బజారుకీడుస్తాయి. కులవ్యవస్థను కాపాడుతున్న పల్లెలను సోమన్న పాటలు కొత్తగా చూపిస్తుంటాయి. మూవాసులందరి మధ్య ఉన్న రక్తసంబంధాన్ని గుర్తుచేస్తాయి. ఇలాంటి పాటలు రచించే పనిని సోమన్న మరింత విస్తృతం చేయాలని ఆశిస్తున్నాను.


**(నేడు రవీంద్రభారతిలో ఏపూరి సోమన్న 25 యేండ్ల పాటల ప్రవాహం సభ సందర్భంగా)**



డా.పసునూరి రవీందర్
కవి, రచయిత
77026 48825

# క్యూబా విప్లవయోధుడు కాస్ట్రో

అగ్రరాజ్యం అమెరికాకు అతి స్వల్ప మైళ్ళ దూరంలో ఉన్న ఒక చిన్న ద్వీప దేశం నుంచి సామ్రాజ్యవాదాన్ని సవాల్ చేసి గెలిచి నిలిచిన ధీశాలి ఫిడెల్ కాస్ట్రో. సి.ఐ.ఎ వంటి గూఢచారి సంస్థలు తనని హతమార్చడానికి ఏకంగా 634 సార్లు పన్నిన కుట్రలను ఆయన తిప్పికొట్టారు. దోపిడీ వ్యవస్థపై ఆయన ధిక్కార స్వరాన్ని రగిలించి తిరుగుబాటు జెండా ఎగురవేసి విజయం సాధించి ప్రపంచ పీడిత దేశాలకు ఆదర్శంగా నిలిచారు. ఫిడెల్ కాస్ట్రో 1959 లో ఫుల్జెన్సియో బాటిస్టా యొక్క సైనిక నియంతృత్వాన్ని కూలదోసి పశ్చిమార్ధగోళంలో మొట్టమొదటిసారిగా కమ్యూనిస్ట్ రాజ్యాన్ని స్థాపించారు. సోవియట్ యూనియన్ అందించిన సహాయంతో క్యూబా చెప్పుకోదగ్గ పురోగతిని సాధించింది. కాని ఆ సోవియట్ యూనియన్ పతనం కావడం, అరవై ఏళ్లకు పైగా అమెరికా ఆంక్షలు కొనసాగిస్తున్న మూలంగా నేడు క్యూబా ఆర్థికంగా దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతునే ఉంది. కాస్ట్రో నేతృత్వంలో విజయవంతమైన క్యూబా ఇటీవలి కాలంలో ఒకవైపుగా సంక్షోభాలను ఎదుర్కొంటూనే మరోవైపుగా ఇతర దేశాలకు వైద్య సహాయ సహకారాలను అందిస్తూ ప్రపంచ దేశాల ప్రశంసలు పొందుతున్న ఈ తరుణంలో కాస్ట్రో శత జయంతిని ఈ ఆగస్టు 13 నాడు జరుపుకుంటుంది.



కాస్ట్రో 1926 ఆగస్టు 13 నాడు తూర్పు క్యూబాలోని బిరాన్ అనే ఒక చిన్న పట్టణంలో జన్మించారు. ఆయన తండ్రి ఒక సంపన్న స్పానిష్ చెరకు రైతు. ఆయన క్యూబా స్వాతంత్ర్య యుద్ధం సమయంలో మొదటిసారిగా ఆ ద్వీపానికి వచ్చారు. కాస్ట్రో జెస్యూట్ పాఠశాలలో చదువుకున్నారు. ఆయన విద్యార్థి దశ నుండి లాటిన్ అమెరికా అంతటా విప్లవ కార్యకలాపాలలో పాల్గొన్నారు. కాస్ట్రో 1950 లో హవానా విశ్వవిద్యాలయం నుండి న్యాయశాస్త్రంలో పట్టా పొంది న్యాయవాద వృత్తిని చేపట్టారు. 'ఫెడరేషన్ ఆఫ్ యూనివర్సిటీ స్టూడెంట్స్' (ఎఫ్.ఇ.యు)కు అధ్యక్షత వహించారు. అవినీతి వ్యతిరేక ఆర్థడాక్స్ పార్టీలో ఆయన చేరారు. విశ్వవిద్యాలయ విద్యను పూర్తి చేసిన తర్వాత కాస్ట్రో 'ప్రతినిధుల సభకు పోటీ చేయడం ద్వారా జాతీయ రాజకీయాల్లోకి రావాలి' అని నిర్ణయించుకున్నాడు. కాస్ట్రో 1952 లో క్యూబన్ పీపుల్స్ పార్టీ తరపున అభ్యర్థిగా బరిలో నిలబడినను ఫుల్జెన్సియో బాటిస్టా జరిపిన వినాశకరమైన సైనిక తిరుగుబాటు కార్లోస్ ప్రియో సోకారాస్ ప్రభుత్వాన్ని కూలదోసి భవిష్యత్ ఎన్నికలను నిషేధించింది. ఈ ప్రతికూలతను ఎదుర్కొన్న కాస్ట్రో ఆ సమయంలో క్యూబాలో రాజకీయ పోరాటంలో పాల్గొనడానికి 'ఎన్నికలు మరియు చట్టపరమైన ఫిర్యాదులు సరైన మార్గం కాదు' అని గ్రహించి 'ప్రజా తిరుగుబాటు'కు ప్రణాళిక రచించారు.

కాస్ట్రో 1953 జూలైలో 120 మందితో కలిసి శాంటియాగో డి క్యూబాలోని మోంకాడా సైనిక శిబిరంపై దాడికి నాయకత్వం వహించారు. కాని ఆ దాడి విఫలం కావడమే కాకుండా కాస్ట్రో పట్టుబడి జైలు శిక్షకు గురయ్యాడు. అతని అనుచరులలో చాలామంది మరణించారు. తన నిరంకుశ ప్రతిష్టను మెరుగుపరుచుకోవాలని చూస్తున్న అమెరికా మద్దతు ఉన్న బాటిస్టా తదనంతరం 1955 లో సాధారణ క్షమాభిక్షలో భాగంగా కాస్ట్రోను విడుదల చేశారు. జైలు నుండి విడుదలైన కాస్ట్రో అమెరికా మరియు మెక్సికో దేశాలకు ప్రయాణించారు. మెక్సికోలో అతను స్పానిష్ అంతర్యుద్ధంలో పాల్గొన్న ఆల్బెర్టో బాయో అనే మాజీ యోధుడి వద్ద శిక్షణ పొందారు. ఎర్నెస్టో చే గెవారాతో సహా పలువురు యోధులతో కలిసి యుద్ధ ప్రణాళికలు రచించారు.

యువ విప్లవకారులు సాయుధ పోరాట మార్గాన్ని అనుసరించాలని నిర్ణయించుకున్నారు. 1956 లో 82 మందితో 'గ్రాన్మా' పడవలో క్యూబా తీరానికి చేరిన కాస్ట్రో బృందంపై బాటిస్టా సైన్యం మెరుపుదాడి చేయగా కాస్ట్రో, రౌల్ కాస్ట్రో, చే గెవారా సహా 17 మంది గెరిల్లాలు మాత్రమే మిగిలారు. క్రమంగా స్థానిక ప్రజలను సమీకరించి 1958 చివరి నాటికి దేశంలోని తూర్పు మరియు మధ్య ప్రాంతాలలో అధిక భాగాన్ని కాస్ట్రో జయించగలిగారు. చే గెవారా మరియు అతని సైన్యాలు హవానా యొక్క చివరి వ్యూహాత్మక రక్షణ కేంద్రమైన శాంటా క్లారా నగరాన్ని స్వాధీనం చేసుకోగలిగారు. 1959 లో హవానా వీధుల్లోకి విప్లవ సైన్యం ప్రవేశించడంతో అమెరికా తొత్తు బాటిస్టా పలాయనం చిత్తగించారు. గెరిల్లాలు 1959 జనవరి 1 నాడు బాటిస్టా నుండి అధికారాన్ని చేజిక్కించుకున్నాయి. కాస్ట్రో హవానాకు చేరుకుని ప్రధానమంత్రిగా బాధ్యతలు స్వీకరించారు. అధికారం చేపట్టిన తర్వాత కాస్ట్రో చట్టపరమైన వివక్షను రద్దు చేయడమే కాకుండా విద్య, వైద్య తదితర రంగాలను అభివృద్ధి చేశారు. క్యూబన్ ప్రవాసులు 1961 లో కాస్ట్రోను కూలదోయాలనే ఉద్దేశ్యంతో 'బే ఆఫ్ పిగ్స్' సమీపంలో దిగగానే వారి ప్రణాళికలను కాస్ట్రో ప్రభుత్వం పటాపంచలు చేసింది. ఆ రకంగా అత్యాధునిక ఆయుధాలతో వచ్చిన అమెరికా మద్దతు దళాలను క్యూబా సైన్యం కేవలం 72 గంటల్లోనే తుత్తునియలు చేసింది. ఆ రకంగా క్యూబాను దెబ్బతీయాలని అమెరికా వేసిన 'బే ఆఫ్ పిగ్స్' ప్రణాళికా చరిత్రలోనే అతిపెద్ద పరాజయంగా మూటగట్టుకుంది. 1962 నాటి 'క్యూబన్ మిస్సైల్ క్రైసిస్' సమయంలోనూ ప్రపంచం అణుయుద్ధం అంచున నిలిచినా క్యాస్ట్రో ఏమాత్రం తలవంచకుండా ధైర్యంగా ఎదుర్కొన్నారు. ఫిడెల్ కాస్ట్రో చాకచక్యమైన సైనిక వ్యూహకర్తగా పేరు గడించారు. క్లిష్ట సమయాల్లో తన సైన్యాన్ని వెనక్కి రప్పించడం, భూభాగాన్ని ఆక్రమించుకోవడానికి చిన్న అవకాశం దొరికినా నిర్భయంగా ఎదురుదాడి చేయడం వంటి వాటిల్లో ఆయన అందెవేసిన చేయిగా ఉండేవారు. 'ప్రపంచ కష్టాలకు పెట్టుబడిదారీ విధానమే కారణం' అని కాస్ట్రో అనేక సందర్భాలలో తీవ్రమైన విమర్శలు చేయడాన్ని ప్రత్యేకంగా గమనించాలి.

కాస్ట్రో 90 ఏళ్ల వయసులో 2016 నవంబర్ 25 నాడు మరణించారు. నేడు కాస్ట్రో భౌతికంగా లేకపోయిననూ ఆయన రగిలించిన విప్లవ నిప్పురవ్వలు ప్రపంచమంతటా ప్రజ్వలిస్తూనే ఉన్నాయి. క్యూబన్ కమ్యూనిస్టుల ఆదర్శాలు చరిత్రలో సజీవంగా నిలిచి ఉంటాయి. అత్యంత ప్రభావవంతమైన కమ్యూనిస్ట్ విప్లవకారుడుగా ఫిడెల్ కాస్ట్రో ప్రజా హృదయాలలో కలకాలం వెలుగొందుతూనే ఉంటారు.

**(ఆగస్టు 13 ఫిడెల్ కాస్ట్రో శత జయంతి )**




జె.జె.సి.పి బాబూరావు
రీసెర్చ్ స్కాలర్
సెల్: 94933 19690

# జనంసాక్షి కథనానికి స్పందన

- రైల్వే అండర్ బ్రిడ్జిని శుభ్రం చేయించిన రైల్వే అధికారులు
- జనంసాక్షికి అభినందనల వెల్లువ
- సకాలంలో స్పందించిన రైల్వే అధికారులకు కృతజ్ఞతలు తెలిపిన ప్రజలు, రైతులు


దీనిని కాస్త "శుభ్రపరచండి మహాప్రభో "..!



**బోనకల్, ఆగస్టు 12 (జనం సాక్షి) :** బోనకల్ మండల కేంద్రంలో గల బోనకల్ నుండి ఆళ్లపాడు వెళ్లే రోడ్డు కు గల రైల్వే అండర్ బ్రిడ్జి బురదమయంగా మారి మురుగునీరు నిల్వ ఉండి చెత్తాచెదారం పేరుకుపోయి పలు గ్రామాల ప్రజలకు రైతులకు చాలా ఇబ్బందికరంగా ఉన్న సమస్యను గుర్తించి జనం సాక్షిలో సోమవారం "దీనిని కాస్త శుభ్రపరచండి మహాప్రభో " కథనానికి వెంటనే స్పందించిన రైల్వే అధికారులు అండర్ బ్రిడ్జి లో పేరుకుపోయిన చెత్తాచెదారం తొలగించి శుభ్రం చేయించారు. వెంటనే స్పందించిన రైల్వే అధికారులకు పలువురు కృతజ్ఞతలు తెలియజేశారు. అదే విధంగా తమ సమస్యకు పరిష్కారం లభించినందుకు జనంసాక్షి కి ప్రత్యేక అభినందనలు తెలియజేశారు.

# నెక్కొండ విజయ డైరీ వద్ద పాడి రైతుల నిరసన



**జడ్చర్ల, ఆగస్టు 12 (జనంసాక్షి) :** పాల సేకరణలో యంత్రాల సాకుతో నాణ్యతను తగ్గించి చూపిస్తూ తమ పొట్ట కొడుతున్నారంటూ మండల పరిధిలోని నెక్కొండ విజయ డైరీ ముందు బుధవారం పాడి రైతులు నిరసన వ్యక్తం చేశారు. గత కొన్ని రోజులుగా పాలలో ఎస్ఎన్ఎఫ్, ఫ్యాట్ శాతాలు సరిగ్గా రాకుండా డైరీ యాజమాన్యం నిబంధనలకు విరుద్ధంగా మెషిన్లను ఏర్పాటు చేసిందని రైతులు ఆరోపించారు. రాత్రింబవళ్లు కష్టపడి పాడి పరిశ్రమనే నమ్ముకుని జీవిస్తుంటే, నాణ్యత తక్కువగా ఉందనే నెపంతో తమకు రావాల్సిన మద్దతు ధరను తగ్గించి ఇస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విజయ డైరీ యాజమాన్యం వెంటనే స్పందించి పాల పరీక్షల యంత్రాల్లో తలెత్తిన లోపాలను నివారించాలని, ఎస్ఎన్ఎఫ్, ఫ్యాట్ శాతాలను పారదర్శకంగా కొలిచి పాలకు సరైన మద్దతు ధర చెల్లించాలని డిమాండ్ చేశారు.

# 108 అంబులెన్స్ ఆకస్మిక తనిఖీ



**అన్నపురెడ్డిపల్లి, ఆగస్టు 12 (జనం సాక్షి) :** అన్నపురెడ్డిపల్లి మండలానికి సంబంధించిన 108 అంబులెన్స్‌ను ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రోగ్రామ్ మేనేజర్ నజీరుద్దీన్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అంబులెన్స్‌లోని రికార్డులు, ఔషధాలు, వైద్య పరికరాలు, వాటి గడువు తేదీలను పరిశీలించారు. పరికరాల పనితీరును, వాహనం నిర్వహణకు సంబంధించిన పత్రాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. అత్యవసర సమయాల్లో ప్రజలకు సకాలంలో వైద్య సేవలు అందించేందుకు సిబ్బంది ప్రతిక్షణం అప్రమత్తంగా ఉండాలని నజీరుద్దీన్ సూచించారు. 108 అంబులెన్స్ సేవలను ప్రజలు అత్యవసర పరిస్థితుల్లో సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ తనిఖీలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సమన్వయకర్తలు మనోహర్, సతీష్, 108 సిబ్బంది ఈఎంటీ కళాధర్, పైలెట్ రాజా పాల్గొన్నారు.

పాల్వంచలో ఒకేరోజు రెండు చోరీలు
లబోదిబోమంటున్న పట్టణవాసులు

## ఐదు తులాల బంగారం, రూ.30 వేల నగదు అపహరణ..

- మార్కెట్ లో నాలుగు ఏసీలు చోరీ...

**కొత్తగూడెం క్రైమ్, ఆగస్టు 12 (జనం సాక్షి) :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ,పాల్వంచ పట్టణంలో ఒకేరోజు రెండు వేర్వేరు ప్రాంతాల్లో దొంగతనాలు జరిగిన ఘటన ప్రజల్లో ఒక్కసారిగా భయాందోళన రేపింది. పట్టణంలోని ఒడ్డుగూడెం ప్రాంతంలో ఓ ఇంట్లో చొరబడిన గుర్తుతెలియని దుండగులు సుమారు ఐదు తులాల బంగారు ఆభరణాలతో పాటు రూ.30 వేల నగదును ఎత్తుకెళ్లినట్లు సమాచారం. ఈ ఘటనపై బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మరోవైపు పట్టణంలోని మార్కెట్ పరిధిలో నాలుగు ఏసీ మిషన్ లు చోరీకి గురైనట్లు కేసు నమోదైంది. వాణిజ్య సముదాయం లేదా సంబంధిత ప్రాంగణంలో అమర్చిన ఏసీ యూనిట్లను రామవరంకు చెందిన నలుగురు మహిళల దొంగలు దొంగతనం చేసినట్లు సమాచారం. వారు దొంగతనం చేసిన ఏసీ యూనిట్లను ధ్వంసం చేసి పట్టణంలోని పాత ఇనుప కొట్టులలో అమ్మినట్లు సమాచారం. వాటి విలువ సుమారు రెండు లక్షలు ఉంటుందని అంచనా.. ఒకేరోజు పట్టణంలోని వేర్వేరు ప్రాంతాల్లో చోరీలు జరగడంతో స్థానికుల్లో భయాందోళన మొదలైంది. వరుస చోరీల నేపథ్యంలో రాత్రి వేళల్లో పోలీసుల గస్తీని మరింత పెంచాలని ప్రజలు కోరుతున్నారు. రెండు ఘటనలపై పోలీసులు కేసులు నమోదు చేసి, సీసీ కెమెరాల ఫుటేజీతో పాటు ఇతర ఆధారాలను పరిశీలిస్తూ నిందితుల కోసం గాలింపు చేపట్టినట్లు తెలుస్తోంది. పట్టణంలో ఎవరైనా అనుమానితులు కనబడితే వెంటనే పోలీసులకు సమాచారం అందజేయాలని ఎప్పటికప్పుడు పోలీస్ పెట్రోలింగ్ నిర్వహిస్తున్నామని పట్టణ ఎస్సై టి నాగరాజు తెలిపారు.

# పోక్సో కేసులో నిందితుడికి జీవిత ఖైదు

- ప్రాసిక్యూషన్ సహకరించిన అధికారులును అభినందించిన పోలీసు కమిషనర్

**ఖమ్మం కార్పొరేషన్, ఆగస్టు 12 (జనం సాక్షి) :** పాఠశాలకు వెళ్లిన బాలికను తన మాయ మాటలతో బయటకు తీసుకెళ్లి లైంగికదాడికి ఒడిగట్టిన నిందితుడికి జీవిత కాలం పాటు జైలు శిక్ష, యాభై ఏడు వేల రూపాయలు జరిమానాలు విధిస్తూ.. మొదటి ఫాస్ట్‌ట్రాక్ కోర్టు న్యాయమూర్తి డా. పుల్లభట్ల పోగడ కృష్ణ అర్జున్ బుధవారం తీర్పు వెల్లడించారని టూ టౌన్ ఇన్స్పెక్టర్ బాలకృష్ణ తెలిపారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. 2023 సెప్టెంబర్ 20న నిందితుడైన సూర్యాపేట జిల్లా, అంజనపురి కాలనీ చెందిన, అప్పుడు ఖమ్మం టూ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో బాలిక ఇంటి ప్రక్కనే నివాసం ఉంటున్న అల్లి రాకేష్ 22 సం,, పాఠశాలకు వెళ్లిన బాలికను మాయమాటలతో బలవంతంగా బయటకు తీసుకెళ్లి లైంగికదాడికి పాల్పడినట్లు బాలిక తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదుతో టూ టౌన్ పోలీస్ స్టేషన్ లో క్రైమ్ నెంబర్ జతీ. నం.425/2023.రాజ.చీూ .83/2023. U/S 366,376,506 IPC, సెక్షన్. పోక్సో చట్టం 2012 కింద కేసు నమోదు చేసిన అనంతరం విచారణ, సాక్ష్యాధారాల సేకరణ వేగవంతంగా పూర్తిచేసి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశామని తెలిపారు. కేసు పూర్వపరాలు, సాక్ష్యాధారాలు, వైద్య నివేదికను పరిశీలించిన న్యాయమూర్తి నిందితుడి పై మోపిన నేరం రుజువు కావడంతో పై విధంగా తీర్పు చెప్పారు.ప్రాసిక్యూషన్ తరపున అదనపు ప్రాసిక్యూటర్ జమ్ముల శరత్ కుమార్ రెడ్డి వాదించారు. అప్పటి విచారణ అధికారి ఇన్స్పెక్టర్ కుమారస్వామి, ప్రస్తుత ఇన్స్పెక్టర్ బాలకృష్ణ, భరోసా లీగల్ ఆఫీసర్ ఎం.ఉమారాణి, కోర్టు కానిస్టేబుల్ తల్లా. రమణ, కోర్టు లైజనింగ్ ఆఫీసర్ శ్రీకాంత్, హోంగార్డ్ అయూబ్,చిట్టిబాబు ను పోలీస్ కమిషనర్ సునీల్ దత్ అభినందించారు.

# రాష్ట్రంలో ఖైదీలందరిని విద్యావంతులుగా తీర్చిదిద్దుతాం

- జైల్లశాఖ డీజీ సౌమ్యమిశ్ర
- చర్లపల్లి సెంట్రల్ జైల్లో 78 మంది ఖైదీలకు పదవ తరగతి సర్టిఫికెట్లు అందజేత




**కాప్రా, ఆగస్టు 12 (జనం సాక్షి) :** తెలంగాణ రాష్ట్రంలోని జైళ్లకు వచ్చే ఖైదీలందరిని విద్యావంతులుగా, సమాజంలో ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం జైళ్లశాఖ ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని తెలంగాణ జైళ్లశాఖ డీజీ సౌమ్యమిశ్ర(ఐపిఎస్) అన్నారు. తెలంగాణ జైళ్లశాఖ అధ్వర్యంలో నేషనల్ ఇన్స్టిట్యూట్ అఫ్ ఓపెన్ స్కూలింగ్ సంస్థ సహకారంతో రాష్ట్ర వ్యాప్తంగా 78 మంది ఖైదీలు పదవ తరగతి చదువుకుని పాసయ్యారు. బుదవారం చర్లపల్లి కేంద్ర కారాగారంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాసైన 78 మంది 71 పురుష, 07 మహిళ ఖైదీలకు సర్టిఫికెట్లు అందజేశారు. ఈసందర్బంగా డీజీ సౌమ్యమిశ్ర మాట్లాడుతూ జైలుకు వచ్చే ఖైదీలు బయటకు వేల్లేప్పుడు విద్యాతో పాటు సాంకేంతిక శిక్షణ, ఉత్తమ పౌరులుగా తయారు చేసి బయటకు పంపుతున్నమని తెలిపారు. ఖైదీలు పదవ తరగతితోనే అగిపోకుండ వారి కోసం ప్రత్యేకంగా ఒకేషనల్ కోర్స్, ఐటీఐ, అంబేత్కర్ ఓపెన్ యూనివర్సిటీలో డిగ్రి, పీజీ పూర్తి చేయిస్తున్నమని తెలిపారు. పదవ తరగతి పాసైన ఖైదీలకు ప్రత్యేకంగా రిమిషన్ కల్పిస్తున్నమని తెలిపారు. పదవ తరగతితోనే అగిపోకుండ పట్టుదలతో ఉన్నత విద్యాను చదివి మంచిస్థాయిలో స్థిరపడాలని తెలిపారు. తమకు వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని వలవలేది పూర్తి చేసి ఖైదీలకు న్యాయి సలహాలు అందిస్తామని వదవ తరగతి పాసైన తెలిపారు. ఈకార్యక్రమంలో ఎన్ఐఓఎన్ మాజీ డైరెక్టర్ పరంప్రీత్ సింగ్ , రిజనల్ డైరెక్టర్ ప్రవీణచౌహన్ జైళ్లశాఖ ఐజీ వై.రాజేష్, డీఐజిలు డాక్టర్ శ్రీనివాస్, సంపత్, చర్లపల్లి, ఓపెన్ జైలు, నిజామాబాద్, మహిళ జైలు సూపరింటెండెంట్లు ప్రమోద్, భరత్, అశోకుమార్, లక్ష్మి శ్రీనాథ్, డిఎస్ వెంకటేశం, దేవా నాయక్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులే దేశానికి వెన్నెముక

- విజ్ఞాన దర్శిని ఫౌండర్ టి. రమేష్
- విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలి
- సుద్దాల అశోక్ తేజ




**ముషీరాబాద్, ఆగస్టు 12 (జనం సాక్షి) :** విద్యార్థులే దేశానికి వెన్నెముక అని, దేశ, సమాజ అభివృద్ధితో పాటు ప్రజాస్వామ్యం, శాంతి, సామాజిక విలువలను కాపాడేందుకు విద్యార్థులకు పాఠశాల స్థాయి నుంచే శాస్త్రీయ, నాణ్యమైన విద్య అందించాల్సిన అవసరం ఉందనీ విజ్ఞాన దర్శిని ఫౌండర్ టి. రమేష్ అన్నారు. ఈ మేరకు బుధవారం హైదరాబాద్ బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ బాలోత్సవం ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల్లో 7, 8, 9 తరగతుల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలను అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిలు గా విజ్ఞాన దర్శిని ఫౌండర్ టి. రమేష్, ప్రముఖ సినీ గేయ రచయిత సుద్దాల అశోక్‌తేజ లు హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా విజ్ఞాన దర్శిని రమేష్ మాట్లాడుతూ విద్యార్థుల్లో సృజనాత్మకత, శాస్త్రీయ ఆలోచనా విధానాన్ని పెంపొందించాల్సిన సమయంలో మూఢనమ్మకాలను ప్రోత్సహించే విధంగా విద్యా విధానాలు రూపొందించడం సమాజ అభివృద్ధికి ఆటంకంగా మారుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థులు మాదకద్రవ్యాలు, అవినీతి, అక్రమాలకు దూరంగా ఉండి దేశ నిర్మాణంలో భాగస్వాములు కావాలని సూచించారు. నిరుద్యోగ సమస్యను పరిష్కరించేందుకు యువతకు నాణ్యమైన విద్య, ఉపాధి అవకాశాలు కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందన్నారు. ప్రముఖ సినీ గేయ రచయిత సుద్దాల అశోక్‌తేజ మాట్లాడుతూ విద్యార్థుల ప్రతిభను గుర్తించి ప్రోత్సహించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. చదువుతో పాటు సృజనాత్మకతను పెంపొందించుకున్న విద్యార్థుల కళ్లలో ఆత్మవిశ్వాసం కనిపిస్తుందని, అదే వారి నిజమైన అందమని అన్నారు. విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని ఆకాంక్షించారు. తెలంగాణ బాలోత్సవం అధ్యక్షుడు భూపతి వెంకటేశ్వర్లు, కార్యదర్శి ఎన్.ఎం. సోమయ్య, కమిటీ సభ్యురాలు రూపా రుక్మిణి మాట్లాడుతూ 7, 8, 9 తరగతుల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులు పదో తరగతిలో మరింత మెరుగైన ఫలితాలు సాధించాలని సూచించారు. విద్యార్థుల ప్రతిభ, కృషి దేశ భవిష్యత్తుకు, మంచి సమాజ నిర్మాణానికి దోహదపడుతుందని అన్నారు. ఎం. మమత (చిల్డ్రన్స్ సైకాలజిస్ట్, మోటివేటర్) అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పి. బ్రహ్మణి, ఎన్. మారయ్య, మహేష్ దుర్గే, సైదులు, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు కలిపి సుమారు 450 మంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా వివిధ పాఠశాలల విద్యార్థులు దేశభక్తి, ప్రగతిశీల గేయాలకు నృత్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నారు.

## ఉద్యోగ ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలి

- తపస్ వికారాబాద్ జిల్లా గౌరవ అధ్యక్షులు బాకారం మల్లయ్య
- ముమ్మరంగా సభ్యత్వ నమోదు కార్యక్రమం




**బొంరాస్ పేట, ఆగస్టు 12 (జనం సాక్షి) :** మండల పరిధిలోని ఏర్పుమళ్ళ,నాందార్ పూర్, చౌదర్పల్లి, రాంనాయక్ తాండ, రేగడి మైలారం,ఎన్కేపల్లి, బోట్లవాని తండా,గ్రామాలలోని ప్రభుత్వ పాఠశాలలో తపస్ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో బుధవారం ముమ్మరంగా సభ్యత్వ నమోదు కార్యక్రమం మండల అధ్యక్షులు బాకారం చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ముమ్మరంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన జిల్లా గౌరవ అధ్యక్షులు బాకారం మల్లయ్య మాట్లాడుతూ ప్రభుత్వం 51% పిఆర్సి అమలు చేయాలని, పెండింగ్ లో ఉన్న ఆరు డీఏలను వెంటనే ప్రకటించాలని, 317 జీవో బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కేజీబీవీ, ఆశ్రమ పాఠశాలలో ఉపాధ్యాయులకు ఐచ్ఛిక సెలవులు ,ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. పెండింగ్లో ఉన్న సిపిఎస్ రద్దుచేసి ఓపిఎస్ విధానాన్ని అమలు చేయాలని ప్రభుత్వ అన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి మహేష్, ఆదర్శ్, జిల్లా మహిళా కార్యదర్శి శ్రీ ప్రియ, ఉపాధ్యక్షులు ప్రశాంత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## పేకాట స్థావరంపై టాస్క్‌ఫోర్స్ దాడి

- 8 మంది అరెస్ట్ రూ.82,770 నగదు, పేక ముక్కలు స్వాధీనం



**తాండూరు, అగస్టు 12 (జనంసాక్షి) :** వికారాబాద్ జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా, ఆదేశాల మేరకు జిల్లా టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ అన్వర్ పాషా ఆధ్వర్యంలో టాస్క్‌ఫోర్స్ బృందం నమ్మదగిన సమాచారం మేరకు కరణ్ కోట్ పోలీస్ స్టేషన్ పరిధిలోని నారాయణపూర్ గ్రామ శివారులో పేకాట స్థావరంపై దాడి నిర్వహించారు.టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ అన్వర్ పాషా మాట్లాడుతూ జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు నమ్మదగిన సమాచారం మేరకు నారాయణపూర్ గ్రామ శివారులో పేకాట నిర్వహిస్తున్న స్థావరంపై దాడి నిర్వహించాం. ఈ దాడిలో 8 మందిని అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుంచి రూ.82,770 నగదు మరియు పేక ముక్కలను స్వాధీనం చేసుకున్నాం. పట్టుబడిన వారిని తదుపరి చట్టపరమైన చర్యల నిమిత్తం కరణ్‌కోట్ పోలీస్ స్టేషన్‌కు అప్పగించామని తెలిపారు. జిల్లాలో పేకాట, జూదం మరియు ఇతర చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడే వారిపై నిరంతరం నిఘా కొనసాగుతుందని, చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని టాస్క్ ఫోర్స్ ఇన్స్పెక్టర్ అన్వర్ పాషా హెచ్చరించారు.పేకాటకు పాల్పడిన వారిపై కరణ్‌కోట్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి తదుపరి చట్టపరమైన చర్యలు చేపడుతున్నారు.పేకాట స్థావరంపై సమర్థవంతంగా దాడి నిర్వహించి 8 మందిని అదుపులోకి తీసుకుని నగదు, పేక ముక్కలను స్వాధీనం చేసుకున్న టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ అన్వర్ పాషా మరియు బృంద సభ్యులను జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా, అభినందించారు.

## ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు వజ్రాయుధం

- రేగడి మైలారం పాఠశాలలో మాక్ పోలింగ్ నిర్వహణ



**బొంరాస్‌పేట, ఆగస్టు 12 (జనం సాక్షి) :** ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు వజ్రాయుధం లాంటిదని దానిని సక్రమంగా ఉపయోగించుకుంటే రేపటి సమాజం బాగుపడుతుందని రేగడి మైలారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులకు సూచించారు. బుధవారం పాఠశాలలో మాక్ పోలింగ్ నిర్వహించగా విద్యార్థులు వరుస క్రమంలో వచ్చి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ప్రజాస్వామ్య విధానంలో ఎన్నికలు చాలా ముఖ్యమైనవని ప్రజలు ఏ విధంగా ప్రజాప్రతినిధులను ఎన్నుకుంటారు వారి యొక్క విధులు బాధ్యతలు ఎన్నికల నిర్వహణ ఓటర్ విధులు బాధ్యతల గురించి విద్యార్థులకు వివరంగా వివరించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రతన్ రాజ్, ఉపాధ్యాయులు శ్యామలయ్య, సుభాష్ చంద్రబోస్, సుధా, రఘు, ముఖ్య అతిథులు తపస్ జిల్లా గౌరవ అధ్యక్షులు బాకారం మల్లయ్య, మండలాధ్యక్షులు బాకారం చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

## తైక్వాండోతో ఆత్మ రక్షణ పెంపొందుతుంది



**తాండూరు, అగస్టు 12 (జనంసాక్షి) :** విద్యార్థినులు చదువుతో పాటు తైక్వాండో క్రీడను ఆలవర్చుకోవాలని మాస్టర్ మనోహర్ వేల్లడించారు. బుధవారం తాండూరు పట్టణం ఖంజపూర్ సమీపంలో తెలంగాణ రెసిడెన్సీయల్ స్కూల్ లో తైక్వాండో శిక్షణలో భాగంగా నుంచాక్ శిక్షణ బాలికలకి శిక్షణ ఇచ్చారు.బాలికలకు కఠోరంగా మెలకువలు, నైపుణ్యాలను నేర్పుతూన్నారు. ఈ సందర్భంగా మాస్టర్ మనోహర్ మాట్లాడుతూ నుంచాక్ నేర్చుకోవడం వల్ల బాలికలు సెల్ఫ్ డిఫెన్స్ చేసుకుంటూ ఎదుటి వారిని నుంచాక్ తో మట్టి కరిపించవచ్చున్నారు. ఈ క్రీడతో ఫిట్‌నెస్ తో పాటు మానసిక బలం కూడా అవసరం అన్నారు. చాలా మంది క్రీడాకారులు తైక్వాండోను శిక్షణగా తీసుకుంటున్నారని పేర్కొన్నారు. తైక్వాండో తో శరీరంలో వేగం, చురుకు దనం, బ్యాలెన్స్ పెరుగుతాయని వివరించారు.ప్రతీ ఒక్కరూ చదువుతో పాటు తైక్వాండోను నేర్చుకో వాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ ప్రవీణ రెడ్డి, పిఈటి అఖిల కోచ్ లు కుశల్, ప్రశాంత్ కుమార్, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

# రెండు ఎకరాల్లో ఆరు రకాల పంటలు

- రైతు వెంకట్ రెడ్డిని ప్రత్యేకంగా అభినందించిన జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్
- సేంద్రియ పద్ధతిలో సాగు చేస్తున్న డ్రాగన్ తోట పరిశీలన
- అంతర్గత పంటలతో అధిక లాభాలు



**హుజూర్‌నగర్, ఆగస్టు 12 (జనంసాక్షి) :** రైతు పంట వేసి నష్టపోకుండా విభిన్న రకాల పంటలు సాగు చేస్తూ లాభాలు గడిస్తున్న రైతును జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ ప్రత్యేకంగా అభినందించారు. బుధవారం రైతు పాశం వెంకటరెడ్డి పొలాన్ని కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా పొలంలో సాగు చేస్తున్న పంటల వివరాలను, అనుసరిస్తున్న పద్ధతులను కలెక్టర్ స్వయంగా అడిగి తెలుసుకున్నారు. వెంకటరెడ్డి తనకున్న రెండు ఎకరాల భూమిలో ఒకే రకం పంటపై ఆధారపడకుండా బీర, మిర్చి, బంతి, బెండ, సొర, దోస వంటి ఆరు రకాల పంటలను సాగు చేస్తున్నట్లు తెలిపారు. ఎకరానికి తగ్గట్లుగా విభిన్న సాగు పంట దిగుబడి, మార్కెటింగ్ వివరాలను రైతు కలెక్టర్‌కు వివరించారు. 30 గుంటల్లో వేసిన మిర్చి పంట ద్వారా దాదాపు 10 టన్నులు, బీర ద్వారా 4 టన్నులు, బంతి పూల ద్వారా టన్నున్నర నుంచి 2 టన్నులు, అలాగే బెండ, దోస సాగు ద్వారా మరో టన్ను వరకు దిగుబడి వచ్చే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఒకే పంట వేసి నష్టపోయే కంటే, ఇలా విభిన్న పంటలు వేయడం ద్వారా నిరంతరం ఆదాయం పొందవచ్చని వెల్లడించారు. రైతు ఆదర్శవంతమైన సాగు పద్ధతులను కలెక్టర్ అభినందించారు. అదేవిధంగా శ్రీనివాస్ పురం గ్రామానికి చెందిన పారుపల్లి శ్రీనివాసరావు (శ్రీ శ్రీ) సంపూర్ణ సేంద్రియ పద్ధతిలో సాగు చేస్తున్న ఐదు ఎకరాల డ్రాగన్ తోటను కూడా పరిశీలించారు. రైతుతో మాట్లాడి పంట దిగుబడి అంతర్గత పంటల గురించి తెలుసుకున్నారు. అంతర్గత పంటలు వేయడం ద్వారా అధిక లాభాలను పొందవచ్చని కలెక్టర్ రైతుకు సూచించారు. దీంతోపాటు గట్ల వెంట వివిధ రకాల చెట్లను నాటి వాటి ద్వారా ఆదాయాన్ని పెంపొందించుకోవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో శ్రీనివాసులు, ఏడి ఏ రవి, ఎంఏఓ స్వర్ణ, తహసిల్దార్ కవిత, మున్సిపల్ కమిషనర్ సతీష్ కుమార్, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యలపై పోరాటమే సీపీఐ లక్ష్యం

**బాలానగర్, ఆగస్టు 12 (జనం సాక్షి) :** భారత కమ్యూనిస్టు పార్టీ జాతీయ సమితి పిలుపులో భాగంగా నిర్వహిస్తున్న "బద్లావ్ జరూరి హై - మార్పు కావాలి" జన చైతన్య యాత్ర బుధవారం నాడు నవాబు పేట మండలానికి చేరుకుంది. ఈ సందర్భంగా సిపిఐ మహబూబ్ నగర్ జిల్లా కార్యదర్శి కామ్రేడ్ దీ. బాలకిషన్ మాట్లాడుతూ ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతున్న కమ్యూనిస్టు పార్టీకి ప్రజల మద్దతు మరింత పెరుగుతుందని అన్నారు. కామ్రేడ్ బాలకిషన్ మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ప్రజా, రైతు, కార్మిక వ్యతిరేక విధానాలను వెంటనే మానుకోవాలని డిమాండ్ చేశారు. ధరల దోపిడీ: నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్ని తాకుతున్నాయి. గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలు సామాన్యుడి నడ్డి విరుస్తున్నాయి. కానీ ప్రజల ఆదాయం మాత్రం పెరగడం లేదు. నిరుద్యోగ మోసం: ఎన్నికలలో ఇచ్చిన హామీ ప్రకారం 2 కోట్ల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి యువతను మాయ చేశారు. 30 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు ఖాళీగా ఉన్నా భర్తీ చేయడం లేదు. అగ్నిపథ్ పేరుతో 4 ఏళ్ల కాంట్రాక్ట్ విధానం తెచ్చారు. రైతు వ్యతిరేకత మీరా కి చట్టబద్ధత ఇవ్వడం లేదు. గిట్టుబాటు ధర లేక రైతులు ఆత్మహత్యలు




చేసుకుంటున్నారు. రైతు ఉద్యమంలో 750 మంది రైతులు అమరులైనా కేంద్రం పట్టించుకోలేదు. ప్రభుత్వ రంగ అమ్మకం, రైల్వే, దీూజూ, బ్యాంకులు, విద్యుత్, బొగ్గు గనులను కార్పొరేట్లకు కట్టబెడుతున్నారు. దేశ సంపదను అదానీ, అంబానీలకు దోచిపెడుతున్నారు. కార్మిక, విద్యా వ్యతిరేకత 4 లేబర్ కోడ్ లతో కార్మిక హక్కులను హరిస్తున్నారు. చీజూ ద్వారా విద్యను కార్పొరేట్లకు అప్పజెబుతున్నారు. రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్అదేవిధంగా రాష్ట్ర ప్రభుత్వాన్ని ఉద్దేశించి కామ్రేడ్ బాలకిషన్ మాట్లాడుతూ ఇచ్చిన 6 గ్యారంటీలను పూర్తిగా అమలు చేయాలి. అర్హులైన ప్రతి పేదవాడికి ఇందిరమ్మ ఇండ్లు, పెన్షన్లు, ఇంటి స్థలాలు వెంటనే ఇవ్వాలి. ఫీజు రీయింబర్స్‌మెంట్, ఆరోగ్యశ్రీ బకాయిలు విడుదల చేయాలి. లక్షల ప్రభుత్వ ఉద్యోగాలను ఖాజ, గ్రూప్స్ ద్వారా వెంటనే భర్తీ చేయాలి. ప్రజా సమస్యల పరిష్కారానికై అన్ని ప్రజాస్వామ్య, ప్రగతిశీల శక్తులు ఐక్యంగా ఉద్యమించాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రతి గ్రామంలో ప్రజా సమస్యలపై పోరాటాలు చేయాలని, అర్హులందరికీ డబల్ బెడ్ రూమ్ ఇళ్లు వచ్చేంతవరకు సిపిఐ పోరాటం ఆగదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ బాల్ నగర్ మండల కార్యదర్శి అల్వాల్ రెడ్డి, గోవర్ధన్, రాము, జిల్లా కౌన్సిల్ సభ్యులు బి. మహేష్ బాబు సత్యనారాయణ రెడ్డి, ఎం ఆంజనేయులు, జంగయ్య, భార్గవి, చీఖీ×ఔ పట్టణ కార్యదర్శి ఇందిరా, మహిళా నాయకురాలు అంజమ్మ, శ్రీలత, గుండ్ల పొట్ల పల్లీ శాఖ కార్యదర్శి కే బాలయ్య, బాల్ నరసయ్య, నాయకులు బసవరాజ్, మండల నాయకులు గాలి గూడెం గ్రామ కార్యదర్శి బాలయ్య, గుడు భాష కార్యకర్తలు, ప్రజాసంఘాల ప్రతినిధులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## న్యాయవాదిపై దాడికి నిరసనగా మక్తల్ కోర్టులో లాయర్ల విధుల బహిష్కరణ



**మక్తల్, ఆగస్టు 12 (జనంసాక్షి) :** నాగర్ కర్నూల్ బార్ అసోసియేషన్ న్యాయవాది ఎం. వేణుగోపాల్ రావు పై దాడికి నిరసనగా మక్తల్ కోర్టులో బుధవారం లాయర్లు విధులను బహిష్కరించారు. ఈ సందర్భంగా సీనియర్ అడ్వకేట్ తిమ్మన్న మాట్లాడుతూ లాయర్లపై వరుసగా దాడులు జరుగుతున్నాయని, పెంట్లవెల్లిలో న్యాయవాది హత్య , తాజాగా మరో న్యాయవాది పై దాడి...వరుస ఘటనలు జరగడం కలచివేస్తోందని, దాడులు చేసే వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. లాయర్లకు రక్షణగా మరింతగా పటిష్ట చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని సూచించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ లాయర్లు ఆడెం శ్రీనివాసులు, దత్తాత్రేయ, బండారి శ్రీనివాసులు, పసుల నీరజ్, రంకుల ఆనంద్, సూర్య ప్రకాష్, వెంకటేష్ గౌడ్, సురేందర్ ఆచారి, సతీశ కుమారి, తదితరులు పాల్గొన్నారు.

## సీఎం సభకు పటిష్ట ఏర్పాట్లు

**సంగారెడ్డి, ఆగస్టు 12 (జనం సాక్షి) :** సంగారెడ్డి లో ఈ నెల 15న రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించనున్న నేపథ్యంలో, ముఖ్యమంత్రి పాల్గొనే బహిరంగ సభకు పటిష్టమైన ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. సీఎం పర్యటన నేపథ్యంలో బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, అడిషనల్ ఎస్పీ చైతన్య రెడ్డి, అడిషనల్ కలెక్టర్లు సంగీత, పాండు, పౌరసరఫరాల శాఖ డైరెక్టర్ శ్యామ్ ప్రసాద్ లాల్ తో కలిసి కలెక్టర్ ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. సీఎం పర్యటన రూట్ మ్యాప్, భద్రతా ఏర్పాట్లు, హెలిప్యాడ్, సభా వేదిక, పార్కింగ్, ట్రాఫిక్ నియంత్రణ తదితర అంశాలపై అధికారులతో చర్చించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, సీఎం పర్యటనను విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ముఖ్యమంత్రి పర్యటనలో ఎలాంటి అసౌకర్యం కలగకుండా ముందస్తు ప్రణాళికతో అన్ని ఏర్పాట్లను పూర్తి చేయాలన్నారు. హెలిప్యాడ్ నుంచి సీఎం ప్రయాణించే మార్గం, సభా వేదిక, ప్రజల రాకపోకలు, వాహనాల పార్కింగ్, రహదారులు, విద్యుత్, తాగునీరు, పారిశుద్ధ్యం తదితర ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టాలని ఆదేశించారు. స్థానిక అంబేద్కర్ స్టేడియంలో నిర్వహించనున్న బహిరంగ సభకు పెద్ద సంఖ్యలో ప్రజలు, ప్రజా ప్రతినిధులు హాజరయ్యే అవకాశం ఉన్నందున, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు.



సంబంధిత అధికారులు తమకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తిస్తూ, ఏర్పాట్లను నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ పటిష్టమైన భద్రతా ప్రణాళికను అమలు చేయాలని పోలీసు అధికారులను ఆదేశించారు. హెలిప్యాడ్, సీఎం రూట్, సభా ప్రాంగణం, పార్కింగ్ ప్రాంతాలు, ట్రాఫిక్ నియంత్రణ తదితర ప్రాంతాల్లో భద్రతా చర్యలను సమన్వయంతో చేపట్టాలని సూచించారు.

అనంతరం జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, ఎస్పీ పరితోష్ పంకజ్, అడిషనల్ ఎస్పీ చైతన్య రెడ్డితో కలిసి ప్రతిపాదిత హెలిప్యాడ్, సభా వేదిక, వాహనాల పార్కింగ్ ప్రాంతాలు, రాకపోకల మార్గాలు, భద్రతా ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఆయా ప్రాంతాల్లో చేపట్టాల్సిన ఏర్పాట్లపై సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సమీక్ష సమావేశంలో జిల్లా అధికారులు, రెవెన్యూ డివిజనల్ అధికారులు, పోలీసు అధికారులు, ఇతర శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## నేరాల దర్యాప్తులో వేగం పెంచాలి

- లాంగ్ పెండింగ్ కేసులపై ప్రత్యేక దృష్టి
- విజిబుల్ పోలీసింగ్‌ను మరింత పెంచాలి
- డ్రంక్ డ్రైవ్‌పై ప్రతిరోజు తనిఖీలు నిర్వహించాలి
- 'నేను సైతం'తో సీసీ కెమెరాల ఏర్పాటుకు కృషి చేయాలి
- ఉత్తమ ప్రతిభ కనబరిచిన సిబ్బందికి ప్రశంస పత్రాలు బ్లూకోల్ట్స్, నైట్ పెట్రోలింగ్ పకడ్బందీగా నిర్వహించాలి
- జిల్లా ఎస్పీడి.వి శ్రీనివాస రావు

మెదక్ బ్యూరో, ఆగస్టు 12 (జనం సాక్షి) : జిల్లాలో నేరాల నియంత్రణకు పటిష్ఠ చర్యలు చేపట్టడంతో పాటు కేసుల దర్యాప్తును వేగవంతం చేయాలని జిల్లా ఎస్పీ. డి. వి. శ్రీనివాస రావు అధికారులను ఆదేశించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన నెలవారీ నేర సమీక్షా సమావేశంలో వివిధ పోలీస్ స్టేషన్ల పరిధిలో దర్యాప్తులో ఉన్న పోక్సో, గ్రేవ్, నాన్ గ్రేవ్, ఎస్సీ/ఎస్టీ అట్రాసిటీ కేసుల పురోగతిని సమీక్షించారు. ప్రతి కేసును నిర్ణీత గడువులోగా దర్యాప్తు పూర్తిచేసి చార్జిషీట్లు దాఖలు చేయాలన్నారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న కేసుల పరిష్కారానికి ప్రత్యేక కార్యాచరణ రూపొందించుకోవాలని సూచించారు. గ్రేవ్ కేసుల్లో శాస్త్రీయ ఆధారాలను సేకరించి, నిందితులకు శిక్షపడేలా నాణ్యమైన దర్యాప్తు చేపట్టాలని ఆదేశించారు. ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో విజిబుల్ పోలీసింగ్‌ను పెంచాలని, నేరాల నియంత్రణకు బ్లూకోల్ట్స్, నైట్ పెట్రోలింగ్‌ను పకడ్బందీగా నిర్వహించాలని



సూచించారు. 'నేను సైతం' కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేస్తున్న సీసీ కెమెరాలను జియోట్యాగింగ్ చేయాలని తెలిపారు. రోడ్డు భద్రతలో భాగంగా ప్రతిరోజూ డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేపట్టాలని, ఓవర్‌లోడ్ వాహనాలపై కూడా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పోలీస్ స్టేషన్లకు వచ్చే ఫిర్యాదుదారుల పట్ల సానుభూతితో వ్యవహరించి, వారి సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని ఎస్పీ సూచించారు. సీసీటియన్ఎస్, ఈ-సాక్ష్య, అప్లికేషన్లలో కేసులకు సంబంధించిన వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన పోలీస్ సిబ్బందికి జిల్లా ఎస్పీ ప్రశంసా పత్రాలు అందజేసి అభినందించారు. ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించేలా అంకితభావంతో పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్, డియస్పి లు ప్రసన్న కుమార్, నరేందర్ గౌడ్, సుభాష్ చంద్ర బోస్, సీఐ లు మహేష్, రేణుక, వెంకట రాజా గౌడ్, సైదా, సందీప్ రెడ్డి, కృష్ణ మూర్తి, రంగా కృష్ణ, ఎసై లు సిబ్బంది పాల్గొన్నారు.

## పీఆర్సీ వెంటనే అమలు చేయాలి

- పెండింగ్‌లో ఉన్న 6 విడతల కరువు భత్యాన్ని చెల్లించాలి
- హెల్త్ కార్డులను అమలు చేయాలి
- సిపిఎస్ రద్దు చేసి ఒ పి ఎస్ ను అమలు చేయాలి
- ఉద్యోగుల అన్ని రకాల బిల్లులను వెంటనే విడుదల చేయాలి
- జిఓ నంబర్ 25ను సవరించాలి
- ప్రభుత్వ పాఠశాలల్లో నియామకాలు వెంటనే చేపట్టాలి

**మెదక్, ఆగస్టు 12 (జనం సాక్షి) :** ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ ఆధ్వర్యంలో దశల వారి పోరాట కార్యక్రమంలో భాగంగా బుధవారం మెదక్ మండల తహసిల్దార్ కార్యాలయంలో తహసిల్దార్ ద్వారా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా టిపిటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటరామ్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే పిఆర్సి నివేదికను తెప్పించుకొని 51% ఫిట్మెంట్ తో కూడిన వేతన సవరణను అమలు చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా పెండింగ్లో ఉన్నటువంటి ఆరు విడుతల కరువు కరువు బత్యాన్ని వెంటనే విడుదల చేయాలని, ఉద్యోగ ఉపాధ్యాయుల నుండి గత మూడు నెలలుగా వేతనంలో నుంచి చికిత్సల కొరకు 1.5% శాతం మినహాయింపులు జరుపుతున్నప్పటికీ నేటికీ ఏ ఆసుపత్రి కూడా ఉచిత వైద్యం అందించడం లేదని వాపోయారు. ప్రభుత్వం తమ కార్యక్రమాలలో ఆరంభశూరత్వం తప్ప అమలు చేయడంలో



పూర్తిగా విఫలమైందని వారు ఆరోపించారు. ఉద్యోగ ఉపాధ్యాయ జేఏసీకి హామీ ఇచ్చిన మేరకు ఆగస్టు 15 నాడైనా పిఆర్సి నివేదికను చెప్పించుకుని అమలు చేయాలని పెండింగ్లో ఉన్నటువంటి విడుదల చేయాలని గతంలో ఇచ్చిన హామీ మేరకు సిపిఎస్ ను రద్దుచేసి ఓపిఎస్ ను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. పక్క రాష్ట్రమైనటువంటి ఆంధ్రప్రదేశ్లో 2003 డిఎస్సి ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానాన్ని అమలు చేస్తూ ఉత్తర్వులు ఇవ్వడం జరిగిందని తెలంగాణలో కూడా వెంటనే 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానాన్ని వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. ప్రజా ప్రభుత్వం అని చెప్పుకుంటున్న ఈ ప్రభుత్వం ప్రజల్లో భాగమైనటువంటి ఉద్యోగ, ఉపాధ్యాయుల శ్రేయస్సు పట్ల నిర్లక్ష్య వైఖరిని విడనాడాలని కోరారు. ప్రభుత్వ విద్యకు గొడ్డలి పెట్టగా మారిన జి ఓ 25 ను సవరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టిపిటిఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు యాదగిరి రాష్ట్ర కౌన్సిలర్ సంగీత మెదక్ మండల అధ్యక్షుడు నాగరాజు టీఎస్ యుటిఎఫ్ మెదక్ మండల ప్రధాన కార్యదర్శి ప్రేమ్ కుమార్ , జిల్లా కార్యదర్శి పోచయ్య పాల్గొన్నారు.

## రాజీవ్ గాంధీ ఆశయ సాధనకు కాంగ్రెస్ నిరంతరం కృషి

- డిసిసి అధ్యక్షుడు ప్రశాంత్ కుమార్ రెడ్డి
- మక్తల్‌లో రాజీవ్ జ్యోతి సద్భావన యాత్ర కు ఘన స్వాగతం



**మక్తల్, ఆగస్టు 12 (జనంసాక్షి) :** భారతదేశ మాజీ ప్రధాని, స్వర్గీయ రాజీవ్ గాంధీ ఆశయాల సాధనకు కాంగ్రెస్ పార్టీ నిరంతరం కృషి చేస్తుందని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు ప్రశాంత్ కుమార్ రెడ్డి తెలిపారు. తమిళనాడులో యాత్ర వ్యవస్థాపకులు దురై స్వామి ప్రారంభించిన రాజీవ్ జ్యోతి సద్భావన యాత్ర కర్ణాటక మీదుగా తెలంగాణ సరిహద్దు టైరోడ్‌కు చేరుకోగా, ప్రశాంత్ కుమార్ రెడ్డి రాజీవ్ జ్యోతిని స్వీకరించి ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఈ యాత్ర కృష్ణ మండలం, మాగనూరు మీదుగా మక్తల్ పట్టణంలోని అంబేద్కర్ చౌక్‌కు చేరుకుంది. ఈ సందర్భంగా స్థానిక కాంగ్రెస్ శ్రేణులు పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించి, రాజీవ్ జ్యోతికి అపూర్వ స్వాగతం పలికారు. ఈ క్రమంలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ తమిళనాడులో ప్రారంభమైన ఈ రాజీవ్ జ్యోతి సద్భావన యాత్ర వివిధ రాష్ట్రాల మీదుగా నారాయణపేట నుంచి ఢిల్లీకి చేరుకుంటుందని తెలిపారు. పేద ప్రజల సంక్షేమం కోసం రాజీవ్ గాంధీ ఎన్నో విప్లవాత్మక ఆవిష్కరణలు తీసుకొచ్చారని, సాంకేతిక పరిజ్ఞానంలో భారత దేశాన్ని ప్రపంచ దేశాల సరసన నిలిపిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. భారత్‌ను ప్రపంచంలోనే నంబర్ వన్ దేశంగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ఆనాడే సంస్కరణలకు శ్రీకారం చుట్టారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మక్తల్ మున్సిపల్ చైర్మన్ మానస హనుమంతు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బి. గణేష్ కుమార్, మాజీ ఉపసర్పంచ్ కట్టా సురేష్ కుమార్ గుప్తా, మండల కాంగ్రెస్ అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్, టౌన్ కాంగ్రెస్ అధ్యక్షులు ఏ. రవికుమార్, జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షులు శ్రీనివాసులు, వివిధ గ్రామాల సర్పంచులు, మున్సిపల్ కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, యూత్ కాంగ్రెస్, విద్యార్థి విభాగం నాయకులు, కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

## నేరాల నియంత్రణలో సీసీ కెమెరాల పాత్ర కీలకం



**నంగునూరు, ఆగస్టు 12 (జనం సాక్షి) :** నేరాల నియంత్రణలో సీసీ కెమెరాల పాత్ర కీలకమని, ప్రతి గ్రామంలో సిసి కెమెరాలు ఏర్పాటుకు ముందుకు రావాలని రాజగోపాల్పేట ఎస్సై టీ. వివేక్ అన్నారు. మండల పరిధిలోని తిమ్మాయిపల్లి మధిర గ్రామం భాషాయి గూడెంలో సురక్ష నేత్ర కార్యక్రమంలో బుధవారం రోజు దాత బెజగం రవీంద్ర ప్రసాద్ సహకారంతో ఏర్పాటుచేసిన 7 సీసీ కెమెరాలను గ్రామ సర్పంచ్ చేర్యాల రాజు తో కలిసి ప్రారంభించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ కలకుంట్ల యాదగిరి, మాజీ ఎంపిటిసి కలకుంట్ల నర్సింలు, బి ఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు జంగిటి స్వామి, గ్రామస్తులు గోవింద్ భాస్కర్, కనకయ్య్య, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## విద్యార్థులు నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలి



**శివ్వంపేట, ఆగస్ట్ 12 (జనంసాక్షి) :** విద్యార్థులు చదువుతోపాటు క్రమశిక్షణతో కూడిన నాయకత్వ లక్షణాలను అలవర్చుకోవాలని పాఠశాల హెచ్ఎం సురేష్, పాఠశాల ఇన్చార్జి శ్రీ హర్ష లు పేర్కొన్నారు. మండల పరిధిలోని పెద్దగొట్టిముక్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం విద్యార్థులకు పాఠశాల స్థాయిలో ఎన్నికలు నిర్వహించారు. ఇందులో కొందరు పిల్లలు అధ్యక్ష, ఉపాధ్యక్ష పదవికి పోటీ పడగా, విద్యార్థులు క్యూలైన్ లో వెళ్లి తమకు నచ్చిన వ్యక్తులకు ఓట్లు వేసి పాఠశాల అధ్యక్షుడిగా, అలాగే పాఠశాల ఉపాధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. ఎన్నికలు జరిగాక, బ్యాలెట్ బాక్స్ విప్పి ఓట్లు లెక్కించగా పాఠశాల అధ్యక్షుడిగా సుచిత్ గౌడ్ గెలుపొందాడు, అలాగే ఉపాధ్యక్షుడిగా వివేక్ గెలుపొందాడు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఉపాధ్యాయులు మాట్లాడుతూ నేటి తరం విద్యార్థులకు ఎన్నికల పట్ల అవగాహన కల్పించేలా పాఠశాల ప్రెసిడెంట్, వైస్ ప్రెసిడెంట్ పదవులకు నేరుగా విద్యార్థులతో ఎన్నికలు నిర్వహించడం జరిగిందన్నారు .ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు శ్రీహర్ష, శ్రీనివాస్, సమీ,రాజు, భారతి విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే చింత ప్రభాకర్‌పై విమర్శలు చేస్తే సహించేది లేదు

- మాట్లాడేటప్పుడు మన స్థాయికి తగ్గట్టు మాట్లాడాలి
- బిఆర్ఎస్ నేతలు కాంగ్రెస్ నాయకులపై ఫైర్

**సంగారెడ్డి, ఆగస్టు 12 (జనం సాక్షి) :** సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్‌పై కాంగ్రెస్ నాయకులు చేసిన వ్యాఖ్యలకు బీఆర్ఎస్ నాయకులు తీవ్రంగా స్పందించారు. కాంగ్రెస్ నేతలు అతిఉత్సాహంతో, స్థాయికి మించి మాట్లాడుతున్నారని విమర్శించారు. బుధవారం సంగారెడ్డి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ నేతలకు ఘాటైన కౌంటర్ ఇచ్చారు. అభివృద్ధి అంటే గుర్తొచ్చే పేరు చింత ప్రభాకర్ అని సంగారెడ్డి నియోజకవర్గ అభివృద్ధికి మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్ రావు సహకారంతో ఎమ్మెల్యే చింత ప్రభాకర్ విశేష కృషి చేశారని బీఆర్ఎస్ నేతలు పేర్కొన్నారు. సంగారెడ్డి పట్టణంలో సుమారు రూ.822 కోట్లతో, సదాశివపేట పట్టణంలో సుమారు రూ.264 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. అభివృద్ధి పనులపై ఎవరికైనా సందేహాలు ఉంటే సంగారెడ్డి, సదాశివపేటలో ఆధారాలతో బహిరంగ చర్చకు తాము సిద్ధంగా ఉన్నామనిలి, కాంగ్రెస్ నేతలు కూడా చర్చకు రావాలని సవాల్ విసిరారు. వ్యక్తిగత విమర్శలు కాకుండా అభివృద్ధి అంశాలపై మాట్లాడితే తాము సమాధానం చెప్పేందుకు సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. తన ఆరోగ్యాన్ని సైతం లెక్కచేయకుండా కరోనా సమయంలో ప్రజల మధ్య ఉంటూలి,




ప్రజలకు అందుబాటులో ఉన్న నాయకుడు చింత ప్రభాకర్. మా నాయకుడిని విమర్శించే ముందు మీ స్థాయి ఏంటో తెలుసుకుని మాట్లాడండి. మేము కూడా మీకంటే ఎక్కువగా మాట్లాడగలం. కానీ వ్యక్తిగతంగా దూషించడం మా నాయకుడు మాకు నేర్పలేదు. పద్ధతిగా, గౌరవంగా మాట్లాడాలని ఆయన సూచించారులి" అని బీఆర్ఎస్ నేతలు అన్నారు. ఎమ్మెల్యేగా ఓడిపోయిన సమయంలోనూ చింత ప్రభాకర్ ప్రజలకు దూరంగా ఉండలేదని, కలెక్టరేట్ ఎదుట క్యాంపు కార్యాలయం ఏర్పాటు చేసుకుని ప్రజలకు సేవలు అందించారని గుర్తు చేశారు. "లిమీ నాయకుడు ఐబీని గాంధీభవన్‌గా మార్చుకున్నారు. అభివృద్ధిపై మాట్లాడండి.. మేము కూడా సమాధానం చెప్పేందుకు సిద్ధంగా ఉన్నాం, అని అన్నారు. అలాగే సంగారెడ్డికి సంబంధించిన అభివృద్ధి ప్రాజెక్టుల విషయంలో కాంగ్రెస్ నేతలు వాస్తవాలను ప్రజలకు వివరించాలని డిమాండ్ చేశారు. ఐఐటీ హైదరాబాద్‌ను జగ్గారెడ్డి తీసుకొచ్చారని చెబుతున్నప్పుడు, దానికి 'ఐఐటీ సంగారెడ్డి' అనే పేరు ఎందుకు పెట్టలేదో ప్రజలకు సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. రాజీవ్ పార్క్ అభివృద్ధి విషయంలో కూడా గతంలో హామీలు ఇచ్చి, ప్రభుత్వాలు మారినా పూర్తి స్థాయిలో అభివృద్ధి చేయలేకపోయారని విమర్శించారు. మా నాయకుడిపై వ్యక్తిగత విమర్శలు చేయడం మానుకుని సంగారెడ్డి అభివృద్ధిపై దృష్టి పెట్టండి. మీ గత చరిత్ర, మీ పాలనపై కూడా మా దగ్గర పూర్తి సమాచారం ఉందిలి. అవసరమైతే ఆధారాలతో మాట్లాడతాం. విమర్శలు చేసే ముందు ఒకటికి రెండుసార్లు ఆలోచించండిలి" అని బీఆర్ఎస్ నేతలు హెచ్చరించారు. తెలంగాణ ఉద్యమం, తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఎవరు ఏ సమయంలో ఏ విధంగా మాట్లాడారో ప్రజలకు తెలుసని, ముందుగా 'జై తెలంగాణ' నినాదం విషయంలో తమ వైఖరిని స్పష్టం చేయాలని కాంగ్రెస్ నేతలకు సూచించారు. చివరగా, "అధికారం ఎవరికీ శాశ్వతం కాదు. పదవులు వస్తుంటాయి.. పోతుంటాయి. కానీ ప్రజల కోసం చేసిన అభివృద్ధి పనులు, ప్రజలతో ఉన్న అనుబంధమే శాశ్వతం వ్యక్తిగత విమర్శలు కాకుండా అభివృద్ధిపై చర్చకు రండి.. సంగారెడ్డి అభివృద్ధిపై ఎక్కడైనా, ఎప్పుడైనా చర్చకు మేము సిద్ధం" అని బీఆర్ఎస్ నేతలు స్పష్టం చేశారు. మీడియా సమావేశంలో ఎస్కే రషీద్, అక్బర్ హుస్సేన్, కసిని శ్రీకాంత్ , మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ శ్రీధర్ రెడ్డి, లతీఫ్, జాఫర్, అజ్జు, మజీద్, విష్ణు, నజీం, ఖలీమ్ పటేల్, సమద్, ఖమీల్, కుద్దుష్, వహాబ్, వాజిద్, చింటూ, శ్రవణ్ రెడ్డి , అఖిల్, తదితరులు పాల్గొన్నారు.

# పేద గిరిజనుల అభ్యున్నతికి ప్రత్యేక చర్యలు



- కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ కె.హరిత

**కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి, ఆగస్టు 12(జనంసాక్షి) :** జిల్లాలోని అర్హులైన పేద గిరిజనులకు ఆర్థికంగా తోడ్పాటు అందించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. బుధవారం జిల్లాలోని లింగాపూర్ మండలం చోర్ పల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన తెలంగాణ సమ్మిళిత జీవనోపాదుల కార్యక్రమంలో భాగంగా భాగస్వామ్య కుటుంబాలకు ఉత్పాదకత యూనిట్ల పంపిణీ, ప్రధానమంత్రి కృషి సించాయి యువజన లో భాగంగా స్వయం సహాయక సంఘాల అనుసంధానంతో ఊటకుంటలలో చేప పిల్లల విడుదల కార్యక్రమానికి ప్రత్యేక కమిషనర్ శ్రీలక్ష్మి, జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) యువరాజ్ మర్మాట్, ఆసిఫాబాద్ నియోజకవర్గ శాసనసభ్యులు కోవ లక్ష్మి, జైనూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ కుడ్మెత విశ్వనాథ్ లతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ తెలంగాణ సమ్మిళిత జీవనోపాదుల కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని తిర్యాణి, లింగాపూర్ మండలాలలోని ఎంపిక చేసిన గ్రామాలలో ఆర్థికంగా వెనుకబడిన గిరిజనులకు పించన్ల పంపిణీ, గేదెలు, మేకలను పెంచడం ద్వారా జీవనోపాధి కల్పించుట, పిండి గిర్నీల ఏర్పాటు ద్వారా ఆర్థికంగా ఎదిగి పేదరికం నుండి బయటకు వచ్చేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. అనంతరం ప్రధానమంత్రి కృషి సించాయి యోజనలో భాగంగా మహిళా సంఘాల అనుసంధానంతో ఊట కుంటలలో చేప పిల్లలను వదిలారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మహిళా సంఘాలను బలోపేతం చేసే దిశగా ప్రభుత్వం అనేక కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్లు, విద్యార్థుల ఏకరూప దుస్తుల తయారీ, పెట్రోల్ బంకుల నిర్వహణ, సోలార్ ప్లాంట్ల ఏర్పాటు, ఆర్.టి.సి. బస్సుల నిర్వహణ ద్వారా మహిళా సంఘాలు ఆర్థికంగా ఎదిగేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. పంట కుంటలు, ఊట కుంటలు, ఇంకుడు గుంతల నిర్మాణంలో స్వయం సహాయక సంఘాల మహిళలను భాగస్వామ్యం చేయడం జరుగుతుందని తెలిపారు. అంతకుముందు వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు. ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా మొక్కలు నాటి సంరక్షించాలని, భావితరాలకు సమతుల్య వాతావరణం అందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి దత్తారావు, స్వయం సహాయక సంఘాల మహిళలు, సర్పంచ్ లు, ప్రజలు సిబ్బంది, పాల్గొన్నారు.

# ఆగస్టు 13 నుంచి యాప్ ద్వారానే ఎరువుల బుకింగ్

- రైతులు ముందస్తుగా నమోదు చేసుకోవాలి: రాజేశ్వర్ రెడ్డి

**దిలావర్‌పూర్, ఆగస్ట్ 12, (జనం సాక్షి):** రైతులకు ఎరువుల పంపిణీని మరింత పారదర్శకంగా, క్రమబద్ధంగా నిర్వహించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన డిజిటల్ విధానం ఈ నెల 13 నుంచి అమల్లోకి రానుందని మండల వ్యవసాయ అధికారి రాజేశ్వర్ రెడ్డి తెలిపారు. ఇకపై రైతులు అవసరమైన ఎరువులను ముందుగానే యాప్‌లో నమోదు చేసుకుని బుక్ చేసుకోవాల్సి ఉంటుందని చెప్పారు. రైతులు తమ స్మార్ట్‌ఫోన్‌లో సంబంధిత యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని రైతు గుర్తింపు సంఖ్య (ఫార్మర్ ఐడీ) లేదా ఆధార్‌తో నమోదు పూర్తి చేయాలని సూచించారు. ఆధార్‌కు అనుసంధానమైన మొబైల్‌కు వచ్చే ఓటీపీ ద్వారా వివరాలను ధృవీకరించుకోవాల్సి ఉంటుందని తెలిపారు. భూమి వివరాలు కనిపించని రైతులు యాప్‌లోని భూమి నమోదు సదుపాయాన్ని ఉపయోగించి వివరాలను చేర్చుకోవచ్చన్నారు. భూమి నమోదు అనంతరం సాగు చేసే పంట వివరాలు నమోదు చేసి, అవసరమైన ఎరువులను ఎంపిక చేసుకోవాలని తెలిపారు. దరఖాస్తు సమర్పించిన తర్వాత ప్రత్యేక క్యూ ఆర్ కోడ్, టోకెన్ సంఖ్య జారీ అవుతాయని, వాటి ఆధారంగా రైతులు లేదా వారు అధీకరించిన వ్యక్తులు ఎరువులను పొందవచ్చని వివరించారు. రైతులు చివరి నిమిషం వరకు వేచి ఉండకుండా ముందుగానే యాప్‌లో నమోదు ప్రక్రియ పూర్తి చేసుకోవాలని రాజేశ్వర్ రెడ్డి తెలియజేశారు. నమోదు సమయంలో ఏవైనా సమస్యలు ఎదురైతే గ్రామ వ్యవసాయ విస్తరణ అధికారి (ఏఈఓ) లేదా సమీప ఎరువుల విక్రయ కేంద్రాన్ని సంప్రదించాలని సూచించారు.


# ముఖ్యమంత్రి పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి



- వనదేవతల దర్శనానికి ప్రణాళికబద్ధంగా అన్ని ఏర్పాట్లు చేయాలి
- జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు

**ఎస్ ఎస్ తాడ్వాయి, ఆగష్టు 12(జనంసాక్షి) :** రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి 16వ తేదీన మేడారం సమ్మక్క సారలమ్మ ఆలయ సందర్శన, గిరిజన సంస్కృతి సాంప్రదాయాల నడుమ ముఖ్యమంత్రి వనదేవతల దర్శనానికి ప్రణాళిక బద్ధంగా అన్ని పనులను సన్నద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం తాడ్వాయి మండలం మేడారం సమ్మక్క సారలమ్మ వనదేవతల ప్రాంగణంలో చేపడుతున్న ఏర్పాట్లను, హెలి ప్యాడ్, కమాండ్ కంట్రోల్ రూమ్ లను జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు, జిల్లా ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకన్, ఐటీడీఏ పీవో లెనిన్ వత్సల్ టోప్పో లతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ముఖ్యమంత్రి పర్యటనలో భాగంగా తొలుత మేడారం చేరుకుని శ్రీ సమ్మక్క-సారలమ్మ వనదేవతలను దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకోనున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి రాక సందర్భంగా హెలిప్యాడ్ వద్ద చేపట్టాల్సిన ఏర్పాట్లు, భద్రత, వాహనాల రాకపోకలు తదితర అంశాలపై అధికారులకు పలు సూచనలు చేశారు. సమ్మక్క-సారలమ్మ వనదేవతల ఆలయ ప్రాంగణంలో కలియ తిరుగుతూ కొనసాగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. పనుల పురోగతిపై గుత్తేదారుతో వివరాలను అడిగి తెలుసుకున్నారు. నిర్మాణ, అభివృద్ధి పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని, పనులు పూర్తయిన వెంటనే మిగిలిపోయిన గ్రానైట్ రాళ్లు, నిర్మాణ వ్యర్థాలను తొలగించి ఆలయ పరిసరాలను పరిశుభ్రంగా తీర్చిదిద్దాలని సంబంధిత గుత్తేదారునకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ సీహెచ్ మహేందర్ జి, ఆర్డీవో కృష్ణవేణి, డీఎస్పీ రవీందర్, ఆలయ ఈవో వీరస్వామి, ఆర్ అండ్ బీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్యామ్ సింగ్, గుత్తేదారులు ఆదినారాయణ, తాడ్వాయి తహసిల్దార్ సురేష్ బాబు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# రోగులకు మెరుగైన వైద్యం అందించాలి



- జిల్లా కలెక్టర్ డా. సత్య శారద
- ఎంజీఎం హాస్పిటల్ సందర్శించిన కలెక్టర్

**వరంగల్ బ్యూరో, ఆగస్టు 12 (జనం సాక్షి) :** జిల్లా కలెక్టర్ డా. సత్య శారద బుధవారం ఎంజీఎం ఆస్పత్రిని సందర్శించి ఆస్పత్రిలోని కంప్లైంట్ బాక్స్‌ను పరిశీలించారు. అనంతరం వివిధ వార్డులను సందర్శించి రోగులతో నేరుగా మాట్లాడి వైద్యం అందుతున్న తీరుపై వారి అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు.రోగులకు అందుతున్న వైద్య సేవలు, సమస్యలపై వివరాలను తెలుసుకున్న కలెక్టర్ సంబంధిత అధికారులకు అవసరమైన సూచనలు చేశారు. ఆస్పత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం ఎంజీఎం డైట్ సెంటర్‌ను సందర్శించి అక్కడి పరిసరాలను పరిశీలించారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని రోగులకు అందించే డైట్ సెంటర్, పరిసర ప్రాంతాల్లో పరిశుభ్రత, పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, తగిన ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సంబంధిత ఇన్‌చార్జిలను ఆదేశించారు. ఈ సందర్శనలో ఎంజీఎం సూపరిండెంట్ డాక్టర్ రామ్ కుమార్,డాక్టర్ అశ్విన్ తదితరులు జిల్లా కలెక్టర్ వెంట ఉన్నారు.

# పరకాల సీఎం పర్యటనకు పటిష్ట ఏర్పాట్లు చేయాలి



- పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి
- రెండు జిల్లాల ఉన్నతాధికారులతో సమీక్ష

**హనుమకొండ ప్రతినిధి, ఆగస్టు 12 (జనం సాక్షి) :** ఈ నెల 16న పరకాల పట్టణానికి రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రానున్న నేపథ్యంలో ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా పటిష్టమైన ఏర్పాట్లు చేపట్టాలని పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. బుధవారం హనుమకొండ కలెక్టరేట్ కార్యాలయంలో హనుమకొండ, వరంగల్ జిల్లాల కలెక్టర్లు చాహత్ బాజ్‌పాయ్, డాక్టర్ సత్యశారదలతో కలిసి రెండు జిల్లాల ఉన్నతాధికారులతో సీఎం పర్యటన ఏర్పాట్లపై ఎమ్మెల్యే సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించి చేపట్టాల్సిన ఏర్పాట్లు, శాఖల వారీగా చేపడుతున్న పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించిన వేదిక ఏర్పాటు, సభా ప్రాంగణం, పార్కింగ్, ట్రాఫిక్ నియంత్రణ, ప్రజలు, ప్రజాప్రతినిధుల రాకపోకలు, బారికేడింగ్, తాగునీటి సౌకర్యం, పారిశుధ్యం, విద్యుత్ సరఫరా, వైద్య సేవలు, అగ్నిమాపక ఏర్పాట్లు, భద్రతా చర్యలు, హెలిప్యాడ్, తదితర అంశాలపై సమగ్రంగా చర్చించారు.సభా ప్రాంగణంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలను ముందుగానే ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే సూచించారు. భారీ సంఖ్యలో ప్రజలు హాజరయ్యే అవకాశం ఉన్నందున పార్కింగ్ ప్రాంతాలను ముందుగా గుర్తించి, ట్రాఫిక్ నిర్వహణకు ప్రత్యేక ప్రణాళిక రూపొందించాలని అధికారులను ఆదేశించారు. వాహనాల రాకపోకలకు అంతరాయం కలగకుండా ప్రత్యామ్నాయ మార్గాలు, పార్కింగ్ ప్రదేశాలను సిద్ధం చేయాలని సూచించారు.సీఎం పర్యటనకు సంబంధించిన అన్ని ఏర్పాట్లను నిర్దేశిత గడువులోగా పూర్తి చేసి, చివరి నిమిషంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు తనిఖీలు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ప్రతి శాఖకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ, పరస్పర సమన్వయంతో పనిచేయాలని సూచించారు.ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేయడంలో అధికార యంత్రాంగం సమష్టిగా కృషి చేయాలని, ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా ఉండాలని ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి స్పష్టం చేశారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు రవి, గణేష్, ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ శేషాద్రి, జిల్లా రెవెన్యూ అధికారి శ్రీనివాస్, హనుమకొండ, వరంగల్ జిల్లాల డీఆర్‌డీవోలు, జెడ్పీ సీఈవోలు, పోలీస్, ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్, మున్సిపల్, వైద్య ఆరోగ్య, విద్యుత్, అగ్నిమాపక, ట్రాన్స్‌పోర్ట్, ఇతర సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# లోన్ ఇప్పిస్తామని గిరిజనుడిని మోసం చేసిన సైబర్ నేరగాళ్లు



**కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి, ఆగస్టు 12(జనంసాక్షి ):** అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని సైబర్ నేరగాళ్లు మోసాలకు పాల్పడుతున్నారు. లోన్ ఇప్పిస్తామని నమ్మించి గిరిజనుడి నుంచి వేల రూపాయలు కాజేసిన ఘటన కొమరం భీమ్ జిల్లా తిర్యాణి మండలం మంగి గీసిగూడ గ్రామంలో చోటుచేసుకుంది. తిర్యాణి మండలం మంగి గీసిగూడ గ్రామానికి చెందిన ఆత్రం గంగును సైబర్ నేరగాళ్లు ఫోన్ చేసి రూ.5 లక్షల లోన్ మంజూరైందని, డాక్యుమెంటేషన్ పూర్తయిందని నమ్మించారు. లోన్ ఇవ్వాలంటే ముందుగా ఇన్సూరెన్స్ డబ్బులు కట్టాలని నమ్మబలికారు. ఆలా మొదట రూ.7,500, తర్వాత రూ.16,000, మూడోసారి రూ.10,600 చెల్లించాలని చెప్పి బాధితుడి నుంచి మొత్తం రూ.34,100 వసూలు చేశారు. చివరికి లోన్ రాకపోగా, సైబర్ నేరగాళ్లు ఫోన్లు స్విచ్ ఆఫ్ చేయడంతో గంగు మోసపోయినట్లు గుర్తించాడు. లోన్ వస్తుందనే ఆశతో డబ్బులు చెల్లించి ఇప్పుడు ఆందోళనకు గురయ్యాడు. రోజురోజుకూ ఇలాంటి సైబర్ మోసాలు పెరుగుతున్నాయి. గుర్తు తెలియని నంబర్ల నుంచి వచ్చే కాల్స్, మెసేజ్‌లను నమ్మవద్దు. లోన్, బహుమతి పేరుతో ముందుగా డబ్బులు అడిగితే వెంటనే అనుమానించాలి. ఎట్టి పరిస్థితుల్లోనూ ఓటిపి, బ్యాంక్ వివరాలు, ఆధార్ నంబర్ వంటి వ్యక్తిగత సమాచారాన్ని ఇతరులకు చెప్పవద్దు. అనుమానం వస్తే వెంటనే పోలీసులకు లేదా సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ 1930 కు ఫిర్యాదు చేయాలి. అమాయక ప్రజలను లక్ష్యంగా చేసుకుని మోసాలకు పాల్పడుతున్న సైబర్ నేరగాళ్లపై కఠిన చర్యలు తీసుకోవాలని బాధితుడు కోరుతున్నాడు.

# ఎరువుల కొరత రాకుండా పకడ్బందీ చర్యలు



- జిల్లా కలెక్టర్ రాజర్షి షా
- బ్లాక్ మార్కెటింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరిక

**గుడిహత్నూర్ ఆగస్టు 12,(జనం సాక్షి) :** జిల్లాలో రైతులకు ఎరువుల కొరత తలెత్తకుండా పకడ్బందీ చర్యలు చేపడుతున్నామని జిల్లా కలెక్టర్ రాజర్షి షా తెలిపారు. వర్షాకాల సాగు నేపథ్యంలో బుధవారం గుడిహత్నూర్ మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్) పరిధిలోని యూరియా గోదామును, యూరియా బుకింగ్ ప్రక్రియను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గోదాములో అందుబాటులో ఉన్న యూరియా నిల్వలు, స్టాక్ రిజిస్టర్లు, పంపిణీ వివరాలను కలెక్టర్ స్వయంగా పరిశీలించారు. అనంతరం ప్రభుత్వం ప్రవేశపెట్టిన యూరియా బుకింగ్ యాప్ ద్వారా రైతుల నమోదులు, బుకింగ్ విధానం, పంపిణీ ప్రక్రియను క్షేత్రస్థాయిలో పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. బుకింగ్ ప్రక్రియలో రైతులకు ఎలాంటి సాంకేతిక ఇబ్బందులు తలెత్తకుండా వెంటనే పరిష్కరించాలని, యాప్ సమర్థవంతంగా పనిచేసేలా నిరంతరం పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు. జిల్లా వ్యాప్తంగా రైతుల అవసరాలకు అనుగుణంగా సరిపడా ఎరువుల నిల్వలు అందుబాటులో ఉన్నాయని, రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రభుత్వం అమలు చేస్తున్న డిజిటల్ బుకింగ్ విధానం ద్వారా ఎరువుల పంపిణీ పూర్తిస్థాయి పారదర్శకతతో జరుగుతోందని, తద్వారా బ్లాక్ మార్కెటింగ్, అక్రమ నిల్వలు, అక్రమ విక్రయాలకు పూర్తిగా అడ్డుకట్ట వేయవచ్చని పేర్కొన్నారు. ఎరువులను నిర్ణీత గరిష్ఠ చిల్లర ధర (ఎంఆర్‌పీ)కే విక్రయించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. అధిక ధరలకు విక్రయించడం, అక్రమంగా నిల్వ చేయడం, పక్కదారి పట్టించడం వంటి చర్యలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రైతులు తమకు అవసరమైన మేరకే ఎరువులను కొనుగోలు చేయాలని, ఒకేసారి అధిక మొత్తంలో నిల్వ చేసుకోవద్దని సూచించారు. సహకార సంఘాల ద్వారా ప్రతి రైతుకు సకాలంలో యూరియా అందేలా వ్యవసాయ శాఖ అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. రైతులకు ఎరువుల సరఫరాలో ఎలాంటి అంతరాయం కలగకుండా జిల్లా యంత్రాంగం అన్ని చర్యలు చేపడుతోందని కలెక్టర్ తెలిపారు. ఈ పరిశీలనలో పీఏసీఎస్ సిబ్బంది పూర్ణచందర్, రైతులు తదితరులు పాల్గొన్నారు.




# ఐదు రోజుల పని దినాలు బ్యాంకింగ్ అమలు చేయాలి

- ఆదిలాబాద్ లో బ్యాంక్ ఉద్యోగుల ధర్నా

**ఆదిలాబాద్ టౌన్, ఆగస్ట్ 13 (జనంసాక్షి) :** బ్యాంకింగ్ రంగంలో ఐదు రోజుల పని విధానాన్ని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంక్ యూనియన్స్ ఆధ్వర్యంలో బ్యాంక్ ఉద్యోగులు ఆదిలాబాద్ లోని దస్నాపూర్ యూనియన్ బ్యాంక్ ముందు మాస్ డెమాన్స్ట్రేషన్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐబీఈఏ, ఏఐబీఓసీ తదితర యూనియన్లకు చెందిన ఉద్యోగులు నినాదాలు చేస్తూ నిరసన తెలిపారు. కేంద్ర ప్రభుత్వం, ఐబీఏ మధ్య ఒప్పందం జరిగినా 5 డే బ్యాంకింగ్ అమలు చేయడంలో జాప్యం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్ బి ఐ, ఎల్ ఐ సి లలో ఇప్పటికే 5 రోజుల పని విధానం ఉందని, బ్యాంకుల్లో కూడా వెంటనే అమలు చేయాలని కోరారు. డిమాండ్ నెరవేర్చకపోతే ఆందోళనను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని వివిధ బ్యాంకుల ఉద్యోగులు పాల్గొన్నారు.

# వార్త కవరేజ్ కోసం వెళ్లిన విలేకరిపై ధమనకాండ

**పెద్దవంగర, ఆగస్టు 12 (జనం సాక్షి) :** వార్త కవరేజ్ కోసం వెళ్లిన విలేకరీపై జరిగిన ధమనకాండను సహించేది లేదని పెద్దవంగర ప్రెస్ క్లబ్ సభ్యులు ఖండించారు. మంగళవారం మండలంలోని వడ్డేకొత్తపల్లి గ్రామంలో రాత్రి సమయంలో గ్రామస్తుల సమాచారం మేరకు కాంగ్రెస్ పార్టీ రెండు గ్రూపు వర్గపూరులో బోనాల పండుగ సందర్భంగా ఏర్పాటు చేసిన ఒక వర్గం ఫ్లెక్సీని మరొక వర్గం చించివేశారని గ్రామస్తుల సమాచారం మేరకు గ్రామ బస్టాండ్ వద్దకు వెళ్లి ఫోటో తీస్తున్న సూర్య న్యూస్ రిపోర్టర్ కుమ్మరి రామ్మూర్తి పై అమానుషంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు కేశబోయిన సుభాష్ చంద్ర రాజు, బొల్లు ఉషయ్య, దంతాలపల్లి రవి, బండారి వెంకన్న లు దాడి చేయడం జరిగిందని మీడియాపై దుర్భాషలాడుతూ విలేకరి యొక్క ఫోను లాక్కొని చంపుతామంటూ బెదిరించి వెళ్లిపోయారు. దాంతో సదరు విలేకరు పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే స్పందించిన పోలీసులు హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకొని సెల్ ఫోను ఇప్పించడం జరిగింది. మీడియాను దూషిస్తూ, విలేకరుల హక్కులకు భంగం కలిగించి సంఘటనను తీవ్రంగా ఖండిస్తున్నామని ఇది మీడియా లోకాన్నీ కించపరచడమేనని,సదరు వ్యక్తులపై చట్టరీత్యా చర్యలు తీసుకోగలరని సంబంధిత అధికారులకు తెలియజేశారు.

# రైతులు సమగ్ర వ్యవసాయ విధానాలపై దృష్టి



- జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా
- సమీకృత వ్యవసాయ విధానాలతో రైతులకు స్థిరమైన ఆదాయం అందేలా చూడాలి
- రైతుల వ్యవసాయ క్షేత్రాలను పరిశీలించిన కలెక్టర్

**స్టేషన్ ఘన్‌పూర్, ఆగస్టు 12 (జనంసాక్షి) :** రైతులు సమగ్ర వ్యవసాయ విధానాలపై దృష్టి సారించాలని, సమీకృత వ్యవసాయ విధానాలతో రైతులకు స్థిరమైన ఆదాయం అందేల చూడాలని, ఆధునిక సాగు పద్ధతులను రైతులకు చేరువ చేయాలని, డ్రిప్, మల్చింగ్ విధానాలతో నీటి వినియోగాన్ని తగ్గించాలని పంటల్లో కలుపు నివారణ, పురుగుల నియంత్రణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అన్నారు. స్టేషన్ ఘనపూర్ పట్టణ కేంద్రంలోని వ్యవసాయ పొలం వద్ద రైతు ఊరడి లింగయ్య సాగు చేస్తున్న రైతు వ్యవసాయ క్షేత్రాన్ని బుదవా రం జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా సందర్శిం చారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రైతులు సమీకృత సాగు విధానాలను అవలంబి స్తూ, తక్కువ నీటితో అధిక దిగుబడులు, మెరుగై న ఆదాయంపొందేలా వ్యవసాయ శాఖ అధికారు లు అవసరమైన సాంకేతిక సహకారం అందించా లని సూచించారు.సుమారు 8 ఎకరాల విస్తీర్ణంలో వివిధ రకాల పంటలను సాగుచేస్తున్న విధానాన్ని పరిశీలించి, రైతుతో పంటల సాగు, నీటి వినియో గం, దిగుబడులు, మార్కెటింగ్, తదితర అంశాల పై వివరాలను అడిగి తెలుసుకున్నారు. రైతు గతంలో వరి సాగు చేసినప్పటికీ, ప్రస్తుతం పంట ల వైవిధ్యీకరణలో భాగంగా టమోటా, చిక్కుడు, బంతి, బెండకాయ వంటి కూరగాయలు, పూల పంటలను సాగు చేస్తున్నట్లు కలెక్టర్ కు వివరించా రు. ఒకే పంటపై ఆధారపడకుండా వివిధ పంటల ను సాగు చేయడం ద్వారా రైతుకు నిరంతర ఆదా య వనరులు లభించే అవకాశం ఉంటుందని కలెక్టర్ పేర్కొన్నారు.పంటల సాగులో మల్చింగ్ విధానాన్ని విస్తృతంగా వినియోగించాలని సూచిం చారు.మల్చింగ్ ద్వారా నేలలో తేమనునిలుపుకో వడంతో పాటు కలుపు మొక్కల పెరుగుదలను నియంత్రించవచ్చని, తద్వారా నీటి వినియోగాన్ని తగ్గించి, పంటల పెరుగుదలకు అనుకూల పరిస్థి తులు కల్పించవచ్చని తెలిపారు. పంటలను పురుగులు, పేను బంక, పచ్చ దోమ, తెగుళ్ల నుంచి రక్షించేందుకు అవసరమైన సమయంలో వేపనూనె వంటి సేంద్రియ ఆధారిత పద్ధతులను వినియోగించాలని సూచించారు. పంటల్లో కలుపు మొక్కలు పెరగకుండా క్రమం తప్పకుండా కలుపు తొలగింపు చేపట్టాలని, పురుగులు, తెగుళ్లను ప్రారంభ దశలోనే గుర్తించి, తగిన నివారణ చర్యలు తీసుకోవాలని వ్యవసాయ అధికారులకు సూచించారు. బుధవారం, స్టేషన్ ఘన్పూర్ మున్సిపాలిటీ పరిధిలోని ఛాగల్ గ్రామంలో రైతు చిక్కుల్ల రమేష్ పొలంతో పాటు వ్యవసాయ క్షేత్రాలను జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా పరిశీలించి రైతులతో మాట్లాడారు. రైతు ఊరడి లింగయ్య పొలంలో ఆధునిక సాగు పద్ధతులను ప్రదర్శించేలా డెమో ప్లాట్‌ను ఏర్పా టు చేయించాలని కలెక్టర్ వ్యవసాయ అధికారుల ను ఆదేశించారు. రైతులు సంప్రదాయ పంటలతో పాటు మార్కెట్ డిమాండ్ ఉన్న కూరగాయలు, పండ్లు,పూలు,తదితర ప్రత్యామ్నాయ పంటలను సాగు చేసి ఆదాయ వనరులను విస్తరించుకోవాల ని సూచించారు.రైతులు సంప్రదాయ పంటలతో పాటు మార్కెటింగ్‌కు అనుకూలంగా ఉండే ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలని సూచించారు. ముఖ్యంగా ఆయిల్ పామ్ సాగు ద్వారా దీర్ఘకాలికంగా ఆదాయం పొందే అవకాశా లను రైతులకు వివరించాలని వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో డీఏఓ అంబికా సోనీ, డీఆర్డీఓ భాస్కర్, కేవీకే శాస్త్రవేత్త రమ్య, ఏడిఏ అపర్ణ, ఏవో కర్ణాకర్, ఉద్యానవన శాఖ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ తదుపరి దశకు సన్నద్ధం కావాలి

- ఆగస్టు 17న ముసాయిదా ఓటరు జాబితా..
- అక్టోబర్ 19న తుది జాబితా
- నోటీసులు అందుకున్న ఓటర్లు ఆధారాలు సమర్పించాలి
- కలెక్టర్ దివాకర టీఎస్

**ఉమ్మడి ఖమ్మం జిల్లా బ్యూరో, ఆగస్టు 12 (జనం సాక్షి) :** స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ప్రక్రియలో ఖమ్మం జిల్లాలో తొలి దశను విజయవంతంగా పూర్తి చేశామని జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ తెలిపారు. తదుపరి దశకు ప్రజలు, అధికారులు సన్నద్ధం కావాలని కోరారు. బుధవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఎస్ఐఆర్ ప్రక్రియ పురోగతి, తదుపరి కార్యాచరణను వివరించారు. ఆగస్టు 17న ముసాయిదా ఓటరు జాబితాను ప్రచురిస్తామని, అదే రోజు నుంచి సెప్టెంబర్ 16 వరకు క్లెయిమ్స్, అభ్యంతరాలు స్వీకరిస్తామని తెలిపారు. ఆగస్టు 17 నుంచి అక్టోబర్ 15 వరకు వాటిని పరిష్కరించి, అక్టోబర్ 19న తుది ఓటరు జాబితాను ప్రచురించనున్నట్లు వెల్లడించారు.

### 10.85 లక్షల ఫారాల డిజిటలైజేషన్

జిల్లాలో 10,85,927 ఎన్యూమరేషన్ ఫారాలు, అంటే 87.31 శాతం డిజిటలైజేషన్ పూర్తయిందని కలెక్టర్ తెలిపారు. సేకరించిన ఫారాల్లో 43,131 మంది మ్యాపింగ్ కాలేదని, వారికి నిబంధనల ప్రకారం నోటీసులు జారీ చేస్తామని చెప్పారు. నోటీసులు అందుకున్న ఓటర్లు ఎన్నికల సంఘం సూచించిన 11 రకాల ధృవపత్రాల్లో నిబంధనలకు అనుగుణంగా ఏదైనా ఒకదాన్ని సమర్పించాల్సి ఉంటుందన్నారు.



### 1.32 లక్షల అనామలీస్ గుర్తింపు

జిల్లాలో 1,32,736 అనామలీస్ గుర్తించామని, ఇది మొత్తం ఫారాల్లో 10.67 శాతమని కలెక్టర్ వివరించారు. పేర్ల స్పెల్లింగ్‌లో తేడాలు, కుటుంబ సభ్యుల వయస్సుల మధ్య వ్యత్యాసాలు తదితర కారణాలతో వీటిని గుర్తించామని తెలిపారు. క్షేత్రస్థాయిలో విచారణ అనంతరం వాస్తవాలను నిర్ధారించి అవసరమైన సవరణలు చేపడతామన్నారు.

### ఫారాలు సమర్పించని వారికి మరో అవకాశం

జిల్లాలో 1,57,854 మంది ఎన్యూమరేషన్ ఫారాలను తిరిగి సమర్పించలేదని తెలిపారు. క్షేత్రస్థాయి పరిశీలనలో 33,380 మంది మరణించిన వారు, 11,004 మంది డబుల్ ఓటర్లు, సుమారు 1.01 లక్షల మంది శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు తరలివెళ్లినట్లు గుర్తించామని చెప్పారు. వివిధ కారణాలతో ఫారాలు సమర్పించలేకపోయిన అర్హులైన ఓటర్లకు ఆగస్టు 17 నుంచి సెప్టెంబర్ 16 వరకు మరో అవకాశం ఉంటుందని తెలిపారు. కొత్తగా ఓటరుగా నమోదు కావాలనుకునే అర్హులు ఫారం-6 ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

### నోటీసులు అందుకున్న వారు ఆధారాలు ఇవ్వాలి

గత ఎస్ఐఆర్ ఓటరు జాబితా వివరాలు అందుబాటులో లేకపోవడం లేదా డేటాబేస్‌లోని వివరాలతో సరిపోలకపోవడం వంటి సందర్భాల్లో ఈఆర్ఓలు నోటీసులు జారీ చేస్తారని కలెక్టర్ తెలిపారు. నోటీసులు అందుకున్న వారు పుట్టిన తేదీ, పుట్టిన ప్రదేశాన్ని నిర్ధారించే ఆధారాలను ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం సమర్పించాల్సి ఉంటుందన్నారు. జనన తేదీ ఆధారంగా అవసరమైన ధృవపత్రాలను సమర్పించాల్సి ఉంటుందని, 1987 జూలై 1కు ముందు జన్మించిన వారు తమకు సంబంధించిన ధృవపత్రాల్లో ఏదైనా ఒకదాన్ని, 1987 జూలై 1 నుంచి 2004 డిసెంబర్ 2 మధ్య జన్మించిన వారు తమ పత్రాలతో పాటు తల్లిదండ్రుల్లో ఒకరి ధృవపత్రాన్ని, 2004 డిసెంబర్ 2 తర్వాత జన్మించిన వారు తమ పత్రాలతో పాటు తల్లిదండ్రులిద్దరి ధృవపత్రాలను సమర్పించాల్సి ఉంటుందని వివరించారు. క్లెయిమ్స్, అభ్యంతరాలపై ఈఆర్ఓలు విచారణ జరిపి నిబంధనల ప్రకారం నిర్ణయం తీసుకుంటారని, నిర్ణయంపై అక్టోబర్ 15 వరకు అప్పీల్ చేసుకునే అవకాశం ఉంటుందని కలెక్టర్ తెలిపారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో ఉండేలా, మరణించిన, శాశ్వతంగా తరలివెళ్లిన, డబుల్ నమోదైన ఓటర్ల వివరాలను నిబంధనల ప్రకారం పరిశీలిస్తున్నామని స్పష్టం చేశారు. ఎస్ఐఆర్ ప్రక్రియపై ప్రజలకు వాస్తవ సమాచారాన్ని అందించడంలో మీడియా సహకరించాలని కోరారు.

## అదుపుతప్పి కారు బోల్తా..

- తృటిలో తప్పిన పెను ప్రమాదం
- ముత్తిరెడ్డిగూడెం - కొండాపురం మధ్య మూలమలుపు వద్ద ఘటన
- అద్దాలు ధ్వంసం.. సురక్షితంగా బయటపడిన ప్రయాణికులు
- సూచిక బోర్డులు లేకపోవడం వల్లే ప్రమాదాలంటున్న స్థానికులు

**మోటకొండూరు, ఆగస్టు 12 (జనం సాక్షి) :** యాదాద్రి భువనగిరి జిల్లా మోటకొండూరు మండల పరిధిలో తృటిలో పెను ప్రమాదం తప్పింది. మండలంలోని ముత్తిరెడ్డిగూడెం, కొండాపురం గ్రామాల మధ్య ఉన్న ప్రధాన రహదారి మూలమలుపు వద్ద బుధవారం ఓ కారు అదుపుతప్పి బోల్తా పడింది. రాయగిరి వైపు నుంచి ఆత్మకూరు వైపుకు వేగంగా వస్తున్న సమయంలో మలుపు వద్ద డ్రైవర్ నియంత్రణ కోల్పోవడంతో ఈ ఘటన చోటుచేసుకుంది.



### సురక్షితంగా బయటపడిన ప్రయాణికులు

బోల్తా పడిన ప్రమాదంలో కారు ముందు భాగం, అద్దాలు పూర్తిగా ధ్వంసమయ్యాయి. ఘటన జరిగిన సమయంలో కారులో ఆత్మకూరు మండలానికి చెందిన ఇద్దరు వ్యక్తులు ప్రయాణిస్తున్నట్లు సమాచారం. అదృష్టవశాత్తూ వారికి ఎలాంటి గాయాలు కాకపోవడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. కారులో ఉన్నవారు సురక్షితంగా బయటపడటంతో ప్రాణాపాయం తప్పింది.

### సూచిక బోర్డులు కరువు.. నిత్యం ప్రమాదాలు

కారు అతివేగంగా నడపడం ఒక కారణమైతే.. ప్రమాదకరమైన మూలమలుపు వద్ద ఎలాంటి సూచిక (హెచ్చరిక) బోర్డులు లేకపోవడం ప్రధాన కారణమని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొత్తగా ఈ మార్గంలో ప్రయాణించే వాహనదారులకు ఇక్కడ మలుపు ఉన్నట్లు ముందస్తుగా తెలియకపోవడం వల్లే తరచూ ఇలాంటి ప్రమాదాలు జరుగుతున్నాయని వారు వివరిస్తున్నారు. సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి, ప్రమాదాలు జరగకుండా మలుపుల వద్ద సూచిక బోర్డులు, అవసరమైన చోట స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. కాగా, స్థానికుల సమాచారంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరిస్తున్నారు.

## ఖమ్మం త్రీ టౌన్ పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా సందర్శించిన పోలీస్ కమిషనర్



**ఖమ్మం కార్పొరేషన్, ఆగస్టు 12 (జనం సాక్షి) :** నేరాల పరిశోధన, నిందితుల గుర్తింపును వేగవంతం చేయడానికి క్రైమ్ అండ్ క్రిమినల్ ట్రాకింగ్ నెట్‌వర్క్ సిస్టమ్స్ నిర్వహణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ పోలీస్ అధికారులకు ఆదేశించారు. బుధవారం ఖమ్మం త్రీ టౌన్ పోలీస్ స్టేషన్ ను ఆకస్మికంగా చేరుకున్న పోలీస్ కమిషనర్ బాధిత ఫిర్యాదుదారులతో మాట్లాడారు. అనంతరం స్టేషన్ నిర్వహణ, పోలీసుల పనితీరు, విచారణ నివేదికలు,. అప్లోడ్, జనరల్ డైరీ రికార్డులను, సీజ్ చేసిన వాహనాలు, పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా క్రైమ్ అండ్ క్రిమినల్ ట్రాకింగ్ నెట్వర్క్ సిస్టమ్స్ లో వస్తున్న అధునాతన పద్ధతులను అందిపుచ్చుకోవాలాని సిబ్బందికి సూచించారు. పోలీస్ స్టేషన్లలో డేటా నమోదు, దర్యాప్తు ప్రక్రియలో పారదర్శకత, సాంకేతికతను మెరుగుపరచడంలో ఈ వ్యవస్థ అత్యంత కీలకమని స్పష్టం చేశారు.జిల్లాలో వివిధ రకాల నేరాలకు పాల్పడుతున్న వారిని కనిపెట్టేందుకు ఈ ప్రాజెక్టులో నూతన పద్ధతులు ప్రవేశపెడుతున్నారని , వాటిపై పరిణితి సాధించాలని సూచించారు. ఉన్నతాధికారులు ప్రాజెక్టును సమర్థవంతంగా ఉపయోగించాలని.తద్వారా క్రింది స్థాయి సిబ్బంది మరింత మెరుగ్గా వినియోగించేందుకు అవకాశం ఉంటుందని చెప్పారు. ప్రాజెక్టులో భాగంగా ఈ-సమన్స్, ఈ-సాక్ష్యా వంటి వాటిని విస్తృతంగా ఉపయోగించాలని వివరించారు. రౌడీ షీటర్ల ను కౌన్సిలింగ్ చేయాలని, అదేవిదంగా నిఘా పెట్టాలని ఆదేశించారు. కార్యక్రమంలో టౌన్ ఏసీపీ రమణమూర్తి పాల్గొన్నారు.

# నేరాల నియంత్రణలో ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలి

- జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే
- సైబర్,గల్ఫ్ మోసాలపై విస్తృతంగా అవగాహన కల్పించాలి
- గ్రామాల్లో సీసీ కెమెరాల ఏర్పాటుకు కృషి చేయాలి
- రుద్రంగి పోలీస్ స్టేషన్ ను తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ

**రుద్రంగి, ఆగస్టు 12 (జనం సాక్షి) :** నేరాల నియంత్రణలో ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉంటూ ప్రజలకు మరింత చేరువయ్యేలా పోలీసు అధికారులు,సిబ్బంది బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే ఆదేశించారు.వార్షిక తనిఖీల్లో భాగంగా బుధవారం రుద్రంగి పోలీస్ స్టేషన్ ను ఆయన తనిఖీ చేశారు.ముందుగా పోలీస్ సిబ్బంది నుంచి గౌరవ వందనం స్వీకరించి, వారు ప్రదర్శించిన ఫుట్ డ్రిల్, లాఠీ డ్రిల్ ను పరిశీలించి అభినందించారు. అనంతరం స్టేషన్ పరిధిలో నమోదైన కేసులు, పెండింగ్ కేసుల దర్యాప్తు పురోగతి, స్టేషన్ రికార్డుల నిర్వహణ, సిబ్బంది




హాజరు,పెట్రోలింగ్ నిర్వహణ, రౌడీషీటర్లు, పాత నేరస్తులపై నిఘా తదితర అంశాలను క్షుణ్ణంగా సమీక్షించారు. కేసుల విచారణలో త్వరితగతిన దర్యాప్తు, సాక్ష్యాల సేకరణలో నిష్పక్షపాత దృక్పథం అవసరమని సూచించారు. స్టేషన్ అధికారులు, సిబ్బంది పనితీరు బేషుగ్గా ఉందని అభినందించారు. సి.సి.టి. ఎన్.ఎస్ లో అందుబాటులోకి వస్తున్న అధునాతన సాంకేతిక పద్ధతులను సిబ్బంది అందిపుచ్చుకోవాలని,డేటా నమోదు, దర్యాప్తు ప్రక్రియలో పారదర్శకత పాటించాలని సూచించారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల ప్రజలకు సైబర్ మోసాలు,గల్ఫ్ ఉద్యోగాల పేరుతో జరుగుతున్న మోసాలపై విస్తృతంగా అవగాహన కల్పించాలని, నకిలీ ఉద్యోగ ప్రకటనలు, వీసా మోసాలు, నకిలీ ఏజెంట్ల మోసాలు, సోషల్ మీడియా మోసాలపై ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేయాలని ఆదేశించారు. బ్లూకోల్ట్, పెట్రోకార్ సిబ్బంది గ్రామాల్లో పెట్రోలింగ్ ను మరింత ముమ్మరం చేసి అనుమానితులు, రౌడీషీటర్లు, హిస్టరీషీటర్లపై నిరంతర నిఘా ఉంచాలన్నారు. మాదకద్రవ్యాల అక్రమ రవాణా, విక్రయాలు, వినియోగంపై కఠినంగా వ్యవహరించాలని, యువత మాదకద్రవ్యాల బారిన పడకుండా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. స్టేషన్ పరిధిలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల పనితీరును పరిశీలించిన ఎస్పీ, అవి నిరంతరం పనిచేసేలా చర్యలు తీసుకోవాలని, 'నేను సైతం' కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లో సీసీ కెమెరాల ప్రాముఖ్యతను వివరించి ఏర్పాటుకు కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ శ్రీనివాసులు, సీఐ రవీందర్, ఎస్ఐ మోతిరామ్, సిబ్బంది పాల్గొన్నారు.

## ఎల్‌నినో నేపథ్యంలో రైతులు అప్రమత్తంగా ఉండాలి



**ఉమ్మడి ఖమ్మం జిల్లా బ్యూరో, ఆగస్టు 12 (జనం సాక్షి) :** ఎల్‌నినో ప్రభావంతో రానున్న రోజుల్లో వర్షపాతం తగ్గే అవకాశం ఉన్నందున రైతులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ సూచించారు. కలెక్టరేట్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఎల్‌నినో పరిస్థితులు, వర్షపాతం, భూగర్భ జలాలు, వ్యవసాయంపై ప్రభావం తదితర అంశాలను ఆయన వివరించారు. రానున్న రెండు, మూడు నెలల్లో ఎల్‌నినో ప్రభావం బలపడే అవకాశం ఉందని, రెండు మూడు రోజులు వర్షాలు కురిసినంత మాత్రాన సాధారణ వర్షపాతం ఉంటుందని భావించి అధిక నీటి అవసరమయ్యే పంటలు సాగు చేయవద్దని రైతులకు సూచించారు. నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకుని తక్కువ నీటితో సాగయ్యే ప్రత్యామ్నాయ పంటలకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు.

### భూగర్భ జలాలు తగ్గుముఖం

గత ఏడాదితో పోలిస్తే జిల్లాలో భూగర్భ జలమట్టాలు 6.5 నుంచి 8 అడుగుల మేర తగ్గాయని కలెక్టర్ తెలిపారు. బోర్లు ఉన్నాయనే కారణంతో అధిక నీటి అవసరమయ్యే పంటలు సాగు చేయవద్దని సూచించారు. రానున్న నెలన్నరలో భూగర్భ జలాల లభ్యత మరింత తగ్గే అవకాశం ఉన్నందున అందుబాటులో ఉన్న నీటిని పొదుపుగా వినియోగించాలని, త్రాగునీటికి ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు.

### ప్రత్యామ్నాయ పంటలకు ప్రాధాన్యత

పొద్దుతిరుగుడు, పప్పుధాన్యాలు, కంది, పెసర వంటి తక్కువ నీటి అవసరమయ్యే పంటల విత్తనాలు అందుబాటులో ఉన్నాయని కలెక్టర్ తెలిపారు. పప్పుధాన్యాల విత్తనాలను 50 శాతం సబ్సిడీపై అందిస్తున్నామని చెప్పారు. సత్తుపల్లి ప్రాంతంలో వరి సాగు విస్తృతంగా జరుగుతున్న నేపథ్యంలో నీటి పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని పంటల ఎంపిక చేసుకోవాలని రైతులకు సూచించారు.

### నీటి సంరక్షణకు చర్యలు

వర్షపు నీటిని భూగర్భంలోకి ఇంకేలా సోక్‌పిట్లు, కమ్యూనిటీ సోక్‌పిట్లు, రెయిన్‌వాటర్ హార్వెస్టింగ్ పిట్ల నిర్మాణం చేపడుతున్నామని తెలిపారు. జిల్లాలో సుమారు 80 వేల మంది రైతులను ఫామ్‌పాండ్ల నిర్మాణానికి గుర్తించగా, ఇప్పటివరకు 3 వేల మంది రైతులు అంగీకరించారని చెప్పారు. వారి పొలాల్లో ఫామ్‌పాండ్ల నిర్మాణ పనులు చేపడుతున్నామని వివరించారు. వర్షపాతం, భూగర్భ జలాల పరిస్థితిపై వాస్తవ సమాచారాన్ని ఎప్పటికప్పుడు రైతులు, ప్రజలకు చేరవేయాలని అధికారులను ఆదేశించారు. ఎల్‌నినో పరిస్థితులపై రైతులకు విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. వర్షాకాలం పూర్తయిన తర్వాతే జిల్లాలో కరువు పరిస్థితులపై స్పష్టమైన నిర్ణయం తీసుకుంటామని కలెక్టర్ పేర్కొన్నారు.

## గోదాములు నిర్మాణ పనులను పరిశీలించిన ఎమ్మెల్యే సామేల్

**తుంగతుర్తి ఆగస్టు 12 (జనం సాక్షి) :** 6 కోట్లతో పదివేల మెట్రిక్ టన్నుల గోదాముల నిర్మాణ పనులను స్థానిక ఎమ్మెల్యే మందుల సామేలు పరిశీలించారు, బుధవారం మండల పరిధిలోని మల్లన్న గుట్ట వద్ద గిడ్డంగుల సంస్థల ఆధ్వర్యంలో సుమారు రూ.6 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న 10 వేల మెట్రిక్ టన్నుల సామర్థ్యం గల గోదాముల నిర్మాణ పనులను బుధవారం ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ సందర్భంగా నిర్మాణ పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. పనులను నాణ్యతా ప్రమాణాలతో, నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని సూచించారు. నియోజకవర్గ కేంద్రంలో ఫైర్‌స్టేషన్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అదేవిధంగా వంద పడకల ఆసుపత్రి నిర్మాణ పనులను త్వరలో పూర్తి చేసి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురానున్నట్లు వెల్లడించారు. తిమ్మాపురం నుంచి వెంకే పల్లి వరకు డబుల్ రోడ్డు నిర్మాణం పూర్తయిందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. నియోజకవర్గంలోని ప్రధాన రహదారులను అభివృద్ధి చేయడంతో పాటు ప్రజల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడమే తన ధ్యేయమని అన్నారు. నూతనకల్, మద్దిరాల మండలాల పరిధిలోని ఎర్ర పహాడ్ గ్రామ దేశముక్ జేన్నారెడ్డి కుటుంబానికి చెందిన సుమారు 3 వేల ఎకరాల సీలింగ్ భూమిని 2వేల మంది రైతులకు పంపిణీకి ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా మద్దిరాల మండల కేంద్రంలో 30



పడకల ఆసుపత్రి నిర్మించడంతోపాటు 15 వేల మెట్రిక్ టన్నుల గోదాముల నిర్మాణానికి స్థలాన్ని పరిశీలిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రేగటి రవి గౌడ్, సింగిల్ విండో చైర్మన్ గుడిపాటి సైదులు, వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ చింతకుంట్ల వెంకన్న,పానుగంటి నరసింహారెడ్డి, మద్దిరాల మండల అధ్యక్షుడు పచ్చిపాల వెంకన్న, నూతనకల్ అధ్యక్షుడు మల్లారెడ్డి,పోలేపాక రామచంద్రు, దాసరి శ్రీను, పాల్వాయి నాగరాజు, దీప్లా నాయక్, నల్లు రామచంద్రారెడ్డి, ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# మోడల్ కాలనీ ఇండ్ల పనుల్లో స్పీడు పెంచాలి

- అర్హులకే ఇండ్లు ఇస్తాం, లబ్ధిదారుల జాబితా పరిశీలిస్తున్నాం
- జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్

**హుజుర్‌నగర్, ఆగస్టు 12 (జనంసాక్షి) :** పట్టణ పరిధిలోని రామస్వామి గుట్ట వద్ద ఇందిరమ్మ మోడల్ కాలనీలో ఇండ్ల నిర్మాణ పనుల్లో వేగం పెంచాలని, చిన్న చిన్న లోపాలు ఉన్నా వెంటనే రెక్టిఫై చేయాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అధికారులను ఆదేశించారు. ఇండ్ల సముదాయాల్లో మిగిలిపోయిన పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని స్పష్టం చేశారు. హుజుర్ నగర్ రామస్వామి గుట్ట వద్ద నిర్మిస్తున్న మోడల్ కాలనీ ఇండ్లను జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికీ న్యాయం జరిగేలా పారదర్శకంగా పంపిణీ ప్రక్రియ పూర్తి చేస్తామని తెలిపారు.

### ప్రతి బ్లాక్‌లో ఇన్స్పెక్షన్లు

ఇటీవల మంత్రి ఆదేశాల మేరకు హౌసింగ్ యూనిట్లలోని ప్రతీ బ్లాక్‌ను కలెక్టర్ ప్రత్యక్షంగా పరిశీలించారు. ఇండ్లలో ఉన్న చిన్న చిన్న లోపాలను గుర్తించి, వాటి జాబితాను సిద్ధం చేయాలని సూచించారు. ఆ లోపాలను వెంటనే సరిదిద్దాలని సంబంధిత కాంట్రాక్టర్లు, అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. ఇండ్లతో పాటు డ్రైనేజీ, తాగునీరు, రోడ్లు వంటి మౌలిక వసతుల కల్పన పనులను వేగవంతం చేయాలని సూచించారు.

### ఠితెలంగాణ పబ్లిక్ స్కూల్ పనులు వేగవంతం

ఇండ్ల సముదాయం ప్రాంగణంలో మంజూరైన తెలంగాణ పబ్లిక్ స్కూల్ భవన పునాది పనులు, డైనింగ్ హాల్ నిర్మాణాలు ప్రస్తుతం వేగంగా జరుగుతున్నాయని కలెక్టర్ తెలిపారు. వీటితో పాటు అంగన్‌వాడీ కేంద్రాలు, కమ్యూనిటీ హాళ్లు, షాపింగ్ కాంప్లెక్స్‌లు, స్టామ్ వాటర్ డ్రెయిన్ల నిర్మాణ పనులకు ప్రాధాన్యతనిచ్చి పూర్తి చేయిస్తున్నట్లు వివరించారు. వివిధ శాఖల మధ్య సమన్వయ లోపం లేకుండా చూసుకోవాలని ఇంజనీరింగ్ అధికారులను హెచ్చరించారు.

### ఠ1,805 మందితో తాత్కాలిక జాబితా

ఆర్డీవో ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కమిటీ ద్వారా ప్రాథమికంగా 1,805 మంది అర్హులైన లబ్ధిదారులతో జాబితాను సిద్ధం చేసినట్లు వెల్లడించారు. అయితే ఈ జాబితాపై వచ్చిన ఫిర్యాదులు, అభ్యంతరాలను ప్రత్యేక బృందాల ద్వారా



క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్నామని తెలిపారు. అర్హత లేని వారి పేర్లు ఉంటే తొలగిస్తామని, నిజమైన పేదలకు మాత్రమే ఇండ్లు కేటాయిస్తామని స్పష్టం చేశారు. పనుల నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ పడేది లేదని తేల్చి చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో శ్రీనివాసులు, పిడి హౌసింగ్ జబ్బర్ హేహ్మద్, తహసిల్దార్ కవిత, మున్సిపల్ కమిషనర్ సతీష్ కుమార్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## తుంగతుర్తిలో కోర్టు భవన నిర్మాణానికి 29 కోట్లు మంజూరు

- స్థల పరిశీలన చేసిన ఎమ్మెల్యే

తుంగతుర్తి, ఆగస్టు 12 (జనం సాక్షి) : తుంగతుర్తి మండల కేంద్రంలో జూనియర్ సివిల్ కోర్టు భవన నిర్మాణానికి 29 కోట్లు మంజూరయ్యాయని త్వరలో నిర్మాణ పనులను ప్రారంభించనున్నట్లు స్థానిక ఎమ్మెల్యే మందుల సామేలు అన్నారు, బుధవారం మండల కేంద్రంలో జాతీయ రహదారి పక్కన గతంలో భావన నిర్మాణానికి సేకరించిన మూడున్నర ఎకరాల ప్రభుత్వ భూమిని పరిశీలించారు, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అద్దె భవనంలో నడుస్తున్న కోర్టు కక్షిదారులతోపాటు న్యాయవాదులకు ఇబ్బందిగా ఉందని అన్నారు, ఇప్పటికే ప్రభుత్వ భూమిని కోర్టు భవన నిర్మాణం కోసం సేకరించారని త్వరలో టెండర్ ఖరారు కానున్నదని అన్నారు, ఇప్పటికే తుంగతుర్తికి ఫైర్ స్టేషన్ మంజూరు అయిందని అన్నారు, నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసేందుకు తాను విచ్చేస్తున్నట్లు తెలిపారు ఈ కార్యక్రమంలో తుంగతుర్తి బార్ అసోసియేషన్ అధ్యక్షులు అన్నపర్తి జ్ఞాన సుందర్, తుంగతుర్తి మార్కెట్ కమిటీ చైర్మన్ చింతకుంట్ల వెంకన్న, మండల పార్టీ అధ్యక్షుడు రేగటి రవి గౌడ్, సింగిల్ విండో చైర్మన్ గుడిపాటి సైదులు దాసరి శ్రీను, న్యాయవాదులు వజీర్, పర్వీన్ తో పాటు గ్రామాల సర్పంచులు నాయకులు పాల్గొన్నారు.








# మార్కెట్లో ఆచితూచి అడుగులు

- 15% తగ్గిన ఈక్విటీ పెట్టుబడులు
- 'సిప్'పై పెరిగిన విశ్వాసం: యాంఫీ

**హైదరాబాద్:** దేశీయ స్టాక్ మార్కెట్లో షేర్ల ధరలు ఎక్కువగా ఉండటం, సూచీల ఒడుదొడుకులు అధికంగా ఉన్న నేపథ్యంలో మ్యూచువల్ ఫండ్ మదుపరులు అప్రమత్తంగా వ్యవహరిస్తున్నారు. జులైలో ఈక్విటీ మ్యూచువల్ ఫండ్లలోకి నికర పెట్టుబడులు 15% తగ్గి, రూ.24,697 కోట్లకు పరిమితం కావడమే ఇందుకు నిదర్శనం. గత రెండేళ్లలో ఈక్విటీ ఆధారిత మ్యూచువల్ ఫండ్ల నుంచి రాబడులు కొంత మందగించడమూ కారణమే. భారతీయ మ్యూచువల్ ఫండ్ల సంఘం (యాంఫీ) విడుదల చేసిన నివేదిక ప్రకారం... పెట్టుబడులు కొంత తగ్గినా, ఈక్విటీలపై మదుపరులకు నమ్మకం పోలేదని, కేవలం తమ పోర్ట్‌ఫోలియోలను సమతుల్యం చేసుకునేందుకు మదుపరులు జాగ్రత్తలు తీసుకుంటున్నారని విశ్లేషకులు చెబుతున్నారు. అనవసర రిస్కు తీసుకోకుండా, భవిష్యత్తులో స్థిరమైన ప్రయోజనాలు ఇచ్చే ప్రత్యామ్నాయాలపై మదుపరులు దృష్టి సారిస్తున్నారు. అయితే క్రమశిక్షణతో కూడిన దీర్ఘకాలిక పెట్టుబడి వ్యూహం.. క్రమానుగత పెట్టుబడి విధానం (సిప్)పై రిటెయిల్ మదుపరుల విశ్వాసం కొనసాగుతోంది. జులైలో ఈ రూపేణ పెట్టుబడులు సరికొత్త గరిష్ఠమైన రూ.31,961 కోట్ల స్థాయికి చేరాయి. వరుసగా అయిదో నెలలోనూ రూ.31,000 కోట్ల కంటే ఎక్కువగా నమోదు కావడం, దేశీయ చిన్న మదుపరులకు మార్కెట్లపై ఉన్న నమ్మకాన్ని సూచిస్తోందని యాంఫీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ వెంకట్ చలసాని వెల్లడించారు. మిడ్ క్యాప్‌పైనే..: ఈక్విటీ విభాగంలో పెట్టుబడిదారులు ఎక్కువగా చిన్న, మధ్యశ్రేణి (స్మాల్, మిడ్ క్యాప్) కంపెనీల ఫండ్లపైనే ఆసక్తి చూపిస్తున్నారు. జులైలో స్మాల్ క్యాప్‌ఫండ్లలోకి రూ.7,768 కోట్లు, మిడ్‌క్యాప్ పథకాల్లోకి రూ.6,192 కోట్లు, ఫ్లెక్సీ క్యాప్ ఫండ్లలోకి రూ.4,710 కోట్ల పెట్టుబడులు వచ్చాయి. స్థిరమైన వృద్ధిని ఆర్జించే లార్జ్‌క్యాప్ ఫండ్లలోకి కేవలం రూ.1,322 కోట్లే వచ్చాయి. జూన్‌లో డెట్ మార్కెట్ నుంచి రూ.1.09 లక్షల కోట్ల ఉపసంహరణలు జరగ్గా, జులైలో రూ.1.88 లక్షల కోట్ల నికర పెట్టుబడులు వచ్చాయి. ఫలితంగా జులైలో మొత్తం పరిశ్రమ రూ.2.36 లక్షల కోట్ల నికర పెట్టుబడులను ఆకర్షించినట్లయ్యింది. గోల్డ్ ఎక్స్ఛేంజ్ ట్రేడెడ్ ఫండ్ల (గోల్డ్ ఈటీఎఫ్)లో పెట్టుబడుల వేగం తగ్గింది.

# రెండో రోజూ నష్టాల్లోనే..

- మార్కెట్లకు ముడిచమురు సెగలు
- ఎఫ్ఐఐ కొనుగోళ్లు: రూ.259 కోట్లు
- డీఐఐ కొనుగోళ్లు: రూ.25 కోట్లు



**న్యూఢిల్లీ:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు రెండో రోజూ నష్టాల్లో ముగిశాయి పశ్చిమాసియాలో నెలకొన్న అనిశ్చితి కారణంగా చమురు ధరలు పెరగడం మార్కెట్‌పై ప్రభావం చూపింది. ఐటీ, రియాల్టీ, ఎఫ్ఎంసీజీ స్టాక్స్‌లో అమ్మకాల ఒత్తిడి ఎదురైంది. దీంతో సూచీలకు నష్టాలు తప్పలేదు. ముఖ్యంగా టాటా సన్స్ ఛైర్మన్ ఎన్ చంద్రశేఖరన్ రాజీనామాతో టీసీఎస్ షేర్లు 4 శాతానికి పైగా కుంగాయి. సెన్సెక్స్ ఉదయం 78,263.33 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 78,154.25) లాభాల్లో మొదలై.. ఆరంభంలోనే నష్టాల్లోకి జారకుంది. రోజంతా నష్టాల్లోనే కదలాడింది. ఇంట్రాడేలో 77,497.93 వద్ద కనిష్ఠానికి పడిపోయింది. చివరికి 187.90 పాయింట్లు కోల్పోయి 77,966.35 వద్ద ముగిసింది. నిఫ్టీ 35.75 పాయింట్లు పతనమై 24,435.95 వద్ద స్థిరపడింది. డాలరుతో పోలిస్తే రూపాయి మారకం విలువ 95.33 వద్ద ఉంది. సెన్సెక్స్ 30లో టీసీఎస్, మహీంద్రా అండ్ మహీంద్రా, టాటా స్టీల్, ఎల్అండ్‌టీ, ఎటర్నల్, ఇన్ఫోసిస్ షేర్లు ప్రధానంగా నష్టాలను చవిచూశాయి. ఎస్‌బీఐ, భారతీ ఎయిర్‌టెల్, అల్ట్రాటెక్ సిమెంట్, పవర్ గ్రిడ్, రిలయన్స్, బీఈఎల్ షేర్లు లాభపడ్డాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ ధర 88.71 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. బంగారం ఔన్స్ ధర 4,417.97 వద్ద ట్రేడవుతోంది.

**ఎఫ్ఐఐ కొనుగోళ్లు: రూ.259 కోట్లు**

అమెరికా– ఇరాన్ ఉద్రిక్తతల నేపథ్యంలో, అంతర్జాతీయంగా ముడిచమురు ధర భారీగా పెరగడం, ఈక్విటీ మదుపర్లను కలవరపెట్టింది. దీంతో మంగళవారం దేశీయ సూచీలకూ నష్టాలకు తప్పలేదు. డాలర్‌తో పోలిస్తే రూపాయి 6 పైసలు తగ్గి 95.36 వద్ద ముగిసింది. బ్యారెల్ బ్రెంట్ ముడిచమురు 1% లాభంతో 88.30 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. బీఎస్ఈలోని నమోదిత కంపెనీల మార్కెట్ విలువ రూ.1.45 లక్షల కోట్లు తగ్గి రూ.492.72 లక్షల కోట్ల (5.16 లక్షల కోట్ల డాలర్ల)కు చేరింది. సెన్సెక్స్ ఉదయం 32 పాయింట్ల నష్టం (క్రితం ముగింపు 78,542.44 పాయింట్ల)తో 78,509.77 వద్ద ప్రారంభమైంది. రోజంతా నష్టాల్లోనే కదలాడిన సూచీ, ఇంట్రాడేలో 78,048.26 వద్ద కనిష్ఠాన్ని తాకింది. చివరకు 388.19 పాయింట్ల నష్టంతో 78,154.25 వద్ద ముగిసింది. నిఫ్టీ 112.10 పాయింట్లు కోల్పోయి 24,471.70 దగ్గర స్థిరపడింది. ఇంట్రాడేలో ఈ సూచీ 24,429.25– 24,576.85 పాయింట్ల మధ్య కదలాడింది. సెన్సెక్స్ 30 షేర్లలో 25 డీలాపడ్డాయి. అల్ట్రాటెక్ 2.75%, యాక్సిస్ బ్యాంక్ 1.52%, ఇండిగో 1.50%, భారతీ ఎయిర్‌టెల్ 1.44%, బజాజ్ ఫైనాన్స్ 1.04%, పవర్‌గ్రిడ్ 1.03%, ఐటీసీ 0.92% నష్టపోయాయి. ఎటర్నల్, ఇన్ఫోసిస్, టైటన్, హెచ్‌సీఎల్ టెక్ స్వల్పంగా లాభపడ్డాయి. రంగాల వారీ సూచీల్లో.. హాస్పిటల్స్ 1.82%, స్థిరాస్తి 1.03%, ఎఫ్ఎమ్‌సీజీ 0.87%, కమొడిటీస్ 0.80%, విద్యుత్ 0.54% నీరసపడ్డాయి. మౌలిక రంగ సంస్థ ఎల్ అండ్ టీ తమ డేటా కేంద్రాలు, క్లౌడ్ సేవల వ్యాపారాన్ని పూర్తి స్థాయి అనుబంధ సంస్థ అయిన వ్యోమా.ఏఐ లిమిటెడ్‌కు బదిలీ చేయడానికి ఒప్పందం కుదుర్చుకుంది. ఈ ప్రక్రియ 2026 అక్టోబరుకు పూర్తి కానుంది. గోద్రేజ్ కన్జ్యూమర్ ప్రోడక్ట్స్ ఎండీ, సీఈఓగా సుధీర్ సీతాపతి వైదొలిగారు. కొత్త ఎండీ, సీఈఓగా ఆసిఫ్ మల్బారీ నియమితులయ్యారు. హైదరాబాద్‌కు చెందిన కేఫ్ నిలోఫర్ (ఏబీఆర్ కేఫ్ అండ్ బేకర్స్ ప్రైవేట్ లిమిటెడ్) తన వ్యాపార విస్తరణ అవసరాల కోసం కొత్త పెట్టుబడులను సమీకరించనుంది. ఇందుకోసం పెట్టుబడిదారులను గుర్తించేందుకు పీడబ్ల్యూసీ, రైన్‌మేకర్ గ్రూపులను సలహాదారులుగా నియమించుకున్నట్లు సమాచారం. మెక్సికోలో కొత్త జెమినై ఎక్స్‌పీరియెన్స్ సెంటర్‌ను టీసీఎస్, గూగుల్ క్లౌడ్ సంయుక్తంగా నెలకొల్పాయి. లాటిన్ అమెరికాలో టీసీఎస్‌కు ఇది రెండోది కాగా, ప్రపంచవ్యాప్తంగా 9వ జెమినై ఎక్స్‌పీరియెన్స్ సెంటర్. టీసీఎస్ రూపొందించిన 3000కు పైగా జెమినై ఎంటర్‌ప్రైజ్ ఏఐ ఏజెంట్లు ఈ కేంద్రంలో అందుబాటులో ఉంటాయి.

## ఆరో అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్

### కేంద్ర ఆర్థిక సహాయ మంత్రి పంకజ్

**దిల్లీ:** ప్రపంచంలో ఆరో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా మనదేశం ఉందని రాజ్యసభకు ఆర్థిక సహాయ మంత్రి పంకజ్ చౌద్రీ లిఖితపూర్వకంగా తెలిపారు. అంతర్జాతీయ ద్రవ్య నిధి (ఐఎంఎఫ్) 2026 ఏప్రిల్‌లో విడుదల చేసిన 'వరల్డ్ ఎకనామిక్ అవుట్‌లుక్' నివేదికలో 2025–26 ఆర్థిక సంవత్సరానికి భారతదేశ నామినల్ జీడీపీ 4.15 ట్రిలియన్ డాలర్లు (సుమారు రూ.394.25 లక్షల కోట్లు) అని పేర్కొందని.. ఈ ప్రకారం మనది ఆరో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ అని వివరించారు. మనదేశాని కంటే ముందు అమెరికా 32.38 ట్రి.డా., చైనా 20.85 ట్రి.డా., జర్మనీ 5.45 ట్రి.డా., జపాన్ 4.38 ట్రి.డా., యునైటెడ్ కింగ్‌డమ్ 4.26 ట్రి.డా. ఉన్నాయి. 'ఐఎంఎఫ్ ర్యాంకింగ్‌లు అమెరికా డాలర్ మారకపు రేట్ల ఆధారంగా లెక్కించే నామమాత్రపు జీడీపీపై ఆధారపడి ఉంటాయి. ఆర్థిక వృద్ధి, మారకపు రేట్లు, ధరల్లో మార్పులు, జాతీయ గణాంకాల సవరణలు, ఇతర ప్రధాన ఆర్థిక వ్యవస్థల పరిమాణం, వృద్ధిలో మార్పులు వంటి వివిధ అంశాలు కలయికతో ఆర్థిక వ్యవస్థల సాపేక్ష ర్యాంకింగ్‌లలో మార్పులు వస్తుంటాయి' అని మంత్రి వెల్లడించారు. భారత ఆర్థిక వ్యవస్థ వృద్ధి సామర్థ్యాన్ని పెంపొందించడానికి ప్రభుత్వం విస్తృత స్థాయి వ్యూహాన్ని అనుసరించిందని పేర్కొన్నారు. ఎఫ్‌పీఐల విక్రయాలు రూ.29.8 లక్షల కోట్లు: నేషనల్ సెక్యూరిటీస్ డిపాజిటరీ లిమిటెడ్ గణాంకాల ప్రకారం, దేశీయ ఈక్విటీ మార్కెట్లలో 2026 జనవరి నుంచి ఆగస్టు 5 వరకు విదేశీ పోర్ట్‌ఫోలియో మదుపర్ల (ఎఫ్‌పీఐల) స్థూల విక్రయాలు రూ.29.8 లక్షల కోట్లుగా నమోదయ్యాయని మంత్రి తెలిపారు. ప్రభుత్వ రంగ బ్యాంకుల స్థూల నిరర్థక ఆస్తులు (జీఎన్‌పీఏలు) గత మూడు ఆర్థిక సంవత్సరాల్లో తగ్గుతూ వస్తున్నాయని పంకజ్ వెల్లడించారు.

# మరోసారి ఒరాకిల్ లేఆఫ్‌లకు సిద్ధం

### ఈసారి ఏఐ ఖర్చుల భర్తీకి..!

**న్యూఢిల్లీ:** కృత్రిమ మేధ విస్తృత వినియోగం కారణంగా మొన్నటి వరకు ఉద్యోగాలు పోగా.. ఆ టెక్నాలజీకి పెట్టిన ఖర్చును పూడ్చుకోవడం కోసం మరికొంత మంది సిబ్బందిని తొలగించుకునేందుకు కంపెనీలు సిద్ధమవుతున్నాయి. ప్రముఖ టెక్ సంస్థ ఒరాకిల్ ఇప్పుడు ఆ బాటలోనే నడుస్తున్నట్లు కనిపిస్తోంది. ఈ నెలలో మరోసారి భారీసంఖ్యలో లేఆఫ్‌లు ప్రకటించనుందని తెలుస్తోంది. ఏఐ టెక్నాలజీని వేగంగా అందిపుచ్చుకునేందుకు డేటా సెంటర్ల నిర్మాణం, ఏఐ చిప్‌లను కొనుగోలు చేయడం, ఓపెన్ ఏఐ వంటి ఏఐ క్లయింట్లకు మద్దతు ఇచ్చేందుకు ఒరాకిల్ భారీగా పెట్టుబడులు పెడుతోంది. ఇప్పుడు ఆ ఖర్చును భర్తీ చేసుకునేలా ఉద్యోగులను తగ్గించుకోవాలని చూస్తున్నట్లు అంతర్జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. అయితే ఆ సంఖ్య ఎంతనేది మాత్రం వెల్లడికాలేదు. సెప్టెంబర్ ఒకటి నుంచి రెండో త్రైమాసికం ప్రారంభం కావడానికి ముందే ఈ కోతలు అమలు చేయాలని భావిస్తోంది. కొన్ని బృందాల్లో కోతలు డబుల్ డిజిట్‌లో ఉండనున్నట్లు సమాచారం. గతంలోనూ ఒరాకిల్ ఉద్యోగుల సంఖ్యను తగ్గించింది. 12 నెలల్లో 21వేల మందిని ఉద్యోగాల నుంచి తొలగించినట్లు జూన్ నెలలో రెగ్యులేటరీ ఫైలింగ్‌లో కంపెనీ వెల్లడించింది. సంస్థ కార్యకలాపాల్లో కృత్రిమ మేధను భాగం చేయడంతో ఉద్యోగులను తగ్గించుకోవాల్సి వచ్చిందని, భవిష్యత్తులోనూ ఈ కోతలు కొనసాగుతాయని నాడే పేర్కొంది.

## గుడ్ల ధరలు

| హైదరాబాద్ | వరంగల్ |
|---|---|
| ₹ 5.40 | ₹ 5.42 |

## బంగారం ధరలు (10 గ్రాములు)

హైదరాబాద్

| ₹ 1,54,236 | ₹ 1,67,180 |
|---|---|
| (22 క్యారెట్లు) | (24 క్యారెట్లు) |

## వెండి ధరలు (కేజీ)

హైదరాబాద్

₹ 2,40,000

# టాటా సన్స్‌కు చంద్రశేఖరన్ గుడ్‌బై

**న్యూఢిల్లీ:** టాటా సన్స్ ఛైర్మన్ పదవి నుంచి ఎన్. చంద్రశేఖరన్ వైదొలిగారు ఆగస్టు 18న కంపెనీ వార్షిక సర్వ సభ్యసమావేశం జరగనుంది. దానికిముందే ఆయన ఈ నిర్ణయం తీసుకున్నారు. 2017లో టాటా సన్స్ ఛైర్మన్‌గా నియమితులైన చంద్రశేఖరన్ రెండోసారి ఆ పదవిలో కొనసాగుతున్నారు. 2027 ఫిబ్రవరితో ఆయన పదవీకాలం ముగియనుంది. అయితే.. ఆ తర్వాత తన పునర్నియామకం ఉండబోదని.. గడువు పూర్తయ్యే వరకు కొనసాగుతానని ఆయన స్పష్టం చేశారు. "టాటా గ్రూప్‌లో 40 ఏళ్ల వృత్తి జీవితాన్ని పూర్తి చేసుకున్నాను. ఈ ప్రతిష్ఠాత్మక సంస్థకు సేవలందించినందుకు ఎంతో కృతజ్ఞతతో ఉన్నాను. దశాబ్దకాలంగా టాటా సన్స్‌కు నాయకత్వం వహించడం గొప్ప గౌరవంగా, బాధ్యతగా భావించాను" అని చంద్రశేఖరన్ తన ప్రకటనలో పేర్కొన్నారు . 2027 తర్వాత తన పునర్నియామకానికి బోర్డు సభ్యుల్లో ఒకరు మద్దతు ఇవ్వలేదని వెల్లడించారు. ఏకగ్రీవ మద్దతు లేకపోవడంతో తాను ముందుకు సాగాలని అనుకోవడం లేదని చెప్పారు. "టాటా సన్స్ చాలా పెద్ద సంస్థ. ఎన్నో కీలక ప్రాజెక్టులు కీలక దశలో ఉన్నాయి. 2027 ఫిబ్రవరి తర్వాత గ్రూప్‌ను నడిపించడానికి ఒక నాయకుడు ఉండటం అవసరం. అదే సమయంలో ఉద్యోగులు, పెట్టుబడిదారులు, భాగస్వాములు, ఇతర వాటాదారులకు నాయకత్వంపై స్పష్టత ఇవ్వడం కూడా అంతే ముఖ్యం" అని పేర్కొన్నారు. గత ఫిబ్రవరిలో జరిగిన బోర్డు సమావేశంలో చంద్రశేఖరన్ పునర్నియామకంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. చంద్రశేఖరన్ పునర్నియామకానికి టాటా ట్రస్ట్స్ ఛైర్మన్ నోయల్ టాటా కొన్ని షరతులు పెట్టినట్లు సమాచారం. టాటా గ్రూపులో కొన్ని కంపెనీలకు నష్టాలు వస్తున్న అంశాన్ని కూడా సమావేశంలో నోయల్ లేవనెత్తినట్లు తెలిసింది. అయితే.. ఏ కొత్త వ్యాపారమైనా లాభాల్లోకి రావాలంటే కొంత కాలం వేచిచూడాల్సి ఉంటుందని చంద్రశేఖరన్ పునర్నియామకానికి మద్దతిస్తున్న బోర్డు సభ్యులు నాడు పేర్కొన్నట్లు సమాచారం. 1987లో చంద్రశేఖరన్ టాటా గ్రూప్ లో చేరారు. అక్కడినుంచి అంచలంచెలుగా ఎదుగుతూ 2009లో టీసీఎస్ సీఈఓగా నియమితులయ్యారు. 2017లో టాటా సన్స్ ఛైర్మన్ బాధ్యతలు స్వీకరించారు.



**టాటా సన్స్ తదుపరి ఛైర్మన్ ఎంపిక ఎలా?..**

టాటా గ్రూప్ కంపెనీలకు గుండెకాయ లాంటి టాటా సన్స్‌కు తదుపరి ఛైర్మన్ ఎవరు? చంద్రశేఖరన్ రాజీనామా ప్రకటన తర్వాత వ్యాపార వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. టాటా వారసుల్లోనే ఎవరో ఒకరు ఛైర్మన్ అవుతారా? లేదా గ్రూప్‌లోని సీనియర్లకు పట్టం కడతారా? అనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. కానీ, టాటా సన్స్ ఛైర్మన్ నియామకం అంత సులువుగా ఏమీ జరగదు. దానికి ఒక ప్రక్రియ ఉంటుంది. అందు లో టాటా ట్రస్ట్‌లు నిర్ణయాత్మక పాత్ర పోషించబోతు న్నా యి. ఇంతకీ నియమాక ప్రక్రియ ఎలా ఉంటుంది? ట్రస్ట్ లకు ఛైర్మన్‌గా ఉన్న నోయల్ టాటాకు ఛైర్మన్ పగ్గాలు చేపట్టేందుకు ఉన్న అడ్డంకులేంటి? నటరాజన్ చంద్రశేఖ రన్ ప్రస్తుత పదవీకాలం ఫిబ్రవరి 2027 వరకు ఉంది. త్వరలో జరగబోయే టాటా సన్స్ బోర్డు సమావేశంలో ఆయన రాజీనామాను ఆమోదిస్తే.. కొత్త ఛైర్మన్ అన్వేషణ ప్రారంభవుతుంది. అలా చూసినా ఇంకా ఆరు నెలల సమయం ఉంది. కాబట్టి కొత్త ఛైర్మన్ ఎవరనేది తేలడానికి ఇంకా చాలా సమయం పడుతుంది.

**కుంగిన టాటా షేర్లు..**

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు నష్టాల్లో ట్రేడవుతున్నా యి. చమురు ధరలు పెరగడంతో పాటు టాటా సన్స్ ఛైర్మన్ ఎన్ చంద్రశేఖరన్ ఆ పదవి నుంచి వైదొలుగుతున్నట్లు ప్రకటించడం మార్కెట్ సెట్‌మెంట్‌ను దెబ్బతీసింది. దీంతో దేశీయ మార్కెట్ సూచీలు నష్టాల్లో కొనసాగుతున్నాయి. 12.30 గంటల సమయంలో సెన్సెక్స్ 613 పాయింట్లు పతనమై 77,540.94 వద్ద కొనసాగుతోంది. నిఫ్టీ 190 పాయింట్లు క్షీణించి 24,279 వద్ద ట్రేడవుతోంది. ఎన్.చంద్రశేఖరన్ నిర్ణయంతో టాటా కంపెనీ షేర్లు ఒత్తిడికి గురయ్యాయి. ఆయన పునర్నియామకం ఉండకపోవడంతో టాటా గ్రూప్ కంపెనీల షేర్లు క్షీణించాయి. టాటా కన్సల్టెన్సీ సర్వీస్ షేర్లు దాదాపు 6 శాతం వరకు కుంగి ఓ దశలో రూ. 2,301.10 వద్ద కనిష్ఠానికి పడిపోయాయి. 12.41 గంటల సమయంలో బీఎస్ఈలో రూ. 2332.35 వద్ద కొనసాగుతోంది. టాటా మోటర్స్ ప్యాసెంజర్ షేర్లు కూడా 4.11 శాతం పతనమయ్యాయి.

**వేతనం కూడా భారీగానే..**

టాటా సన్స్ ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్ ఎన్.చంద్రశేఖరన్ తన పదవి నుంచి వైదొలగనున్నట్లు ప్రకటించారు. వచ్చే ఏడాది ఫిబ్రవరితో తన పదవీకాలం ముగియనున్న వేళ.. ఆయన ఈ నిర్ణయం తీసుకున్నారు. పునర్నియామకం కోరకుండా గడువు వరకు ఆ బాధ్యతల్లో కొనసాగనున్నారు. ఇంతకీ టాటా సన్స్‌ను ఇన్నాళ్లు ముందుండి నడిపించిన చంద్రశేఖరన్‌కు వార్షిక వేతనం ఎంతో తెలుసా? అక్షరాలా రూ.158.6 కోట్లు. 2025–26 ఆర్థిక సంవత్సరానికి గానూ ఆయన ఈ మొత్తం అందుకున్నారు. ఒక ఏడాదిలో ఆయన అందుకున్న అత్యధిక మొత్తం ఇదే కావడం గమనార్హం. 2025–26లో అందుకున్న మొత్తం పారితోషికంలో జీతం, ఇతర ప్రయోజనాల కింద రూ.17.9 కోట్లు ఆయనకు లభించాయి. లాభం అనుసంధానిత కమిషన్ రూపంలో రూ.140.69 కోట్లు అందుకున్నారు. అంతకుముందు ఆర్థిక సంవత్సరం (2024–25)లో రూ.155.81 కోట్లు అందుకున్నారు. 2021–22 నుంచి గడిచిన ఐదేళ్లలో చంద్రశేఖరన్ సుమారు రూ.685 కోట్లు వేతనంగా పొందారు. గత ఐదేళ్లలో వేతనం, ఇతర ప్రయోజనాల కంటే కమిషన్ల రూపంలో చంద్రశేఖరన్ ఎక్కువ మొత్తం అందుకున్నారు. 2021–22 ఆర్థిక సంవత్సరంలో రూ.94 కోట్లు, 2022–23లో రూ.100 కోట్లు, 2023–24లో రూ.121.5 కోట్లు, 2024–25లో రూ.140.69 కోట్లు, 2025–26లో రూ.140.69 కోట్లు చొప్పున చంద్రశేఖరన్ కమిషన్ అందుకున్నారు .వ్యాపార రంగంలో అత్యధిక వేతనం పొందుతున్న వారి జాబితాలో చంద్రశేఖరన్ ఉన్నప్పటికీ.. అందరి కంటే ఎక్కువ వేతనం అందుకుంటున్నది మాత్రం హెచ్‌సీఎల్ టెక్ సీఈఓ సి.విజయ్ కుమార్. 2025–26 ఆర్థిక సంవత్సరానికి గానూ ఆయన రూ.176 కోట్ల మొత్తం వేతన రూపంలో పొందారు. ఇక గడిచిన ఆర్థిక సంవత్సరంలో టాటా సన్స్ బోర్డు డైరెక్టర్లకు చెల్లించిన మొత్తం పారితోషికంలో చంద్రశేఖరన్‌కు చెల్లించిన మొత్తం 80 శాతానికి సమానం.

**ఇంటర్న్‌గా వచ్చి.. 40ఏళ్లుగా ఒకే కంపెనీలో..**

ఓ సామాన్య రైతు కుటుంబం నుంచి వచ్చిన వ్యక్తి టెక్నాలజీ మీద ఆసక్తితో కార్పొరేట్ రంగంలో అడుగుపెట్టారు. సాధారణ ఉద్యోగిగా తన ప్రయాణాన్ని మొదలుపెట్టి.. 'టాటా గ్రూప్'లో దిగ్గజ నాయకుడిగా చెరగని ముద్ర వేశారు. ఇప్పుడు అనూహ్య పరిణామాలతో తన పదవిని వీడుతున్నారు. టాటా సన్స్ ఛైర్మన్ పదవి నుంచి నటరాజన్ చంద్రశేఖరన్ వైదొలుగుతున్న నేపథ్యంలో ఆయన ప్రస్థానాన్ని ఓసారి చూస్తే..

కార్పొరేట్ ట్రెండ్‌కు భిన్నంగా..

తమిళనాడులోని మోహనూర్ అనే చిన్న గ్రామంలో ఓ వ్యవసాయ కుటుంబంలో చంద్రశేఖరన్ 1963లో జన్మించారు. పభుత్వ పాఠశాలలో చదివిన ఆయన.. ఆ తర్వాత కోయంబత్తూర్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ నుంచి అప్లైడ్ సైన్సెస్‌లో బ్యాచిలర్ డిగ్రీ పూర్తి చేశారు. అనంతరం ప్రోగ్రామింగ్, టెక్నాలజీ మీద ఇష్టంతో ఎంసీఏ పట్టా పొందారు. 1987లో టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్‌లో ఇంటర్న్‌గా తన కెరీర్‌ను ప్రారంభించారు. అప్పటి నుంచి 40 ఏళ్ల పాటు ఆయన ఇదే కంపెనీలో కొనసాగుతూ వచ్చారు. సాధారణంగా కార్పొరేట్ రంగంలో ఉద్యోగులు మూడు, నాలుగేళ్లకు కంపెనీలు మారుతుంటారు. కానీ, చంద్రశేఖరన్ మాత్రం దశాబ్దాల పాటు ఒకే కంపెనీలో ఉంటూ టాటా పట్ల తన అనుబంధాన్ని చాటుకున్నారు. తన సుదీర్ఘ ప్రయాణంలో చంద్రశేఖరన్ కంపెనీలో అంచలంచెలుగా ఎదిగారు. 2007లో టీసీఎస్ బోర్డు సభ్యుడిగా, చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్‌గా నియమితులయ్యారు. ఆ తర్వాత రెండేళ్లకే అంటే 2009లో టీసీఎస్ సీఈఓ, మేనేజింగ్ డైరెక్టర్‌గా బాధ్యతలు చేపట్టారు. అప్పుడు చంద్రశేఖరన్ వయసు 46 ఏళ్లు. టాటా గ్రూప్‌లో సీఈఓ పగ్గాలు అందుకున్న అతి పిన్న వయస్కుడిగా ఆయన గుర్తింపు పొందారు. 2009లో చంద్రశేఖరన్ టీసీఎస్ బాధ్యతలు అందుకున్నప్పుడు కంపెనీ కష్టకాలంలో కొనసాగుతోంది. ఆర్థిక మాంద్యం దెబ్బతో కుదేలైన ఈ ఐటీ సంస్థను.. చంద్రశేఖరన్ తన నాయకత్వంలో ఆర్థిక విపత్తు నుంచి బయటపడేశారు. కంపెనీ ఆదాయన్ని భారీగా పెంచడంలో విశేష కృషి అందించారు. ఆయన నాయకత్వంలో కంపెనీ వార్షిక ఆదాయం 20 బిలియన్ డాలర్ల మార్క్‌ను అందుకుంది. దేశంలో అత్యంత విలువైన టెక్ కంపెనీగా అవతరించింది.

రెండుసార్లు ఛైర్మన్‌గా..

సైరస్ మిస్త్రీ–టాటాల వివాదం తర్వాత.. టాటా గ్రూప్ పలు సవాళ్లను ఎదుర్కొంది. ఆ సమయంలో టాటా సన్స్ ఛైర్మన్ పగ్గాలను అందుకున్నారు చంద్రశేఖరన్. 2016 అక్టోబరులో టాటా సన్స్ బోర్డులో చేరిన ఆయన.. 2017లో ఛైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించారు. టాటా కుటుంబం నుంచి కాకుండా.. ఈ పదవి చేపట్టిన తొలి వ్యక్తి, పార్సీయేతర వ్యక్తిగా నిలిచారు. ఆయన సమర్థవంతమైన నాయకత్వాన్ని గుర్తించి.. 2022లో రెండో దఫా కూడా ఛైర్మన్ బాధ్యతల్లో కొనసాగించారు. దివంగత పారిశ్రామికవేత్త రతన్ టాటాకు చంద్రశేఖరన్ అత్యంత సన్నిహితుడు.

**ఎయిరిండియాను తీసుకొచ్చి..**

చంద్రశేఖరన్ హయాంలో టాటా గ్రూప్ కొత్త వ్యాపారాల్లోకి అడుగుపెట్టింది. సెమీకండక్టర్ తయారీ, టాటా డిజిటల్ ఓమ్ని ఛానల్ ప్లాట్‌ఫాం టాటా న్యూ ప్రారంభంతో పాటు ఎలక్ట్రానిక్స్, నిత్యావసరాలు, ఫార్మసీ, ఫ్యాషన్ సంస్థల కొనుగోళ్లను చేపట్టారు. ఆయన నాయకత్వంలో గుర్తుండిపోయే ఘట్టం.. ఎయిరిండియాను ప్రభుత్వం నుంచి మళ్లీ టాటాల చేతుల్లోకి తీసుకురావడం. ఇందులో ఆయన కీలక పాత్ర పోషించారు. 2022లో ఈ ప్రక్రియ పూర్తయిన తర్వాత.. ఎయిరిండియా–విస్తారాను విలీనం చేసి ఏవియేషన్ రంగంలో కంపెనీని మరింత విస్తరించారు. చంద్రశేఖరన్ నేతృత్వంలో టాటా గ్రూప్ ఆదాయం రెండింతల వరకు పెరగ్గా.. నికర లాభం, మార్కెట్ విలువ మూడింతలకు పైగా పెరగడం విశేషం.

# ఆరుగురు యువకులు.. రూ.1.87 లక్షలు

### టెక్ కథ మార్చిన 'హెచ్‌సీఎల్' స్టోరీ ఇది..!

**వాషింగ్టన్:** సరిగ్గా 50 ఏళ్ల క్రితం ఆరుగురు యువకులు తమ కలలకు రెక్కలు తొడి గారు. ఆర్థిక కష్టాలను పక్కనబెట్టి.. ఉన్న ఉద్యోగాన్ని వదిలి ఓ కొత్త అధ్యా యానికి నాంది పలికారు. భారత టెక్ రంగంలో పెను మార్పు తీసుకొచ్చారు. నాడు వారు పెట్టిన ఆ చిన్న కంపెనీయే నేడు అంతర్జాతీయ ఐటీ దిగ్గజాల్లో ఒకటిగా నిలిచింది. అదే 'హెచ్‌సీఎల్ ఈ కంపెనీ గోల్డెన్ జూబ్లీ సందర్భంగా సహ వ్యవస్థాపకుడు అజయ్ చౌధరీ తన 'ఎక్స్' ఖాతాలో ఆసక్తికర పోస్ట్ చేశా రు. 'హెచ్‌సీఎల్' పుట్టుకను గుర్తుచేసుకున్నారు. అది ఆయన మాట ల్లోనే.. "అది 1976.. మన దేశంలో స్టార్టప్‌లు అనేవి అంతగా ప్రాచుర్యంలో లేని రోజులవి. వెంచర్ క్యాపిటల్ ఉనికే లేదు. ఇక కంప్యూటర్ల విషయా నికొస్తే..? చాలామంది నాటికి కనీసం ఈ పేరు కూడా విని ఉండరు. అలాం టి రోజుల్లో కేవలం ఒక ఆలోచన చూసి, ఎలాంటి పూచీకత్తు లేకుండా ఉన్న ఆరుగురు యువకులకు అప్పు ఇవ్వడానికి బ్యాంకులు ముందుకొస్తాయా? కానీ, ఇవేవీ మమ్మల్ని ఆపలేదు. మైక్రోప్రాసెసర్లు ఈ ప్రపంచాన్ని మార్చే స్థాయని మేం బలంగా విశ్వసించాం. అందుకే నాతో పాటు శివ్ నాడార్, అర్జున్ మల్హోత్రా, యోగేశ్ వైద్య, సుభాశ్ అరోరా, డీఎస్ పురి కలిసి సాహ సం చేశాం." "చేస్తున్న ఉద్యోగాలు వదిలేశాం. అప్పు చేసి కొంత, సేవింగ్స్ నుంచి కొంత.. అలా మొత్తంగా రూ.1.87లక్షలు సమకూర్చుకున్నాం. ఓ కారు కూడా అమ్మాల్సి వచ్చింది. ఈ డబ్బుతో దిల్లీలోని గోల్ఫ్ లింక్‌లో ఓ చిన్న ఆఫీసు తెరిచాం. అప్పుడు మా అందరి లక్ష్యం ఒక్కటే.. భారతీయ కంప్యూటర్‌ను తయారు చేయాలని స్థిరంగా అనుకున్నాం. కానీ, అక్కడే ఓ సమస్య ఎదురైంది. మాకు తయారీ లైసెన్స్ లేదు. దీంతో యూపీ ఎలక్ట్రానిక్స్ కార్పొరేషన్‌తో జట్టు కట్టాం. వారికి లైసెన్స్ ఉంది. మా దగ్గర టెక్నాలజీ ఉంది. అలా ఈ భాగస్వామ్యంతో 'హిందుస్థాన్ కంప్యూటర్స్ లిమిటెడ్ – హెచ్‌సీఎల్' ఆవిర్భవించింది" "అక్కడితో అయిపోలేదు.. అప్పుడే అసలు కథ మొదలైంది. మేం బ్రోచర్, నమూనా కంప్యూటర్ మెషిన్‌ను తయారు చేశాం. మా ఉత్పత్తులను అమ్మేందుకు, పెట్టుబడులు సమకూర్చేందుకు మా సేల్స్ బృందం దేశమంతా తిరిగింది. ప్రతి వ్యాపార సంస్థ తలుపూ తట్టింది. చివరకు ఐఐటీ ఖరగ్‌పూర్, ఐఐటీ మద్రాస్ నుంచి తొలి ఆర్డర్లు వచ్చాయి. ఆ తర్వాత ఆర్డర్లు పెరుగుతూనే ఉన్నాయి. దీంతో కొత్త ఉద్యోగులను నియమించుకున్నాం. సాంకేతికత భయపెట్టేదిగా కాకుండా.. ఉపయోగకరంగా, అందరికీ అందుబాటులో ఉండేలా చేయాలని మేం విశ్వసించాం. ఇప్పటికీ అదే సిద్ధాంతంతో కొనసాగుతున్నాం" "50ఏళ్ల తర్వాత ఇప్పుడు వెనుదిరిగి చూస్తే చాలా ఆశ్చర్యంగా అనిపిస్తుంది. ఆరుగురు సామాన్య యువకులకు వచ్చిన వినూత్న ఆలోచన.. సాంకేతిక రంగాన్ని మార్చిందంటే ఇప్పటికీ నమ్మలేకపోతున్నా. తొలి స్వదేశీ కంప్యూటర్ల తయారీ నుంచి.. నాలుగేళ్లలోనే సింగపూర్‌కు వ్యాపారాన్ని విస్తరించే స్థాయికి చేరుకున్నాం. దిల్లీలోని ఓ చిన్న గది నుంచి మొదలైన మా సంస్థ ప్రయాణం.. ప్రపంచ స్థాయి టెక్ కంపెనీగా ఎదిగింది. ఇప్పుడు సాంకేతికత ఊహించనంత మారిపోవచ్చు.. కానీ మా స్ఫూర్తి మాత్రం అలాగే కొనసాగుతోంది. గొప్ప కలలు కనాలి.. సాహసం చేయాలి.. అన్నిటికంటే ముఖ్యంగా, ఉన్నత లక్ష్యాలను ఆశించాలి" అంటూ అజయ్ చౌధరీ ముగించారు.

# నేరాల నియంత్రణపై సీపీ సమీక్ష

- డ్రగ్స్ అక్రమ రవాణా, సైబర్ నేరాలపై విస్తృత అవగాహన
- రౌడీషీటర్లు, పాత నేరస్తులపై నిఘా
- రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు



**బోధన్, ఆగస్టు 12 (జనం సాక్షి):** నేరాల నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణకు పటిష్ట చర్యలు చేపట్టాలని జిల్లా పోలీసు కమిషనర్ సాయి చైతన్య అధికారులను ఆదేశించారు. బుధవారం కోటగిరి పోలీస్‌స్టేషన్‌లో బోధన్ డివిజన్ పోలీసు అధికారులతో సమీక్ష నిర్వహించారు. డ్రగ్స్, గంజాయి అక్రమ రవాణాపై ప్రత్యేక దాడులు నిర్వహించి, నిందితులపై పీడీ యాక్ట్ వంటి కఠిన చట్టాల కింద చర్యలు తీసుకోవాలని సూచించారు. సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు ఆన్‌లైన్ మోసాల బాధితులకు తక్షణ సహాయం అందించాలన్నారు. సోషల్ మీడియాలో అసత్య, రెచ్చగొట్టే ప్రచారాలపై కఠినంగా వ్యవహరించాలని తెలిపారు.

హత్యలు, హత్యాయత్నాలు, చోరీలు, మహిళలపై నేరాలు, సైబర్ మోసాలు, పేకాట, గుట్కా తదితర కేసుల పురోగతిని సమీక్షించారు. పెండింగ్ కేసులను త్వరగా పరిష్కరించి బాధితులకు న్యాయం అందించాలని, రౌడీషీటర్లు, పాత నేరస్తులు, బెయిల్‌పై ఉన్న వారిపై నిరంతర నిఘా పెట్టాలని ఆదేశించారు. రాత్రి పహారా, అనుమానాస్పద వ్యక్తులు, వాహనాల తనిఖీలను ముమ్మరం చేయాలని సూచించారు. మహిళల భద్రతకు షీ టీమ్స్, ఈగల్ టీమ్స్, చీతా ఫోర్స్ మరింత సమర్థంగా పనిచేయాలని, విద్యాసంస్థలు, బస్టాండ్లు, రైల్వే స్టేషన్లలో నిఘా పెంచాలని తెలిపారు.

రోడ్డు ప్రమాదాల నివారణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సీపీ సూచించారు. బ్లాక్‌స్పాట్లను గుర్తించి సైన్‌బోర్డులు ఏర్పాటు చేయడంతో పాటు లింక్ రోడ్ల వద్ద స్పీడ్ బ్రేకర్లు, రోడ్లకు అడ్డుగా ఉన్న పొదల తొలగింపునకు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతిరోజూ డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహిస్తూ ఓవర్‌స్పీడ్, ట్రిపుల్ డ్రైవింగ్, మైనర్లు వాహనాలు నడపడంపై ప్రత్యేక నిఘా పెట్టాలని ఆదేశించారు. పండుగల నేపథ్యంలో బందోబస్తును పటిష్టం చేసి 24 గంటలూ వాహన తనిఖీలు నిర్వహించాలని సూచించారు. ప్రజలకు పోలీస్‌స్టేషన్లలో స్నేహపూర్వక వాతావరణం కల్పించాలని, సీసీ కెమెరాలు, సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థంగా వినియోగించాలని అన్నారు. సమావేశంలో బోధన్ ఏసీపీ పి. శ్రీనివాస్, సీసీఆర్బీ ఏసీపీ గురునాయుడు, ఇన్‌స్పెక్టర్ ఆర్. అంజయ్య, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ శ్రీధర్‌రెడ్డి, సీఐలు, ఎస్‌హెచ్‌వోలు, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

# విద్యార్థుల భవిష్యత్ ఉపాధ్యాయుల చేతుల్లోనే

**విద్యార్థుల నమోదు పెంచాలి : అదనపు కలెక్టర్ డాక్టర్ కిరణ్మయి**



**రంగారెడ్డి,ఆగస్టు 12(జనంసాక్షి) :** జిల్లాలో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు శాతాన్ని మరింత పెంచడంతో పాటు విద్యా ప్రమాణాల మెరుగుదలకు సమన్వయంతో పనిచేయాలని అదనపు కలెక్టర్ శ్రీమతి డాక్టర్ కిరణ్మయి విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. బుధవారం జిల్లా ఐడిఓసీ భవనంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో విద్యా అంశాలపై జిల్లా స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. జిల్లాలోని విద్యాధికారులు, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు, సిఆర్పి, జిల్లా విద్యాశాఖ కోఆర్డినేటర్లు పాల్గొన్న ఈ సమావేశంలో పలు అంశాలపై సమీక్షించారు. మండలాల వారీగా విద్యాశాఖ కార్యక్రమాల అమలు, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు, పాఠశాలల పనితీరు, విద్యార్థుల హాజరు, విద్యా ప్రమాణాల మెరుగుదల, క్షేత్రస్థాయి పర్యవేక్షణ తదితర అంశాలపై సమగ్రంగా సమీక్షించారు. ప్రతి మండలంలోని పరిస్థితులను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర అత్యంత గొప్పదని పేర్కొన్నారు. విద్యార్థులకు కేవలం పాఠ్యాంశాల బోధనకే పరిమితం కాకుండా, వారిలో క్రమశిక్షణ, నైతిక విలువలు, బాధ్యతాయుతమైన పౌరసత్వ భావనను పెంపొందించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు మరింత పెంచేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని తెలిపారు. ప్రతి అర్హత కలిగిన విద్యార్థి పాఠశాలలో చేరేలా తల్లిదండ్రులకు ప్రభుత్వ పాఠశాలల్లో అందుతున్న విద్య, మౌలిక వసతులు, వివిధ ప్రభుత్వ సదుపాయాలపై విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు. విద్యార్థుల నమోదు పెంపుతో పాటు వారు క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను మెరుగుపరచడం, విద్యా ప్రమాణాలను పెంపొందించడం ప్రతి ఉపాధ్యాయుడి ప్రధాన బాధ్యతగా భావించాలని సూచించారు. పాఠశాలల స్థితిగతులను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ అవసరమైన సమస్యలను వెంటనే గుర్తించి పరిష్కరించేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు.

స్టేట్ టాస్ డైరెక్టర్ శ్రీ లింగయ్య మాట్లాడుతూ.. కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు, ఎంఈఓలు క్షేత్రస్థాయిలో పాఠశాలలను క్రమం తప్పకుండా సందర్శించాలని సూచించారు. పాఠశాలల్లో వాస్తవ పరిస్థితులను ప్రత్యక్షంగా పరిశీలించి, ఉపాధ్యాయులు, విద్యార్థులతో మాట్లాడి అవసరమైన సూచనలు, మార్గదర్శకాలు అందించాలని తెలిపారు. క్షేత్రస్థాయి పర్యవేక్షణ నిరంతరం కొనసాగినప్పుడే విద్యాశాఖ కార్యక్రమాల అమలులో ఆశించిన ఫలితాలు సాధ్యమవుతాయని ఆయన పేర్కొన్నారు. విద్యార్థుల నమోదు, హాజరు, అభ్యసన ఫలితాలు తదితర అంశాలపై నిరంతరం దృష్టి సారించి అవసరమైన చర్యలు చేపట్టాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

# సీఎం రేవంత్ రెడ్డిని విమర్శిస్తే కేటీఆర్‌ను తాట తీస్తాం

**టిపిసిసి ప్రధాన కార్యదర్శి గజ్జల కాంతం**



**శామీర్ పేట, ఆగస్టు 12(జనం సాక్షి) :** తెలంగాణను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్న సీఎం రేవంత్ రెడ్డిని కేటీఆర్ పనిగట్టుకొని లేని పోని విమర్శలు చేస్తే తరిమి తరిమి కొడ్తామని తెలంగాణ పిసిసి ప్రధాన కార్యదర్శి గజ్జల కాంతం హెచ్చరించారు. బుధవారం తుంకుంట లోని మొగుళ్ళ వెంకట్ రెడ్డి ఫంక్షన్ హాలులో మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తోటకూర వజ్రేష్ యాదవ్ ఆధ్వర్యంలో మీడియా సమావేశానికి ముఖ్య అతిధులుగా టిపిసిసి ప్రధాన కార్యదర్శి గజ్జల కాంతం, అతిధులుగా మాజీ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి, రాష్ట్ర నాయకులు హరివర్ధన్ రెడ్డి, మహిపాల్ రెడ్డిలు విచ్చేశారు. ఈ సందర్భంగా కాంతం మాట్లాడుతూ.. గత 10 ఏండ్లల్లో బిఆర్ఎస్ పార్టీ అభివృద్ధి పేరుతో కెసిఆర్, కేటీఆర్, హరీష్ రావులు వేల ఎకరాలు దోచుకొని ప్రభుత్వాన్ని అప్పుల కుప్పగా తయారు చేశారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చినంకా సీఎం రేవంత్ రెడ్డి అహర్నిశలు ప్రజల శ్రేయస్సు కొరకు ప్రభుత్వంను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తుంటే కేటీఆర్ ఓర్వలేక నిందలు వేస్తున్నాడని విమర్శించారు.ఇంకా 10 ఏండ్లు కాంగ్రెస్ ప్రభుత్వం ఉంటుందని, బిఆర్ఎస్ పార్టీకి పుట్టగతులుండవని అన్నారు. అనంతరం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తోటకూర వజ్రేష్ యాదవ్ మాట్లాడుతూ..కేటీఆర్ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కించపరిస్తే తాట తీస్తామని హెచ్చరించారు. మేడ్చల్ నియోజకవర్గంలోని శామీర్పేట్ డివిజన్ కమిటీలు, కమిటీ లోని అన్ని అనుబంధ సంఘాల అధ్యక్షులకు పేర్ల సేకరణలో భాగంగా సమావేశం నిర్వహించారు. ఈ కార్య క్రమంలో జిల్లా ఆర్ టి ఏ మెంబర్ జైపాల్ రెడ్డి,జిల్లా గ్రంధాలయం చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి,300 డివిజన్ అధ్యక్షులు నక్క సందీప్ గౌడ్,రవీందర్ గౌడ్, కాంగ్రెస్ కమిటీ సభ్యులు, బ్లాక్ అధ్యక్షులు, మహిళా కాంగ్రెస్, యూత్ కాంగ్రెస్, ఎన్ఎస్‌యుఐ అధ్యక్షులు పాల్గొన్నారు.

# భార్యను ఇటుకతో కొట్టి హత్య.. భర్తపై కేసు

**ఘట్‌కేసర్, ఆగస్టు 12 (జనం సాక్షి):** కుటుంబ కలహాలు, భార్యపై అనుమానంతో ఓ వ్యక్తి దారుణానికి పాల్పడ్డాడు. మద్యం మత్తులో భార్యపై సిమెంట్ ఇటుకతో దాడి చేసి హత్య చేసిన ఘటన ఘట్‌కేసర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ద్వారకానగర్‌లో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. వనపర్తి జిల్లా కిలగనూర్ మండలం సలకలపూర్ గ్రామానికి చెందిన మాధవి (37)కి 18 ఏళ్ల క్రితం కాత్రావత్ రాజు (44)తో వివాహమైంది. దంపతులు గత 15 ఏళ్లుగా ఘట్‌కేసర్‌లో నివాసముంటున్నారు. వీరికి ముగ్గురు పిల్లలు ఉన్నారు. గత మూడేళ్లుగా రాజు మద్యానికి బానిసై, భార్య ప్రవర్తనపై అనుమానం పెంచుకుని తరచూ ఆమెను శారీరకంగా, మానసికంగా వేధించేవాడని పోలీసులు తెలిపారు. పెద్దల సమక్షంలో పలుమార్లు పంచాయితీలు నిర్వహించి నచ్చజెప్పినా అతని ప్రవర్తనలో మార్పు రాలేదని పేర్కొన్నారు. ఈ క్రమంలో బుధవారం అర్ధరాత్రి మద్యం మత్తులో ఇంటికి వచ్చిన రాజు.. కుటుంబ సభ్యులు నిద్రించిన అనంతరం భార్య మాధవిపై సిమెంట్ ఇటుకతో దాడి చేశాడు. తీవ్రంగా గాయపడిన ఆమె స్పృహ కోల్పోవడంతో కుటుంబ సభ్యులు, స్థానికులు 108 అంబులెన్స్‌లో ఘట్‌కేసర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అయితే చికిత్సకు ముందే అర్ధరాత్రి ఒంటిగంటన్నర ప్రాంతంలో మాధవి మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతురాలి సోదరుడు ఇస్లావత్ మాన్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఘట్‌కేసర్ పోలీసులు రాజుపై హత్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలను పోలీసులు సేకరిస్తున్నారు.

# నిరుపేదల సొంతింటి కలకు శ్రీకారం

- నేడు ఇందిరమ్మ టవర్స్‌కు భూమిపూజ
- 5.87 ఎకరాల్లో నాలుగు టవర్ల నిర్మాణం
- తొలి దశలో 480, రెండో దశలో 680 ఇళ్లు
- భారీగా తరలిరావాలని అరికెపూడి గాంధీ పిలుపు



**శేరిలింగంపల్లి, ఆగస్టు 12 (జనంసాక్షి):** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గురువారం శేరిలింగంపల్లి నియోజకవర్గంలో ఇందిరమ్మ టవర్స్ నిర్మాణానికి భూమిపూజ చేయనున్న నేపథ్యంలో ప్రజలు, నాయకులు, కార్యకర్తలు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆరికెపూడి గాంధీ పిలుపునిచ్చారు. బుధవారం కేపీహెచ్‌బీ 7, 9వ ఫేజ్‌ల మధ్య గోకుల్ ఫ్లాట్స్ సమీపంలోని 5.87 ఎకరాల ప్రభుత్వ స్థలంలో చేపట్టనున్న నిర్మాణ పనుల సభా ప్రాంగణ ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. నిరుపేదల కోసం సుమారు రూ.43.20 కోట్ల అంచనా వ్యయంతో నాలుగు ఇందిరమ్మ టవర్లను నిర్మించనున్నట్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఏడాదిలో లక్ష ఇళ్ల నిర్మాణమే ప్రభుత్వ లక్ష్యమని, అర్హులైన పేదలకు పారదర్శకంగా లక్కీడిప్ ద్వారా ఇళ్లను కేటాయించి ఏడాదిలోనే గృహప్రవేశాలు జరిగేలా ప్రణాళిక రూపొందిస్తున్నట్లు చెప్పారు. శేరిలింగంపల్లి నియోజకవర్గంలో ముఖ్యమంత్రి చేతుల మీదుగా ఇందిరమ్మ టవర్లకు భూమిపూజ జరగడం ఇల్లు లేని నిరుపేదలకు గొప్ప అవకాశమన్నారు. రాష్ట్ర గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి సహకారంతో ప్రాజెక్టును వేగంగా పూర్తి చేస్తామని పేర్కొన్నారు. తొలి దశలో 480, రెండో దశలో 680 ఇళ్లను నిర్మించనున్నట్లు వివరించారు. ఒక్కో టవర్‌లో 120 ఫ్లాట్లు, ఒక్కో అంతస్తులో 12 ఫ్లాట్లు ఉండేలా నిర్మాణం చేపట్టనున్నట్లు తెలిపారు.

ఒక్కో ఇంటి విస్తీర్ణం సుమారు 525 చదరపు అడుగులు ఉండటంతో పాటు బెడ్‌రూమ్, హాల్, కిచెన్ వంటి సౌకర్యాలు ఉంటాయని చెప్పారు. లబ్ధిదారుడి పేరుతో అన్‌డివైడెడ్ షేర్ కింద సుమారు 20 నుంచి 25 గజాల స్థలాన్ని రిజిస్ట్రేషన్ చేయనున్నట్లు గాంధీ తెలిపారు. హైదరాబాద్‌లో సొంతింటి కోసం ఎదురుచూస్తున్న నిరుపేద, మధ్యతరగతి కుటుంబాల కలను సాకారం చేసే దిశగా ఇందిరమ్మ టవర్స్ నిర్మాణం కీలక అడుగు అని పేర్కొన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కమ్మ సంఘం కార్పొరేషన్ చైర్మన్ బండి రమేష్, యాదవ కో-ఆపరేటివ్ చైర్మన్ రఘునాథ్ యాదవ్, కూకట్‌పల్లి డీసీపీ రితిరాజ్, శేరిలింగంపల్లి నియోజకవర్గ సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# డీఈఓ కార్యాలయంలో అవినీతి తిమింగలాలు

- అర్హత సర్టిఫికెట్లు మాయం.. పోస్టు మాత్రం వేరొకరికి
- ఫైళ్లలో చేతివాటం పోస్టుల్లో అక్రమాలు సర్టిఫికెట్లు గల్లంతుడీఈఓ ఆఫీస్‌లో కలకలం
- మాదవి ఫిర్యాదుతో వెలుగులోకి వచ్చిన వ్యవహారం
- పూర్తిస్థాయి విచారణకు డీఈఓ హామీ

**వికారాబాద్ జిల్లా బ్యూరో ఆగస్టు 12 (జనంసాక్షి):** తెలంగాణ ప్రభుత్వ పాఠశాలల్లో కొత్తగా మంజూరైన ప్రీ,ప్రైమరీ తరగతులకు బోధించేందుకు అర్హులైన అభ్యర్థులను ఔట్‌సోర్సింగ్ విధానంలో నియమించేందుకు రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు వికారాబాద్ జిల్లా విద్యాశాఖ అధికారులు దరఖాస్తులను అర్హులైన వారి నుండి అప్లికేషన్లు స్వీకరించారు. అయితే నియామక ప్రక్రియలో న్యాయబద్ధంగా జరగకుండా చేతివాటం చూపించారని విమర్శలు వెలివేత్తాయి. వివరాల్లోకి వెళితే,మోమిన్‌పేట్ మండలం ఎంకేపల్లి గ్రామానికి చెందిన కావలి మాదవి ప్రీ,ప్రైమరీ ఔట్‌సోర్సింగ్ పోస్టు కోసం దరఖాస్తు చేసుకున్నారు. తన విద్యార్హతలకు సంబంధించిన ధ్రువపత్రాలను దరఖాస్తుతో పాటు సమర్పించినట్లు ఆమె తెలిపారు. అయితే ఎంపిక ప్రక్రియ లో తనకంటే తక్కువ మార్కులు సాధించిన మరో అభ్యర్థికి పోస్టు కేటాయించారని మాదవి ఆరోపిస్తున్నారు.

**అధికారుల ఆదేశాల ప్రకారం**

దరఖాస్తులో తాను సమర్పించిన కొన్ని అర్హత ధ్రువపత్రాలు ఫైల్‌లో కనిపించకుండా పోయాయని మాదవి ఆరోపించారు. వాటిని తొలగించి తనను అర్హత లేని అభ్యర్థిగా చూపించే ప్రయత్నం జరిగిందని ఆమె వాపోయారు. తనకంటే తక్కువ మార్కులు ఉన్న అభ్యర్థికి అవకాశం ఇచ్చినప్పుడు, తనకు ఎందుకు పోస్టు ఇవ్వలేదని ఆమె ప్రశ్నించారు.ఈ విషయంపై బుధవారం జిల్లా విద్యాశాఖ కార్యాలయానికి చేరుకున్న మాదవి సంబంధిత అధికారులను నిలదీశారు. తన దరఖాస్తును మరోసారి పరిశీలించాలని కోరారు. దరఖాస్తును తిరిగి పరిశీలించే క్రమంలో ఆమెకు సంబంధించిన కొన్ని ధ్రువపత్రాలు లభించడంతో, అసలు అవి ఫైల్ నుంచి ఎలా తొలగించబడ్డాయన్న అంశం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. ఒక అభ్యర్థి దరఖాస్తులో సమర్పించిన ధ్రువపత్రాలు ఫైల్‌లో లేకపోవడం, అనంతరం పరిశీలనలో అవే పత్రాలు లభించడం పలు అనుమానాలకు తావిస్తోంది. దరఖాస్తుల పరిశీలన సమయం లో ఎవరు బాధ్యత వహించారు. అనే విషయం తెలియాల్సి ఉంది. సర్టిఫికెట్లను ఎవరు పరిశీలించారు. .

**-జిల్లా వ్యాప్తంగా ఎన్ని పోస్టులు,**

వికారాబాద్ జిల్లా వ్యాప్తంగా ప్రీ-ప్రైమరీకి ఎన్ని పోస్టులు మంజూరయ్యాయి. మండలాల వారీగా ఎన్ని పోస్టులు ఉన్నాయి. ఒక్కో పోస్టుకు ఎంతమంది దరఖాస్తు చేసుకున్నారు అభ్యర్థుల మెరిట్ జాబితా లో ఎంపికకు ఏ నిబంధనలు పాటించారు అనే వివరాలను అధికారులు వెల్లడించలేదు.





**పోస్టులు అమ్ముకున్నారన్న ఆరోపణలు**

జిల్లాలో ప్రీ,ప్రైమరీ పోస్టుల కేటాయింపులో డబ్బులు చేతులు మారాయంటూ కొందరి నుంచి ఆరోపణలు వినిపిస్తున్నాయి.

అయితే ఈ ఆరోపణలకు సంబంధించి ఇప్పటివరకు అధికారికంగా ఎలాంటి ఆధారాలు వెల్లడికాలేదు. అయినప్పటికీ, నియామక ప్రక్రియలో పారదర్శకత కోసం ప్రతి అభ్యర్థి మార్కులు, అర్హతలు, ఎంపికకు సంబంధించిన పూర్తి వివరాలను బహిర్గతం చేయాలని అభ్యర్థులు డిమాండ్ చేస్తున్నారు.

**మళ్లీ పూర్తి స్థాయిలో విచారణ డీఈవో అబ్దుల్**

మాదవి చేసిన ఫిర్యాదుపై స్పందించిన జిల్లా విద్యాశాఖ అధికారి అబ్దుల్ ఘని, ప్రీ-ప్రైమరీ నియామక ప్రక్రియకు సంబంధించి మళ్లీ పూర్తి స్థాయిలో విచారణ చేపడతామని తెలిపారు. అర్హత కలిగిన అభ్యర్థులు, ఎక్కువ మార్కులు సాధించిన వారికే నిబంధనల ప్రకారం పోస్టులు కేటాయిస్తామని స్పష్టం చేశారు.



# గంజాయి అక్రమ రవాణా ఆగేనా?

## తాండూరులో 52.08 కిలోల గంజాయి పట్టివేత

- ముగ్గురు అరెస్టు.. రూ.13.20 లక్షల సరుకు స్వాధీనం
- ప్రధాన సూత్రధారులపై కొనసాగుతున్న అన్వేషణ
- అక్రమ రవాణా, విక్రయాలపై కఠిన చర్యలు: అధికారులు

**వికారాబాద్ జిల్లా బ్యూరో, ఆగస్టు 12 (జనం సాక్షి):**


వికారాబాద్ జిల్లాలో గంజాయి అక్రమ రవాణాపై పోలీసులు, ఎక్సైజ్ అధికారులు నిఘా పెంచుతున్నప్పటికీ రవాణా కొనసాగుతుండటం ఆందోళన కలిగిస్తోంది. తాండూరు, వికారాబాద్, కొడంగల్ ప్రాంతాల మీదుగా ఇతర రాష్ట్రాల నుంచి గంజాయి తరలిస్తున్నట్లు వరుసగా పట్టుబడుతున్న ఘటనలు వెల్లడిస్తున్నా యి. తాజాగా తాండూరు రైల్వే స్టేషన్ ద్విచక్ర వాహనాల పార్కింగ్ వద్ద ముగ్గురు వ్యక్తుల నుంచి 52.08 కిలోల ఎండు గంజాయిని అధికారులు స్వాధీనం చేసుకున్నారు.

అధికారుల వివరాల ప్రకారం.. నమ్మదగిన సమాచారం మేరకు డీటీఎఫ్ వికారాబాద్, ఎస్‌టీఎఫ్, ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాలు సోమవారం రాత్రి తాండూరు రైల్వే స్టేషన్ వద్ద తనిఖీలు నిర్వహించాయి. అనుమానాస్పదంగా సంచరిస్తున్న మధు ప్రధాన్(34), శివ నాహక్(25), నీలు మండల్(22)ను ప్రశ్నించేందుకు ప్రయత్నించగా వారు పారిపోయేందుకు యత్నించారు. దీంతో వారిని అదుపులోకి తీసుకుని తనిఖీ చేయగా నాలుగు లగేజీ సూట్‌కేసుల్లో 52.08 కిలోల ఎండు గంజాయి లభించింది. దీని విలువ సుమారు రూ.13.20 లక్షలు ఉంటుందని అధికారులు తెలిపారు. విచారణలో ఒడిశాలోని గంజాం జిల్లా నుంచి గంజాయిని తాండూరుకు తీసుకొచ్చి గుర్తుతెలియని వ్యక్తులకు అప్పగించేందుకు వచ్చినట్లు నిందితులు వెల్లడించినట్లు అధికారులు తెలిపారు. రవాణా చేసినందుకు ఒక్కొక్కరికి రూ.10 వేల చొప్పున చెల్లిస్తామని చెప్పినట్లు పేర్కొన్నారు. ముగ్గురిని అరెస్టు చేసి కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు చేపడుతున్నట్లు డీపీఈఓ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. గంజాయి రవాణా, విక్రయాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అయితే జిల్లాలో ఇప్పటివరకు పట్టుబడుతున్న వారిలో రవాణాకు ఉపయోగపడే వ్యక్తులే ఎక్కువగా ఉంటున్నారని, గంజాయి సరఫరా వెనుక ఉన్న ప్రధాన వ్యక్తులు, స్థానికంగా విక్రయించే ముఠాలపై పూర్తిస్థాయి చర్యలు అవసరమనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. యువత, విద్యార్థులను మత్తుకు దూరంగా ఉంచేందుకు గంజాయి మూలాలను గుర్తించి సరఫరా వ్యవస్థను ఛేదించాల్సిన అవసరం ఉందని పలువురు కోరుతున్నారు. గంజాయి విక్రయాలు, రవాణాకు సంబంధించిన సమాచారం ఉంటే 8712658754 నంబర్‌కు తెలియజేయాలని అధికారులు సూచించారు.



**యువతపై తీవ్ర ప్రభావం**

మత్తుకు అలవాటుపడ్డ యువతపై గంజాయి తీవ్ర ప్రభావాన్ని చెబుతుంది. ఎండు గంజాయిని పొట్లాలు చాక్లెట్లుగా తయారుచేసి గుర్తుచప్పుడు కాకుండా వికారాబాద్ తాండూర్ కొడంగల్ ప్రాంతాల్లో విక్రయిస్తున్నారు. అనేక సార్లు పట్టుబడిన సందర్భాలు ఉన్నాయి. కొందరు ఒక్కదగ్గర పోగై గంజాయి తాగుతున్నట్లు కొన్ని ప్రాంతాలను గుర్తించి పోలీసులు రాత్రి పగలు మెరుపు దాడులు చేస్తున్నారు. వారి దాడుల్లో కూలి పని జూలైలుగా తిరిగే యువకులు కాలేజీలకు వెళ్లే కొందరు గంజాయి కి బానిసై పట్టుబడుతున్నారు. కానీ గంజాయిని ఈ ప్రాంతానికి తరలించి ఎవరి ప్రమేయంతో అమ్ముతున్నారన్నది పోలీసులు గుర్తించలేకపోయారు. స్థానికుల ప్రమేయం ఉంటే తప్ప కిలలో కొద్దీ గంజాయి ముఖ్యమైన పట్టణాలలో అమ్మకాలు జరగవు. మత్తుకు అలవాటు పడ్డ వారిని గుర్తించి మరి రహస్యంగా వారికి గంజాయి అందజేసి సొమ్ము చేసుకుంటున్నారు. పట్టుబడిన గంజాయి కిలోల కొద్ది పోగు చేస్తే అది ఇప్పుడు కొన్ని క్వింటాళ్ల వరకు చేరింది. గంజాయి పట్టుబడినప్పుడు హడావుడి చేయడం తప్ప పూర్తిస్థాయిలో అధికారులు దృష్టి సారించడం లేదనే విమర్శలు వస్తున్నాయి. అధికార యంత్రం ఇప్పటికైనా గంజాయి రవాణా చేసే ప్రధాన నిందితులను రవాణా జరగడానికి ఉపయోగపడే మూలాలను గుర్తించి కఠిన చర్యలు చేపట్టాలని కోరుకుందాం..



# పోలీస్ వాహనాలను తనిఖీ చేసిన సీపీ

గోదావరిఖని, జనంసాక్షి : రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని పెద్దపల్లి, మంచిర్యాల జోన్ల పోలీస్ స్టేషన్లకు చెందిన పోలీస్ వాహనాల పనితీరు, నిర్వహణను రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా కమిషనరేట్ ప్రధాన కార్యాలయంలో పరిశీలించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ పెద్దపల్లి,మంచిర్యాల జోన్ల పరిధిలోని పోలీస్ స్టేషన్లకు చెందిన వాహనాలు నిరంతరం అందుబాటులో ఉండేలా,ప్రజలకు అందించే సేవలకు ఎలాంటి ఆటంకం కలగకుండా సక్రమంగా నిర్వహించాలని సూచించారు. వాహనాల్లోని సమాచార ప్రసార పరికరాల పనితీరును పరిశీలించారు.అదేవిధంగా ప్రతి పోలీస్ వాహనంలో ప్రథమ చికిత్స పెట్టె, అత్యవసర దీపం, తాళు ,,ట్రాఫిక్ కోన్లు, నేరస్థల రక్షణ రిబ్బన్లు, రక్షణ సామగ్రి కిట్‌లో భాగంగా హెల్మెట్, రాళ్ల దాడి నుంచి రక్షణ కవచం,లాఠీ, శరీర రక్షణ కవచం, ప్రతిఫలించే భద్రతా జాకెట్లు తప్పనిసరిగా అందుబాటులో ఉండేలా చూడాలని ఆదేశించారు.వాహనాల నిర్వహణలో లోటుపాట్లను ఎప్పటికప్పుడు గుర్తించి సరిదిద్దాలని, వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేసి సమగ్ర నివేదికను ప్రతి నెలా సమర్పించాలని మోటారు వాహనాల అధికారులను ఆదేశించారు.పోలీస్ వాహనాలపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ వాటిని ఎల్లప్పుడూ మంచి స్థితిలో ఉంచాలని వాహన డ్రైవర్లకు సూచించారు.పోలీస్ అధికారుల ఆధీనంలో ఉన్న వాహనాలను సొంత వాహనాల మాదిరిగా జాగ్రత్తగా నిర్వహించాలని, నిర్ణీత వ్యవధిలో వాహనాల మరమ్మతులు, ఇంజిన్ నూనె మార్పు, టైర్ల నిర్వహణ తదితర అంశాల్లో నాణ్యతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని తెలిపారు. వాహనాల నిర్వహణపై డ్రైవర్లకు ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహించి, వాహనాల పనితీరు, భద్రతా ప్రమాణాలపై వారికి అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు.

# చెట్టు క్రింద కూర్చున్న వారిపై పిడుగు మహిళ మృతి

**బొంరాస్ పేట, ఆగస్టు 12 (జనం సాక్షి):** మండల పరిధిలోని టేకులగడ్డ తండాకు చెందిన కేతావత్ లల్లిబాయి(33) పిడుగుపాటుకు గురై మృతి చెందిన సంఘటన బుధవారం చోటు చేసుకోవడంతో విషాదఛాయలు అలముకున్నాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం తాండాకు చెందిన ఓ రైతు వ్యవసాయ పొలంలో వరి నాటు వేస్తుండగా ఒక్కసారిగా ఉరుములు,మెరుపులు రావడంతో సమీపంలోని చెట్టు కిందకు వెళ్లారు. ఒక్కసారిగా పిడుగు చెట్టుపై పడడంతో లల్లి బాయి అక్కడికక్కడే మృతి చెందగా, మరో ఇద్దరూ భార్యాభర్తలు కిషన్ నాయక్, దేవిబాయికి గాయాలు కావడంతో ఆసుపత్రికి తరలించారు. మృతురాలికి ఒక బాబు, పాప ఉన్నారు.దీంతో కుటుంబంలో విషాదఛాయలు అమ్ముకున్నాయి. ఘటనతో ఉలికిపడ్డ తాండావాసులు భయాందోళనకు గురయ్యారు.

# జీఆర్ఎంబీ ఎజెండా నుంచి తెలంగాణ ప్రాజెక్టులను తొలగించాలి

## ఏపీ ప్రతిపాదనపై మాజీ ఎంపీ వినోద్‌కుమార్, ఎమ్మెల్యే గంగుల కమలాకర్ అభ్యంతరం

- తెలంగాణ ప్రయోజనాలకు విరుద్ధంగా ప్రాజెక్టుల అనుమతుల రద్దు
- సీఎం, నీటిపారుదల మంత్రి వైఖరి స్పష్టం చేయాలి
- స్పందించకపోతే రాష్ట్రవ్యాప్త ఆందోళనలు: బీఆర్ఎస్ హెచ్చరిక



**కరీంనగర్ టౌన్, ఆగస్టు 12 (జనం సాక్షి):** గోదావరి రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు (జీఆర్ఎంబీ) ఈ నెల 18న హైదరాబాద్‌లో నిర్వహించనున్న 18వ సమావేశం ఎజెండా నుంచి తెలంగాణకు సంబంధించిన ప్రాజెక్టుల అంశాలను వెంటనే తొలగించాలని మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ డిమాండ్ చేశారు. తెలంగాణలోని ఏడు ప్రాజెక్టుల అనుమతులను రద్దు చేయాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కేంద్రానికి ప్రతిపాదించడం, ఆ అంశాన్ని జీఆర్ఎంబీ సమావేశ ఎజెండాలో చేర్చడంపై వారు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. కరీంనగర్‌లోని గంగుల కమలాకర్ నివాసంలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు.

తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమం నీళ్లు, నిధులు, నియామకాల ప్రధాన డిమాండ్లతో సాగిందని వినోద్‌కుమార్, గంగుల కమలాకర్ గుర్తుచేశారు. తెలంగాణలో నిర్మించిన ప్రాజెక్టులు ఎలాంటి నిబంధనలు ఉల్లంఘించి చేపట్టినవి కావని, అప్పటి ప్రభుత్వం చట్టపరమైన ప్రక్రియలను పూర్తి చేసి, సంబంధిత అనుమతులతోనే వాటిని నిర్మించిందని తెలిపారు. ఇప్పటికే చట్టబద్ధంగా అనుమతులు పొందిన ప్రాజెక్టుల అనుమతులను రద్దు చేయాలని కోరడం తెలంగాణ ప్రయోజనాలకు తీవ్ర నష్టం కలిగించే చర్యగా అభివర్ణించారు. ఏపీ ప్రభుత్వం పంపిన ప్రతిపాదనను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

ప్రాజెక్టుల అనుమతుల రద్దు అంశాన్ని జీఆర్ఎంబీ సమావేశ ఎజెండాలో చేర్చడం వెనుక ఉద్దేశాన్ని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేయాలని వారు కోరారు. తెలంగాణ ప్రాజెక్టుల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి తన వైఖరిని ప్రజలకు తెలియజేయాలని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఈ అంశంపై మౌనం వీడి రాష్ట్ర ప్రయోజనాల పరిరక్షణకు చర్యలు చేపట్టాలని సూచించారు. రాష్ట్రానికి నష్టం కలిగించే ప్రతిపాదనలను అడ్డుకునేందుకు రాజకీయాలకు అతీతంగా కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని కోరారు.

తెలంగాణ నుంచి పార్లమెంట్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న బీజేపీ, కాంగ్రెస్ ఎంపీలపైనా వారు విమర్శలు చేశారు. రాష్ట్ర ప్రాజెక్టుల అనుమతుల రద్దుకు ప్రతిపాదనలు వచ్చినా ఎంపీలు ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రయోజనాలను కాపాడాల్సిన బాధ్యత ఎంపీలపై ఉందని, పార్లమెంట్ వేదికగా కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని ఎంపీలందరూ వెంటనే ఢిల్లీకి వెళ్లి ప్రధానమంత్రి నరేంద్ర మోదీని కలిసి తెలంగాణ ప్రాజెక్టుల అంశాన్ని వివరించాలని కోరారు. జీఆర్ఎంబీ ఎజెండా నుంచి ప్రాజెక్టుల అంశాన్ని తొలగించేలా కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని సూచించారు. తెలంగాణ ప్రాజెక్టుల అనుమతులు రద్దయ్యే పరిస్థితి ఏర్పడితే రాష్ట్రంలో సాగునీరు, తాగునీరు, వ్యవసాయ రంగాలపై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉందని నాయకులు హెచ్చరించారు. ముఖ్యంగా రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే స్పందించాలని కోరారు. ఈ నెల 18న జీఆర్ఎంబీ సమావేశం జరగనున్న నేపథ్యంలో అంతకుముందే తెలంగాణ ప్రాజెక్టులకు సంబంధించిన అంశాలను ఎజెండా నుంచి తొలగించాలని స్పష్టం చేశారు. ప్రభుత్వం స్పందించకపోతే బీఆర్ఎస్ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. అవసరమైతే ప్రజలను సమీకరించి పెద్ద ఎత్తున ఉద్యమం నిర్వహిస్తామని తెలిపారు. తెలంగాణ హక్కులు, నీటి వాటా, సాగునీటి ప్రాజెక్టుల పరిరక్షణ విషయంలో ఎలాంటి రాజీ ఉండదని వారు స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం అన్ని రాజకీయ పార్టీలు ఏకతాటిపైకి వచ్చి కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని కోరారు. సమావేశంలో మాజీ మంత్రి, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్, మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్‌తో పాటు పలువురు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# 'సర్కారు బడిని కాపాడుకుందాం'.. వీడియో ఆవిష్కరణ

- విద్య ప్రాధాన్యాన్ని చాటిచెప్పేలా రూపకల్పన
- గిరిజన బాలల చదువుపై ప్రత్యేక సందేశం
- విద్యే అభివృద్ధికి ఆయుధమనే ఇతివృత్తం
- వీడియోకు సంపూర్ణ సహకారం: మంత్రి అడ్లూరి



**కథలాపూర్, ఆగస్టు 12 (జనం సాక్షి):** ప్రభుత్వ పాఠశాలల ప్రాధాన్యాన్ని, విద్య విలువను చాటిచెప్పేలా రూపొందిస్తున్న 'సర్కారు బడిని కాపాడుకుందాం' వీడియో ఆల్బమ్ పోస్టర్‌ను సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ఆవిష్కరించారు. డైరెక్టర్ లింగంపల్లి నరేష్ ఆధ్వర్యంలో తెరకెక్కుతున్న ఈ వీడియోకు సంబంధించిన ఆడియోను మంత్రి విన్నారు. ఈ సందర్భంగా వీడియో ఆల్బమ్ రూపకల్పన, చిత్రీకరణకు తనవంతు సంపూర్ణ సహాయ సహకారాలు అందిస్తామని మంత్రి భరోసా ఇచ్చినట్లు నిర్వాహకులు తెలిపారు. ఆదివాసీ గిరిజన గూడేల్లో అడవిని నమ్ముకుని జీవిస్తున్న కుటుంబాల పిల్లలు విద్యకు దూరమవుతున్న పరిస్థితులను ప్రధాన ఇతివృత్తంగా తీసుకుని ఈ వీడియోను రూపొందిస్తున్నట్లు తెలిపారు. పలకా బలపం పట్టాల్సిన బాల్యం అడవిలో కాయకష్టం చేస్తూ బాల కార్మికులుగా మారుతున్న వాస్తవ పరిస్థితులను ఇందులో చూపించనున్నట్లు పేర్కొన్నారు. ఒక చిన్నారి తల్లి తన బిడ్డ చదువుకోవాలని పడే తపన, గూడెం ప్రజల నుంచి ఎదురయ్యే ఒత్తిళ్లను అధిగమించి విద్య కోసం బడిబాట పట్టే ప్రయత్నం వంటి అంశాలతో వీడియోను సందేశాత్మకంగా రూపొందిస్తున్నట్లు వివరించారు. అక్షరాస్యతతోనే గిరిజన ప్రాంతాల అభివృద్ధి సాధ్యమని, అజ్ఞానాన్ని తొలగించేందుకు విద్యే ప్రధాన ఆయుధమనే సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడమే 'సర్కారు బడి' లక్ష్యమని తెలిపారు.

'దర్వాజా ఫోక్ సాంగ్స్' యూట్యూబ్ ఛానల్ ఆధ్వర్యంలో రూపొందుతున్న ఈ వీడియోకు లింగంపల్లి నరేష్ దర్శకత్వం వహిస్తున్నారు. వడ్లకొండ గోవర్ధన్ సాహిత్యం అందించగా, లింగంపల్లి నరేష్ గానం చేస్తున్నారు. మదిరే కృష్ణ చైతన్య సంగీతం సమకూరుస్తున్నారు. జగిత్యాలకు చెందిన శ్రీ మహా రికార్డింగ్ స్టూడియోలో రికార్డింగ్ నిర్వహిస్తున్నారు. ఫ్లూటిస్ట్‌గా పోలస సంతోష్‌చారి, ప్రోగ్రామర్‌గా రాహుల్ ఆర్‌పి, పోస్టర్ రూపకల్పనలో మహేష్ వ్యవహరిస్తున్నారు.

ఈ కార్యక్రమంలో ధర్మపురి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు, నాగారం సర్పంచ్ చిలుముల లక్ష్మణ్, తక్కలపల్లి మాజీ సర్పంచ్ ములిగే శ్రీనివాస్, కథలాపూర్ మండల అంబేడ్కర్ సంఘాల అధ్యక్షుడు కలిగోట రాజయ్య, బాలే నీలకంఠం, శనిగారపు గణేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఆగమ శాస్త్ర నిబంధనల మేరకే రాజన్న ఆలయ అభివృద్ధి

- గర్భాలయం, మహామండపం యథాతథం.. శిఖరాన్ని నాలుగు అడుగులు పెంచే అంశంపై పరిశీలన
- అభివృద్ధి పనులకు శృంగేరి పీఠాధిపతుల సూచనలు
- భక్తులు అపోహలకు గురికావద్దన్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి, ఆగస్టు 12 (జనం సాక్షి):** వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయ అభివృద్ధి పనులు ఆగమ శాస్త్ర నిబంధనలు, భక్తుల మనోభావాలకు అనుగుణంగానే జరుగుతున్నాయని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ తెలిపారు. బుధవారం శృంగేరి పీఠాధిపతులు శ్రీ భారతి తీర్థ మహాస్వామి, శ్రీ విధుశేఖర భారతి స్వామివారిని ప్రభుత్వ విప్, అధికారులు, ఆలయ అర్చకుల బృందం కలిసి అభివృద్ధి పనులపై చర్చించింది. ఆలయ గర్భాలయం, మహామండపాన్ని తొలగించడం లేదా మార్చడం లేదని ఆది శ్రీనివాస్ స్పష్టం చేశారు. ఇటీవల సోషల్ మీడియాలో వస్తున్న ప్రచారంతో భక్తులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ప్రస్తుతం జరుగుతున్న పనులు సుమారు 55 శాతం పూర్తయ్యాయని, ఆలయ అభివృద్ధికి సుమారు రూ.250 కోట్ల నిధులు కేటాయించినట్లు తెలిపారు. శిఖరాన్ని శిలామయంగా నిర్మించి, భక్తులకు దూరం నుంచే దర్శనమయ్యేలా సుమారు నాలుగు అడుగుల మేర ఎత్తు పెంచే అంశాన్ని పరిశీలిస్తున్నామని చెప్పారు. దేవాదాయ కమిషనర్ హనుమంతరావు మాట్లాడుతూ గర్భాలయం, మహామండపం యథాతథంగా ఉంటాయని తెలిపారు. శృంగేరి పీఠాధిపతుల సూచనలు, ఆగమ శాస్త్ర నిబంధనలకు అనుగుణంగానే తదుపరి పనులు చేపడతామని వెల్లడించారు. నిర్మాణానికి ముందు భూమి బలం, స్థిరత్వాన్ని పరిశీలించాలని పీఠాధిపతులు సూచించినట్లు చెప్పారు. ఆలయ అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలని పీఠాధిపతులు సూచించినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో సీఎం కార్యాలయ ఓఎస్డీ వేముల శ్రీనివాస్, కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఈవో రమాదేవి, ఆలయ అర్చకులు తదితరులు పాల్గొన్నారు.



# దివ్యాంగుల సంక్షేమంపై కేంద్ర మంత్రితో ఎంపీ అర్వింద్ భేటీ

**నిజామాబాద్ జిల్లా ప్రతినిధి జనం సాక్షి:** నిజామాబాద్ ఎంపీ అర్వింద్ ధర్మపురి కేంద్ర సామాజిక న్యాయం, సాధికారత శాఖ మంత్రి డా. వీరేంద్ర కుమార్‌ను న్యూఢిల్లీలో కలిశారు. నియోజకవర్గంలోని దివ్యాంగుల సంక్షేమం, సాధికారతపై చేపట్టాల్సిన చర్యలపై చర్చించారు. దివ్యాంగుల సమస్యలు, సంక్షేమ పథకాలు, సహాయక పరికరాల పంపిణీ, ప్రభుత్వ సేవల సులభతపై ఎంపీ వివరించారు. వీల్‌చైర్లు, వినికిడి పరికరాలు, కృత్రిమ అవయవాల కోసం అంచనా శిబిరాలు విస్తరించాలని కోరారు. విద్య, ఉపాధి, నైపుణ్యాభివృద్ధి అవకాశాలు పెంచడంతో పాటు ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థలు, ప్రజా ప్రదేశాల్లో అందుబాటు సౌకర్యాలు మెరుగుపరచాలని విజ్ఞప్తి చేశారు. నియోజకవర్గంలో కేంద్ర పథకాలు అర్హులందరికీ చేరేలా పనిచేస్తున్నామని ఎంపీ తెలిపారు. సహకారానికి కేంద్ర మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. ఎంపీ విజ్ఞప్తులపై కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందిస్తూ దివ్యాంగుల సంక్షేమానికి అవసరమైన పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు.

# బొక్కుల వాగులో గొర్రెల కాపరి గల్లంతు, మృతి



**మంథని, ఆగస్టు 12, (జనంసాక్షి) :** పెద్దపల్లి జిల్లా మంథని మున్సిపల్ పరిధిలోని బోయిన్‌పేట లో విషాదం చోటుచేసుకుంది. గొర్రెల కాపరి పర్వావేన రాజు(47) తన కుమార్తె అలేఖ్య(21)తో కలిసి బొక్కుల వాగు వద్ద గొర్రెలను దాటిస్తుండగా కాలు జారి నీటిలో పడిపోయాడు. తండ్రిని కాపాడేందుకు అలేఖ్య కూడా నీటిలోకి దూకడంతో ఆమె కూడా కొట్టుకుపోసాగింది. స్థానికులైన అంకం శేఖర్, ఆకుల అరవింద్ ఆమె కేకలు విని వెంటనే రక్షించి ప్రథమ చికిత్స అందించారు. అలేఖ్య స్పృహలోకి వచ్చాక తండ్రి గురించి చెప్పడంతో వారు రాజు కోసం వెతికి మృతదేహాన్ని బయటకు తీశారు. వెంటనే మంథని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా డాక్టర్లు అతడు అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. శేఖర్, అరవింద్ ల ధైర్యసాహసాలను గ్రామస్థులు అభినందించారు. మంథని పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# పామాయిల్ సాగులో తెలంగాణ మొదటి స్థానంలో ఉంది

### బీహార్ వ్యవసాయ శాఖ మంత్రి విజయ్ కుమార్ సిన్హా



**మహేశ్వరం,ఆగస్టు12(జనం సాక్షి):** పామాయిల్ సాగులో తెలంగాణ రాష్ట్రం దేశంలోనే మొదటి స్థానంలో ఉందని బీహార్ వ్యవసాయ శాఖ మంత్రి విజయ్ కుమార్ సిన్హా అన్నారు. బుధవారం రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం మన్సాన్ పల్లి గ్రామంలో రైతు హనుమంత్ రెడ్డి పొలంలో సాగు చేస్తున్న, డ్రాగన్ ఫ్రూట్,పామాయిల్ తోటలను సందర్శించారు. అనంతరం డ్రాగన్ ఫ్రూట్, పామాయిల్ పంటలలో లాభాల గురించి రైతులతో పలు విషయాలను చర్చించారు. పామాయిల్ సాగుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇస్తున్న రైతుల గురించి చర్చించారు. ఈ కార్యక్రమంలో బీహార్ ప్రిన్సిపాల్ సెక్రెటరీ నర్మదేశ్వర్, డైరెక్టర్ ఆఫ్ అగ్రి కల్చర్ ముఖేష్,డైరెక్టర్ ఆఫ్ హార్టికల్చర్ అభిషేక్, తెలంగాణ హార్టికల్చర్ జాయింట్ డైరెక్టర్ సరోజినీ,డివిజన్ ఉద్యానవన శాఖ అధికారి సౌమ్య, ఆయిల్ ఫామ్ ఫీల్డ్ ఆఫీసర్ మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

# కేజీబీవీ, గురుకుల పాఠశాలల్లో కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

- పరిసరాల పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి
- నాణ్యమైన పౌష్టికాహారం అందించాలని ఆదేశం
- ఆర్ఓ ప్లాంట్లు, సోలార్ హీటర్లు వినియోగంలోకి తేవాలి
- విద్యార్థినులకు ఇంగ్లీష్ పాఠాలు బోధించిన కలెక్టర్



**ఎడపల్లి, ఆగస్టు 12 (జనం సాక్షి):** ఎడపల్లి మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ), తెలంగాణ రెసిడెన్షియల్ స్కూల్, జూనియర్ కళాశాలను జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా బుధవారం సందర్శించి విద్యార్థులకు అందుతున్న విద్య, వసతులు, భోజన సౌకర్యాలను పరిశీలించారు. పాఠశాల పరిసరాలు, వంటశాల, స్టోర్ రూమ్, తరగతి గదులను తనిఖీ చేశారు. కేజీబీవీ పరిసరాలు పిచ్చిమొక్కలతో నిండి అపరిశుభ్రంగా ఉండడాన్ని గమనించిన కలెక్టర్ వెంటనే వాటిని తొలగించి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, వర్షపు నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కేజీబీవీలో అందుబాటులో ఉన్న విశాలమైన ఖాళీ స్థలాన్ని విద్యార్థినులకు ఉపయోగపడేలా అన్ని వసతులతో కూడిన క్రీడా మైదానంగా అభివృద్ధి చేయాలని సూచించారు. విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనం నాణ్యతను స్వయంగా పరిశీలించి, మెనూ వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం నాణ్యమైన, పౌష్టికాహారం అందించాలని నిర్వాహకులకు స్పష్టం చేశారు. పాఠశాల ప్రధాన ద్వారం వద్ద విద్యార్థులు, సందర్శకులకు స్పష్టంగా కనిపించేలా మెనూ బోర్డును ఏర్పాటు చేయాలని ఆదేశించారు. కేజీబీవీలో విద్యార్థినుల సంఖ్య తక్కువగా ఉండటాన్ని గమనించిన కలెక్టర్ ఇతర విద్యార్థినులకు ప్రవేశాలు కల్పించే అంశంపై సంబంధిత రాష్ట్రస్థాయి అధికారులతో మాట్లాడతానని తెలిపారు. రెసిడెన్షియల్ పాఠశాల, జూనియ ర్ కళాశాల ఆవరణలో వరి ధాన్యంతో పాటు వివిధ రకాల కూరగాయలను సాగు చేస్తున్న నిర్వాహకులను కలెక్టర్ అభినందించారు. విద్యార్థినుల ఆరోగ్య పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, విద్యతో పాటు పరిశుభ్రత, పోషకాహారం, క్రీడలకు తగిన ప్రాధాన్యం కల్పించాలని సూచించారు. అనంతరం రెసిడెన్షియల్ పాఠశాలలో పదో తరగతి విద్యార్థినులతో కలెక్టర్ కొద్దిసేపు మమేకమయ్యారు. వారికి ఆంగ్లం సబ్జెక్టులో పాఠాలు బోధిస్తూ పలు ప్రశ్నలు అడిగి వారి అభ్యాసన సామర్థ్యాన్ని తెలుసుకున్నారు. తన వెంట తీసుకొచ్చిన బహుమతులను విద్యార్థినులకు అందించి, కష్టపడి చదివి తల్లిదండ్రులకు, గురువులకు మంచి పేరు తీసుకురావాలని ప్రోత్సహించారు. కలెక్టర్ వెంట స్థానిక తహసీల్దార్ దత్తాత్రి, ఎంఈఓ గాలప్ప, కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ దీపిక, రెసిడెన్షియల్ స్కూల్ సహాయ ప్రిన్సిపాల్ సురేఖ తదితరులు ఉన్నారు.



# లాభాల ఆశకు మోసపోవద్దు..

- సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోతే వెంటనే 1930కు ఫోన్ చేయండి..
- సింగరేణి అధికారులకు సైబర్ నేరాలపై అవగాహన

**గోదావరిఖని, జనంసాక్షి :** రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ఆదేశాల మేరకు తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న "సురక్షా కా తిరంగా – సైబర్ ఇండిపెండెంట్ తెలంగాణ వైపు" కార్యక్రమంలో భాగంగా ఇల్లందు క్లబ్‌లో సింగరేణి అధికారులకు సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఎస్ఐ సత్యనారాయణ మాట్లాడుతూ సామాజిక మాధ్యమాలు, వాట్సాప్,టెలిగ్రామ్ ద్వారా వచ్చే అధిక లాభాల పెట్టుబడి ఆఫర్లు,నకిలీ షేర్ల వ్యాపార యాప్‌లను నమ్మి,పదవీ విరమణ అనంతరం వచ్చిన డబ్బులను పెట్టుబడి పెట్టి మోసపోవద్దని సూచించారు.అదేవిధంగా డిజిటల్ అరెస్ట్,కేవైసీ,పెన్షన్, పీఎఫ్,లాటరీలు, రుణాలు,ఉద్యోగాల పేరుతో జరిగే సైబర్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. అపరిచిత వ్యక్తులు ఇచ్చే పెట్టుబడి సూచనలను నమ్మవద్దని,అధిక లాభాల పేరుతో వెంటనే పెట్టుబడి పెట్టాలని ఒత్తిడి చేసే వ్యక్తుల పట్ల జాగ్రత్తగా ఉండాలని సూచించారు.సైబర్ మోసానికి గురైన వెంటనే ఆలస్యం చేయకుండా 1930కు కాల్ చేసి ఫిర్యాదు చేయాలని అవగాహన కల్పించారు. అనంతరం సింగరేణి అధికారులతో సైబర్ నేరాల పట్ల ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉంటామని ప్రతిజ్ఞ చేయించారు.ఈ కార్యక్రమంలో పోలీస్ అధికారులు,సింగరేణి అధికారులు,సైబర్ క్రైమ్ సిబ్బంది పాల్గొన్నారు.

# అక్టోబర్ గడువులోగా ఉప్పల్ ఎలివేటెడ్ కారిడార్ పూర్తయ్యేనా?

- ఏడేళ్లుగా ఉప్పల్ ప్రజల ఎదురుచూపులు
- 60 శాతం పనులు పూర్తయ్యాయని అధికారుల వెల్లడి
- మిగిలిన 40 శాతం పనులకు గడువు కొన్ని వారాలే
- హామీలు కాదు.. పనులు పూర్తి చేయాలంటున్న స్థానికులు



**ఉప్పల్, ఆగస్టు 12 (జనంసాక్షి):** ఏళ్ల తరబడి ఉప్పల్ ప్రజలను వేధిస్తున్న ట్రాఫిక్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతుందని భావించిన ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణం ఎప్పుడు పూర్తవుతుందనే ప్రశ్నకు ఇంకా స్పష్టత లేకపోవడం స్థానికుల్లో అసహనానికి కారణమవుతోంది. పనులు ప్రారంభమై ఏళ్లు గడుస్తున్నా నిర్మాణం పూర్తికాకపోవడంతో వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తాజాగా అక్టోబర్ 31 నాటికి పనులు పూర్తి చేస్తామని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ప్రకటించడంతో కారిడార్ నిర్మాణంపై మరోసారి చర్చ మొదలైంది.

ఉప్పల్ ప్రాంతం విస్తరిస్తుండటంతో నిత్యం వేలాది వాహనాలు ఈ మార్గంలో రాకపోకలు సాగిస్తున్నాయి. ఉదయం, సాయంత్రం వేళల్లో ట్రాఫిక్ రద్దీ మరింత తీవ్రంగా మారుతోంది. ఈ సమస్యకు పరిష్కారంగా చేపట్టిన ఎలివేటెడ్ కారిడార్ పనులు ఆలస్యమవుతుండటంతో నిర్మాణ ప్రాంతాల్లో డైవర్షన్లు, ఇరుకైన మార్గాలు, నిర్మాణ సామగ్రి కారణంగా ప్రజలకు అదనపు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. వర్షాకాలంలో రోడ్లపై నీరు, బురద చేరడంతో పరిస్థితి మరింత క్లిష్టంగా మారుతోందని స్థానికులు చెబుతున్నారు.

ప్రస్తుతం కారిడార్ పనులు సుమారు 60 శాతం పూర్తయ్యాయని మంత్రి వెల్లడించారు. మిగిలిన 40 శాతం పనులను వేగవంతం చేసి అక్టోబర్ 31 నాటికి పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. అయితే ఏడేళ్ల వ్యవధిలో 60 శాతం పనులు మాత్రమే పూర్తయిన నేపథ్యంలో మిగిలిన 40 శాతం పనులను కొన్ని వారాల్లో ఎలా పూర్తి చేస్తారనే సందేహం స్థానికుల్లో వ్యక్తమవుతోంది. గతంలో పలుమార్లు గడువులు మారిన నేపథ్యంలో ఈసారి ప్రకటించిన తేదీకి పనులు పూర్తవుతాయా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

నిర్మాణ పనుల్లో వేగం పెంచేందుకు అదనపు సిబ్బందిని సమకూర్చి మూడు షిఫ్టుల్లో పనులు నిర్వహించాలని మంత్రి అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా రాత్రి 11 గంటల నుంచి ఉదయం 6 గంటల వరకు పనులను నిరంతరాయంగా కొనసాగించాలని సూచించారు. ప్రతిరోజూ ఎంత పని పూర్తయింది, ఎంత మిగిలి ఉంది, మరుసటి రోజు చేపట్టాల్సిన పనుల వివరాలను సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. ప్రతి పది రోజులకు ఒకసారి తానే క్షేత్రస్థాయిలో పనుల పురోగతిని పరిశీలిస్తానని తెలిపారు.

ఎలివేటెడ్ కారిడార్ కింద ఉన్న సుమారు 6.25 కిలోమీటర్ల బీటీ రోడ్డు పనులను ఆగస్టు నెలాఖరులోగా పూర్తి చేయాలని మంత్రి స్పష్టం చేశారు. కారిడార్ నిర్మాణంతోపాటు కింది రహదారి పనులు కూడా పూర్తయితే ట్రాఫిక్ నిర్వహణలో కొంత ఉపశమనం లభించే అవకాశం ఉంది. ప్రస్తుతం సైట్‌లో సుమారు 400 మంది కార్మికులు రెండు షిఫ్టుల్లో పనిచేస్తున్నారని అధికారులు వివరించగా, ఇకపై మూడు షిఫ్టుల్లో పనులు చేపట్టి నిర్మాణ వేగాన్ని పెంచాలని మంత్రి ఆదేశించారు. నారపల్లి, ఉప్పల్ వైపుల నుంచి ఇరువైపులా లాంచింగ్ గిర్డర్లతో పనులు వేగవంతం చేయాలని సూచించారు. ఇప్పటికే ఒక స్లాబ్ పూర్తయిందని అధికారులు వివరించారు.

కారిడార్ నిర్మాణం పూర్తయితే ఉప్పల్–నారపల్లి మార్గంలో ట్రాఫిక్ రద్దీ తగ్గడంతోపాటు ప్రయాణ సమయం కూడా గణనీయంగా తగ్గే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం ఉదయం ఉద్యోగులు, విద్యార్థులు, వ్యాపారులు నగరంలోని వివిధ ప్రాంతాలకు వెళ్లే సమయంలో, సాయంత్రం తిరుగు ప్రయాణంలో వాహనాలు పెద్దఎత్తున నిలిచిపోతున్నాయి. అత్యవసర సేవల వాహనాలు సైతం ట్రాఫిక్‌లో చిక్కుకునే పరిస్థితులు ఎదురవుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. నిర్మాణ పనుల కారణంగా రహదారులు ఇరుకుగా మారడం, పలుచోట్ల డైవర్షన్లు ఏర్పాటు చేయడం, నిర్మాణ సామగ్రి రోడ్డు పక్కన ఉండటం వల్ల ద్విచక్ర వాహనదారులు, పాదచారులు ఇబ్బందులు పడుతున్నారని వారు పేర్కొంటున్నారు. వర్షాలు పడినప్పుడు దుమ్ము, బురద, నీటి నిల్వలతో సమస్య మరింత పెరుగుతోందని అంటున్నారు.

ఏళ్ల తరబడి ఎదురుచూస్తున్న తమకు ఇక ప్రకటనలు, గడువులు కాకుండా పూర్తయిన కారిడార్ కావాలని ఉప్పల్ ప్రజలు కోరుతున్నారు. మంత్రి స్వయంగా పనులను పర్యవేక్షిస్తూ ప్రతి పది రోజులకు పురోగతిని సమీక్షిస్తామని ప్రకటించడం సానుకూల పరిణామమే అయినప్పటికీ, గత అనుభవాల నేపథ్యంలో ఈసారి గడువు కచ్చితంగా అమలు చేయాలని వారు అంటున్నారు. అక్టోబర్ 31 నాటికి పనులు పూర్తయి కారిడార్ అందుబాటులోకి వస్తేనే తమ ఏళ్ల తరబడి ఎదురుచూపులకు తెరపడుతుందని స్థానికులు పేర్కొంటున్నారు. మాటలకంటే పనుల వేగమే ఈసారి ప్రభుత్వంపై ప్రజల నమ్మకాన్ని నిర్ణయించనుంది.

# ఆగస్టు 31లోగా చేయూత పెన్షన్ల పూర్తి డేటా సేకరించాలి

### మున్సిపల్ కమిషనర్ జి.మల్లికార్జున స్వామి



**జమ్మికుంట,ఆగస్టు 12 (జనం సాక్షి):** జమ్మికుంట మున్సిపాలిటీ పరిధిలో చేయూత పెన్షన్లకు సంబంధించి అర్హులైన ప్రతి ఒక్కరి పూర్తి వివరాలను ఆగస్టు 31, 2026లోగా సేకరించాలని మున్సిపల్ కమిషనర్ జి. మల్లికార్జున స్వామి ఆదేశించారు. జమ్మికుంట మున్సిపల్ కార్యాలయంలో బుధవారం వార్డు ఆఫీసర్లు,కార్యాలయ సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో కమిషనర్ జి. మల్లికార్జున స్వామి, మున్సిపల్ చైర్‌పర్సన్ మొలుగు ప్రశాంత్ కుమార్ (దిలీప్) మాట్లాడుతూ ప్రతి వార్డులో కౌన్సిలర్ల సహకారంతో వార్డు ఆఫీసర్లు ఇంటింటికీ వెళ్లి చేయూత పెన్షన్లపై వివరాలు సేకరించాలని సూచించారు.ప్రతి వార్డులో పెన్షన్ అర్హత ఉన్నప్పటికీ ఇప్పటివరకు పెన్షన్ పొందని వారిని గుర్తించి అర్హులైన ప్రతి ఒక్కరి నుంచి దరఖాస్తులు స్వీకరించి ఆన్‌లైన్‌లో నమోదు చేయించాలని తెలిపారు.చేయూత పెన్షన్లలో వితంతు,ఒంటరి మహిళ, వికలాంగులు,చేనేత కార్మికులు,గీత కార్మికులు తదితర అర్హులైన వారు ఎవరైనా పెన్షన్ పొందకుండా ఉన్నట్లయితే వారిని గుర్తించి మున్సిపల్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకునేలా అవగాహన కల్పించాలని సూచించారు. మున్సిపల్ కార్యాలయంలో ప్రత్యేక పెన్షన్ దరఖాస్తు కేంద్రం ఏర్పాటు చేయడమైనదని తెలిపారు.అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకం అందేలా ఇంటింటికీ వెళ్లి పూర్తి స్థాయిలో వివరాలు సేకరించి ఎలాంటి అర్హుడు కూడా పథకానికి దూరం కాకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.ఈ సమావేశంలో మున్సిపల్ మేనేజర్ జి.రాజిరెడ్డి, ఏఈ వికాస్,జేఏఓ రాజశేఖర్ రెడ్డి,ఇన్‌స్పెక్టర్ ఐ. రమేష్,టీపీబీవో దీపిక,సీనియర్ అసిస్టెంట్ భాస్కర్, శ్రీనివాస్,వార్డు ఆఫీసర్లు,కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# రాయదుర్గం భూదోపిడీని అడ్డుకుంటాం

▫ గవర్నర్‌కు ఫిర్యాదు చేస్తాం: దాసోజు శ్రవణ్



హైదరాబాద్, ఆగస్ట్ 12 (జనంసాక్షి) : రాయదుర్గంలో జరుగుతున్న ఈ భూ దోపిడీని అడ్డుకుని తీరుతామని దీనిమీద గవర్నర్, సీఐడీ, సీబీఐ దగ్గరికి పోతామని బిఆర్ఎస్ ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ అన్నారు. బుధవారం రాయదుర్గం మల్కం చెరువు ఎదురుగా నిర్మిస్తున్న పీఎం ఏక్తా యూనిటీ మాల్ నిర్మాణ స్థలాన్ని బీఆర్ఎస్ నాయకులతో కలిసి పరిశీలించారు. రాయదుర్గంలో రూ.1700 కోట్ల విలువైన 7 ఎకరాల భూమిని రేవంత్ రెడ్డి పీఎం ఏక్తా మాల్ నిర్మాణం పేరుతో తన బినామీ సంస్థలకు ఎలాంటి టెండర్లు లేకుండా కట్టబెట్టారని విమర్శించారు. రేవంత్ రెడ్డి ఎంత పెద్ద నేరస్థుడో ఆయనకి కొమ్ము కాస్తున్న అధికారులు కూడా అంతే నేరస్థులని మండిపడ్డారు. ఈ ప్రాజెక్టు కోసం గవర్నమెంట్ రూ.200 కోట్లు లోన్ ఇచ్చింది. రేవంత్ రెడ్డి ఎన్ని కుట్రలు చేసినా బీజేపీ వాళ్లకు కళ్లే కనబడటం లేదా అని ప్రశ్నించారు. రేవంత్ రెడ్డి బినామీ కంపెనీని నడుపుతున్నది ఐఏఎస్ జయేష్ రంజన్, ఐఎఫ్ఎస్ ఆఫీసర్ విష్ణువర్ధన్ రెడ్డి అని ఆరోపించారు. ఇష్టం వచ్చినట్లు దొంగ అగ్రిమెంట్లు, టెండర్లు చేసి వేల కోట్ల రూపాయలు పందికొక్కుల లాగా దోచుకుని తింటాము అంటే కర్రు కాల్చి అధికారులకు కూడా వాతలు పెడతామన్నారు.

# సెయిలింగ్ పోటీల్లో అంతర్జాతీయ స్థాయిలో వెండి పతకం



▫ ఎస్.రిష్వితను అభినందించిన మంత్రి పొన్నం ప్రభాకర్

హైదరాబాద్ (జనంసాక్షి) : జూలై 30 నుండి ఆగస్టు 7 వరకు 2026 వరకు ఇటలీలోని గార్డా సరస్సు వద్ద జరిగిన సెయిలింగ్ ఇంటర్నేషనల్ కాడెట్ ప్రపంచ ఛాంపియన్‌షిప్(ప్రమోషనల్ క్లాస్)లో రజత పతకం గెలుచుకున్న బీసీ గురుకుల విద్యార్థినీ ఎస్.రిష్విత, పోటీలో పాల్గొన్న ఇద్దరు విద్యార్థులను బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రభుత్వం తీసుకున్న స్పోర్ట్స్ పాలసీ లో భాగంగా విద్యార్థులను వారికి ఆసక్తి ఉన్న క్రీడల్లో ప్రోత్సాహిస్తున్నామని అన్నారు. విద్యార్థులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పతకాలు సాధించడం రాష్ట్రానికే కాదు దేశానికి గర్వకారణం అన్నారు. విద్యార్థులు సమయ పాలన, సమిష్టి కృషి తో తెలంగాణకు, భారతదేశానికి అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చారని ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంజెపిటి సెక్రటరీ బి. సైదులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.



# సీఎంతో ఆర్మీ సదరన్ కమాండ్ జనరల్ ఆఫీసర్ భేటీ

హైదరాబాద్ (జనంసాక్షి) : ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ని భారత ఆర్మీ సదరన్ కమాండ్ జనరల్ ఆఫీసర్ కమాండింగ్-ఇన్-చీఫ్ లెఫ్టినెంట్ జనరల్ సి. రాజేష్ పుష్కర్ మర్యాదపూర్వకంగా కలిసారు. భేటీలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు. భారత ఆర్మీ చేపట్టే వివిధ నియామకాల్లో తెలంగాణ యువతను ప్రోత్సహించే విధంగా కలిసి పనిచేసేందుకు తెలంగాణ ప్రభుత్వం సిద్ధంగా ఉందని సీఎం తెలియజేశారు. ఆర్మీ నియామకాల్లో స్థానిక యువతకు భారీ అవకాశాలు కల్పించే లక్ష్యంతో ఆసక్తి చూపుతున్న, అనువైన జిల్లా కేంద్రాల్లో శిక్షణా కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు. దీనికి సానుకూలంగా స్పందిస్తూ దేశ వ్యాప్తంగా నిర్వహించే వివిధ ఆర్మీ రిక్రూట్మెంట్ లకు ముందు ఆయా తెలంగాణ జిల్లా కేంద్రాల్లో యువతకు శిక్షణ కేంద్రాలు ఏర్పాటుకు లెఫ్టినెంట్ జనరల్ రాజేష్ పుష్కర్ సుముఖత వ్యక్తం చేశారు. విపత్తు నిర్వహణలో ఆర్మీ పాత్రపై సీఎం చర్చించారు. రాష్ట్రంలో వరద ప్రభావిత ప్రాంతాల్లో రెస్క్యూ ఆపరేషన్లు, ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించడం, పునరావాస చర్యల్లో ఆర్మీ యంత్రాంగం మరింత క్రియాశీలకంగా వ్యవహరించాలని ముఖ్యమంత్రి కోరారు. తెలంగాణలో విపత్తు పరిస్థితుల్లో ప్రత్యేకంగా చొరవ తీసుకోవాలని స్థానిక ఆర్మీ అధికారులను ఆదేశిస్తానని లెఫ్టినెంట్ జనరల్ రాజేష్ పుష్కర్ తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న మూసీ నది ప్రక్షాళన ప్రాజెక్టును కొనియాడిన లెఫ్టినెంట్ జనరల్ రాజేష్ పుష్కర్. హైదరాబాద్ నగరాన్ని రక్షించ డానికి, కాలుష్యాన్ని తగ్గించడానికి, చారిత్రక వైభవాన్ని తిరిగి తెచ్చేందుకు మూసీ నది పునరుజ్జీవనం అవసరం అని అన్నారు భేటీలో పాల్గొన్న మేజర్ జనరల్ శ్రీనివాస్ రావు, ఇతర ఆర్మీ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# మహారాష్ట్ర సీఎస్‌తో సంజయ్ జాజు భేటీ

▫ తెలంగాణ అభివృద్ధి తదితర అంశాలపై చర్చ



హైదరాబాద్, ఆగస్ట్12 (జనంసాక్షి) : తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు బుధవారం ముంబైలో మహారాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రాజేష్ అగర్వాల్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు, రాష్ట్రంలో కొనసాగుతున్న అభివృద్ధి ప్రగతి, 'రైజింగ్ తెలంగాణ-2047' విజన్ తదితర అంశాలను వివరించారు. తెలంగాణ-మహారాష్ట్ర రాష్ట్రాల మధ్య ఉన్న సత్సంబంధాలను మరింత బలోపేతం చేసుకోవడం, పరస్పర సహకారంతో అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లడం వంటి అంశాలపై ఇరువురు చర్చించారు. అనంతరం తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సిఎండి సి.ఎస్. శెట్టిను ముంబైలో కలిశారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి, పెట్టుబడులకు ఉన్న అవకాశాలు, 'రైజింగ్ తెలంగాణ 2047' లక్ష్యాలు తదితర అంశాలను ఆయన ఎస్‌బీఐ సీఎండీకి వివరించారు. తెలంగాణ రాష్ట్ర సమగ్ర అభివృద్ధి, పారిశ్రామిక ప్రగతి, పెట్టుబడుల ఆకర్షణ, ఉపాధి అవకాశాల కల్పనకు ప్రభుత్వం చేపడుతున్న చర్యలను సంజయ్ జాజు వివరించారు.

# నిషేధిత కలుపు మందు విక్రయాలు

▫ పట్టించుకోని వ్యవసాయ అధికారులు
▫ చెలరేగిపోతున్న పెస్టిసైడ్ దుకాణాదారులు




వెంకటాపూర్ (రామప్ప), ఆగస్టు 12 (జనంసాక్షి): పర్యావరణానికి,మానవాళికి ముప్పు కలిగించే నిషేధిత కలుపు మందులైన పారాక్వాట్ తోపాటు గ్లైఫోసేట్ ను విదేశాల్లో నిషేధం విధించారు.అదేవిధంగా మన దేశంలో సైతం గ్లైఫోసేట్‌ను నాలుగు సంవత్సరాల క్రితమే పూర్తిగా నిషేధించగా, పారాక్వాట్‌ను 60 రోజుల పాటు నిషేధిస్తూ మే నెలలో ఉత్తర్వులు జారీ చేశారు. అప్పటినుండి ఇప్పటివరకు ప్రభుత్వం తిరిగి ఎటువంటి నిర్ణయాన్ని వెల్లడించలేదు.డీలర్ల కు సైతం తమ వద్ద ఉన్న నిల్వలను విక్రయించే అనుమతులు ఇవ్వలేదు. నిషేధిత కలుపు మందుల విక్రయాలను నిలిపి వేయాలని సంబంధిత అధికారులు డీలర్లకు సూచనలు చేస్తున్నప్పటికీ వారు అక్రమ సంపాదనే ధ్యేయంగా గుట్టుగా ఎరువుల షాపులకు సరఫరా చేస్తుండడంతో ఇదే అదునుగా భావించి వెంకటాపూర్ మండలంలోని పెస్టిసైడ్ దుకాణాదారులు చెలరేగిపోతున్నారు. గుట్టు చప్పుడు కాకుండా విక్రయాలు చేస్తూ రైతుల నుంచి అధిక మొత్తంలో దోచుకుంటున్నారు.

### కూలీల కొరతతో కలుపు మందులకు డిమాండ్

ప్రస్తుతం వెంకటాపూర్ మండలం లో గ్రామాల్లో కూలీల కొరత అధికంగా ఉంది. మండలం లో ప్రతి ఒక్కరు ఎంతో కొంత వ్యవసాయం చేస్తుండడం మూలంగా గ్రామాల్లో సమయానికి కూలీలు దొరకకపోవడంతో కలుపు మందులకు డిమాండ్ పెరిగింది.వెంకటాపూర్ మండలం లో రైతులు ప్రధానంగా పత్తి, మొక్కజొన్న, కూరగాయల పంటలు సాగుచేస్తున్నారు. అయితే సాగులో కలుపు నివారణకు కూలీల కొరత మూలంగా ప్రస్తుతం రైతులుకలుపుమందు పిచికారీకి అలవాటు పడ్డారు. ఇదే అవకాశంగా భావిస్తున్న వెంకటాపూర్ మండలంలోని పలు గ్రామాల్లో గల పెస్టిసైడ్స్ దుకాణాదారులు లీటర్ పారాక్వాట్ మందును రూ.450 నుంచి రూ.500 వరకు విక్రయిస్తున్నారు. అయితే సదురు మందులపై నిషేధం ఉండడంతో ఫర్టిలైజర్ యజమానులు దుకాణాల్లో ఉంచకుండా తమకు నమ్మకమైన రైతుల ఇళ్లల్లో లేదా తమ రహస్య స్థావరాల్లో వాటిని నిల్వ చేసి విక్రయాలు జరుపుతున్నారు.అక్రమంగా నిల్వచేసిన నిషేధిత కలుపు మందులను తమకు తెలిసిన రైతులకు మాత్రమే విక్రయిస్తూ అక్రమంగా సంపాదిస్తున్నారు. ధనార్జనయే ధ్యేయం గా మరీ కొందరు వ్యాపారులు తమ వద్ద ఉన్న నిల్వలు అయిపోయినప్పటికీ ఇతర రాష్ట్రాల నుంచి గుట్టుగా దిగుమతి చేసుకుంటున్నట్లు సమాచారం.




### అధికారుల తనిఖీలు శూన్యం

వెంకటాపూర్ మండలంలో నిషేధిత కలుపు మందుల విక్రయాలు జోరుగా సాగుతున్నప్పటికీ పెస్టిసైడ్స్ దుకాణాల్లో అధికారులు ఎలాంటి తనిఖీలు నిర్వహించడం లేదు. మండలంలో నిషేధిత కలుపు మందుల విక్రయాలు జోరుగా కొనసాగుతున్న ఇప్పటికీ ఒక్క కేసు కూడా నమోదు కాకపోవడం గమనార్హం. ప్రస్తుతం పారాక్వాట్ డైక్లోరైడ్ మందు స్టాప్‌సేల్ లోనే ఉందని,ప్రభుత్వం తదుపరి ఆదేశాలు ఇచ్చేంతవరకు వ్యాపారులు విక్రయాలు చేయొద్దని,ఎవరైనా విక్రయిస్తున్నట్లు తమకు సమాచారం ఇచ్చినట్లయితే శాఖపరమైన చర్యలు తీసుకుంటామని నిర్లక్ష్యపు సమాధానాలను వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు. ఏది ఏమైనప్పటికీ మండలంలో గుట్టు చప్పుడు కాకుండా కొనసాగుతున్న నిషేధిత కలుపు మందుల విక్రయాలను అరికట్టాల్సిన బాధ్యత అధికారులపై ఉంది. ఇప్పటికైనా సంబంధిత వ్యవసాయ అధికారులు స్పందిస్తారా లేదా చూడాలి మరీ.

# ముంబై ఘాట్‌కోపర్ ప్రాంతంలో విరిగిపడ్డ కొండచరియలు

▫ ఇద్దరు వ్యక్తులు మృతి...శిథిలా కింద చిక్కున్న పలువురు



ముంబై, ఆగస్ట్12 (జనంసాక్షి) : ముంబైలో భారీ వర్షాల వేళ ఘట్‌కోపర్-కుర్లా రహదారి సమీపంలోని అశోక్ నగర్‌లో కొండచరియలు విరిగిపడిన ఘటనలో ఆరుగురు మృతి చెందారు. పలువురు శిథిలాల కింద చిక్కుకున్నట్లు అధికారులు అనుమానిస్తున్నారు. బుధవారం తెల్లవారుజామున చిరాగ్ నగర్‌లోని గౌషియా చాల్ వద్ద ఈ ప్రమాదం చోటుచేసుకుంది. రాథోడ్ మెడికల్ సమీపంలో కొండచరియలు విరిగిపడటంతో అక్కడి ఇళ్లు శిథిలాల కింద చిక్కుకున్నాయి. ముంబై పోలీసులు, బీఎంసీ అధికారులు ఇప్పటివరకు ఆరుగురి మృతదేహాలను వెలికితీసి సమీప ఆసుపత్రికి తరలించారు. శిథిలాల కింద మరికొందరు చిక్కుకుని ఉండొచ్చన్న అనుమానంతో సహాయక బృందాలు తీవ్రంగా గాలిస్తున్నాయి. ప్రమాద సమాచారం అందుకున్న వెంటనే ముంబై ÷ర్ బ్రిగేడ్, పోలీసులు, 108 అంబులెన్స్ సిబ్బంది, ఎన్‌డీఆర్ఎఫ్, బీఎంసీ వార్డు సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. శిథిలాలను తొలగిస్తూ ప్రాణాలతో ఉన్నవారి కోసం గాలిస్తున్నారు. ఈ ఘటనలో ఇళ్లలో చిక్కుకున్న 18 ఏళ్ల సోహెల్ అన్సారీ, 14 ఏళ్ల మొహమ్మద్ అన్సారీలను రక్షించి సురక్షితంగా బయటకు తీసుకొచ్చారు. ఇద్దరికీ స్వల్ప గాయాలు కావడంతో చికిత్స అందిస్తున్నారు. ఇదిలా ఉండగా, వర్షాకాలానికి ముందే ఈ ప్రాంతంలోని పలు ఇళ్లకు నోటీసులు జారీ చేసినట్లు అధికారులు వెల్లడించారు. వర్షాల వల్ల కొండచరియలు విరిగిపడినట్లు డీసీపీ గణేశ్ షిండే చెప్పారు. ముంబై మేయర్ రీతూ తవడే, అదనపు మున్సిపల్ కమిషనర్ అవినాశ్ దాకనే.. ఘటనా స్థలాన్ని సందర్శించారు.

# చంద్రబాబు విజనరీ లీడర్

### ఎంపి కలిశెట్టితో రాష్ట్రపతి ముర్ము

న్యూఢిల్లీ, ఆగస్ట్12 (జనంసాక్షి) : ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడిపై రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రశంసల జల్లు కురిపించారు. చంద్రబాబు విజనరీ లీడర్ అని.. అభివృద్ధికి అసలైన చిరునామా అంటూ కొనియాడారు. ఏ పని చేపట్టినా అద్భుతంగా చేయడం ఆయన ప్రత్యేకత అని అన్నారు. నిరంతర శ్రమ, దార్శనికత కలిగిన చంద్రబాబు.. నిజమైన అభివృద్ధికి చిరునామా అని అభివర్ణించారు. బుధవారం రాష్ట్రపతి ద్రౌపది ముర్మును విజయనగరం టీడీపీ ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు కుటుంబం కలిసింది. ఈ సందర్భంగా ప్రెసిడెంట్‌కు 'అమరావతి' కాఫీ టేబుల్ బుక్‌ను ఎంపీ అందజేశారు. పుస్తకంలోని ఫొటోలను ముర్ము ఆసక్తిగా తిలకించారు. ఈ సందర్భంగానే ఏపీ సీఎంపై ప్రశంసల జల్లు కురిపించారు. అంతేకాకుండా, 'అప్పలనాయుడిని చూస్తుంటే నన్ను నేను చూసుకున్నట్లే ఉంది' అని రాష్ట్రపతి అన్నారు. పార్లమెంట్‌కు సైకిల్‌పై రావడం, 100 శాతం హాజరుపై ఎంపీని ద్రౌపది ముర్ము అభినందించారు.

# రాజ్యసభలో 'లుంగీవాలా వ్యాఖ్యలు' కలకలం

### బీజేపీ ఎంపీ సుష్మితా దేవ్ వ్యాఖ్యలపై ఎంపీ జాన్ బ్రిట్టాస్ ఆగ్రహం

న్యూఢిల్లీ, ఆగస్ట్12 (జనంసాక్షి) : రాజ్యసభలో 'లుంగీవాలా వ్యాఖ్యలు' కలకలానికి దారి తీశాయి. బీజేపీ ఎంపీ సుష్మితా దేవ్ తనను లుంగీవాలా అంటూ అభ్యంతరకర వ్యాఖ్యలు చేశారని సీపీఐ (ఎమ్) ఎంపీ జాన్ బ్రిట్టాస్ ఆరోపించారు. ఆమె వ్యాఖ్యలను ఖండిస్తూ తీర్మానాన్ని కూడా ప్రవేశపెట్టారు. దక్షిణాది వ్యక్తిగా తన ఆహార్యం తనకు ఎంతో గర్వకారణమని ఎంపీ జాన్ బ్రిట్టాస్ తెలిపారు. పార్లమెంటు వేదికగా కించపరిచే వ్యాఖ్యలు చేయడం విచారకరమని అన్నారు. 'ఇటీవల ఓ రోజు నేను సభలో మాట్లాడుతుంటే ఆమె లుంగీవాలా అంటూ నన్ను ఉద్దేశించి అమర్యాదకర వ్యాఖ్యలు చేశారు. నేను ధోతీతో ఉన్నా. మలయాళీని, దక్షిణాది వ్యక్తిని అయినందుకు గర్వపడుతున్నా. అయితే, అవమానకర వ్యాఖ్యలు చేయడం ఎంత మాత్రం ఆమోదయోగ్యం కాదు. ఈ విషయంపై సభ దృష్టి సారించాలి. ఆమెకు వ్యతిరేకంగా ప్రివిలేజ్ మోషన్‌ను ప్రవేశపెట్టాను' అని తెలిపారు. తన బాధ్యతలు నిర్వర్తించనీయకుండా ఎంపీ దేవ్ పదే పదే అడ్డుపడ్డారని ఎంపీ బ్రిటాస్ ఆరోపించారు. పలు మార్లు లుంగీవాలా అని అన్నారని ఆరోపించారు. ఈ వార్తలపై రాజ్యసభలో జేపీ నడ్డా మాట్లాడుతూ లుంగీ కామెంట్స్‌ను తాము సమర్థించమని స్పష్టం చేశారు. బ్రిట్టాస్ అభ్యంతరాలు, వ్యాఖ్యలు అన్నీ రికార్డుల్లోకి చేరాయని అన్నారు. తమ దృష్టిలో అది ధోతీ అని కూడా చెప్పారు. సభ హుందాతనాన్ని కాపాడాల్సిన అవసరం ఉందని కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు కూడా అభిప్రాయపడ్డారు. 'సభ సభ్యులందరూ సమానమే. ఒక ఎంపీపై ఆరోపణలు వచ్చాయి కాబట్టి వారికి తమ వివరణ ఇచ్చేందుకూ అవకాశం ఇస్తున్నాము' అని అన్నారు.

# మహిళా సంఘాలకు మిల్లింగ్‌లో అవకాశం

▫ సిఎం నిర్ణయాన్ని స్వాగతించిన మంత్రి సీతక్క



హైదరాబాద్, ఆగస్ట్12 (జనంసాక్షి) : మహిళా సంఘాలకు మిల్లింగ్ బాధ్యతలు అప్పగించే విషయంలో సీఎం రేవంత్‌రెడ్డి నిర్ణయంపై మంత్రి సీతక్క హర్షం వ్యక్తం చేశారు. మహిళా సంఘాలను ఆర్థికంగా బలోపేతం చేసేలా ఈ నిర్ణయం ఉందని కొనియాడారు. మహిళా సంఘాల సాధికారతకు సీఎం నిర్ణయం మరో ముందడుగని ప్రశంసించారు. బుధవారం సచివాలయంలో మీడియాతో మంత్రి సీతక్క మాట్లాడారు. మహిళా సంఘాలకు మిల్లింగ్‌లో అవకాశం కల్పించినందుకు మహిళల తరుపున మంత్రి సీతక్క కృతజ్ఞతలు తెలిపారు. మహిళా సంఘాల ఆధ్వర్యంలో ధాన్యం నిల్వ కేంద్రాల ఏర్పాటుతో మహిళలకు ఉపాధి, ఆదాయ అవకాశాలు పెరుగుతాయని వెల్లడించారు. మిల్లింగ్, ధాన్యం నిల్వ రంగాల్లో మహిళా సంఘాలకు కొత్త అవకాశాలు లభిస్తాయని చెప్పుకొచ్చారు. మహిళా సంఘాలను ఆర్థిక శక్తిగా తీర్చిదిద్దడమే తమ ప్రభుత్వ లక్ష్యమని ఉద్ఘాటించారు. సీఎం నిర్ణయంతో గ్రామీణ మహిళలకు ఉపాధి, ఆదాయ అవకాశాలు మరింత పెరుగుతాయని మంత్రి సీతక్క పేర్కొన్నారు.

# నేత కార్మికుడి హత్య దుర్మార్గపు చర్య

▫ రాజకీయ కక్షల కోసం సామాన్యుడిని చంపేస్తారా
▫ కార్మికుడి కుటుంబానికి న్యాయం చేయాలి
▫ అసలు హంతకులను పట్టుకుని శిక్షించాలి
▫ వెంకటేశం కుటుంబానికి కెటిఆర్ పరామర్శ



రాజన్నసిరిసిల్ల, ఆగస్ట్12 (జనంసాక్షి) : సిరిసిల్లలో హత్యకు గురైన నేత కార్మికుడు వెంగళ వెంకటేశం కుటుంబాన్ని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పరామర్శించారు. వెంకటేశం మృతి పట్ల దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన కేటీఆర్ ఆయన కుటుంబసభ్యులను ఓదార్చారు. పార్టీ తరపున అన్ని విధాలుగా అండగా ఉంటామని హామీనిచ్చారు. అనంతరం కేటీఆర్ మీడియాతో మాట్లాడుతూ.. ఈ చిన్నారి పేరు ప్రసన్న. ఐదో తరగతి చదువుతోంది. క్షుద్ర రాజకీయాలు, చిల్లర రాజకీయాల వల్ల ఈ పాప తండ్రిని కోల్పోయింది. ఎందుకు ఆమె తండ్రి చనిపోయాడు.. ఏదైనా చేసి రాజకీయ లబ్ది పొందాలే. అవసరమైతే మనుషుల ప్రాణాలు తీసైనా సరే.. చంపేసి అయినా సరే రాజకీయంగా బద్నాం చేయాలే.. అనే ఒకే ఒక చిల్లర ప్రయత్నంలోవెంగళ వెంకటేశం మన మధ్యలో లేకుండా పోయారు. వాళ్ల భార్య, పాప, తల్లిని అనాథలను చేసి ఆయన పోయారు. రాష్ట్ర రాజకీయాల్లో 20 ఏండ్లుగా నేను కూడా ఉన్నా. ఇంకా చాలా పెద్దలు ఇక్కడ సీనియర్లు కూడా ఉన్నారు. నేను ఎన్నడూ ఇంత దిగజారుడు రాజకీయం, ఇంత దరిద్రపుగొట్టు రాజకీయం జీవితంలో కూడా చూడలేదన్నారు. మా నాన్న రాలేదు..మూడు రోజులు నేను తినలేదు అని ఆ పాప ఏడుస్తూ చెప్తుంటే మనస్సున్న మనిషి కళ్లల్లో నీళ్లు తిరగక మానవు. గుండె ద్రవించక మానదని కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. మమ్మల్ని రాజకీయంగా ఎదుర్కోవాలి అనుకుంటే ఎన్నికల్లో తలపడొచ్చు? లేదా నాయకులతో విమర్శలు చేయొచ్చు. మీరు ఇప్పటికే చేస్తున్నట్టుగా కేసులుపెట్టొచ్చు.. వేధించొచ్చు. కానీ మధ్యలో సామాన్యులను సమిధలుగా చేసి, బలిపశువులను చేసి వాళ్ల జీవితాలను ఆగం చేస్తే ఏమొస్తదని కాంగ్రెస్ పార్టీ నాయకులను అడుగుతున్నా. చనిపోయింది వెంకటేశం.. అరెస్ట్ చేసింది చోటామోటా కాంగ్రెస్ నాయకులను. కానీ ఆ చోటమోటా కాంగ్రెస్ పార్టీ నాయకులు కేవలం పాత్రదారులు మాత్రమే. అసలు సూత్రదారులు పెద్దవాళ్లు వెనకాల ఉన్నరు.. తప్పించుకున్నారు. కానీ మేం వదిలిపెట్టం. వెంకటేశం భార్య మమ్మల్ని అడిగింది. అన్నా న్యాయం జరిగేదాకా మాతో ఉండండి అని అడిగింది. ఇల్లుతో ఇబ్బందికరంగా ఉంది. కొత్త ఇల్లు మంజూరు చేయాలని కాంగ్రెస్ నాయకుల దగ్గరకుపోతే దాని కోసం నెలరోజులుగా తిప్పించుకుని ఇవాళ ఈ పరిస్థితి తెచ్చారని కేటీఆర్ మండిపడ్డారు. అందుకే నేనిప్పుడే కలెక్టర్‌తో మాట్లాడి చెప్పిన.. మీరు ఇల్లు ఇస్తరా.. ఇవ్వండి లేదా మా పార్టీ తరపున మేం ఇల్లు కట్టిస్తమనిచెప్పినం. ఇప్పుడు ఆ పాపకు 11 ఏండ్లు. ఆమె పేరు మీద రూ.3 లక్షలు పిక్స్‌డ్ డిపాజిట్ చేసినం. ఆమె 18 ఏండ్లు నిండి మేజర్ అయిన తర్వాత మెచ్యూర్ అయ్యేలా డిపాజిట్ కూడా చేశాం. ఆ పాప పదోతరగతి దాకా నేనే చదివిపిస్తానని చెప్పా. చంపి ఆత్మహత్యగా చిత్రీకరించాలనేచిల్లర ప్రయత్నం స్థానిక సిరిసిల్ల కాంగ్రెస్ నాయకత్వం చేసిందో ఇదిఎన్నటికీ కూడా క్షమించరాని నేరం. సభ్య సమాజం కూడా అసహ్యించుకునే దుర్మార్గమైన పరిస్థితని అన్నారు. దయచేసి ఈ కుటుంబానికి న్యాయంచేయాలని పోలీస్ అధికారులను కోరుతున్నానని అన్నారు. ప్రజాప్రతినిధిగా డిమాండ్ చేస్తున్నా. వదిలిపెట్టమని కేటీఆర్ హెచ్చరించారు.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at Flat No. 301, 8-2-273, 276 & 277, 3rd Floor,Pavani Estate, Indradhanush Complex,Road No. 2, Banjara Hills,Hyderabad – 500034, Telangana, Editor : M.M.RAHMAN RNI No. APTEL/2013/50370